చరిత్ర

# మన దృక్కోణం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# మన దృక్కోణం

దత్తోపంత్ ఠేంగ్డే

అనువాదం :

స్వాతి

నవభారతి ప్రచురణలు

# మనవి

శ్రీ దత్తోపంత్ ఠేంగ్డే పేరెన్నికగన్న మేధావి. కార్మిక నాయకునిగా, ఆయన తెలియనివారులేరు. అలాగే భారతీయ కిసాన్ సంఘ్ స్థాపకుడిగా ఆయన కృషిని విస్మరించలేము. అయితే వీటన్నిటికీ మౌలికమైన విషయం ఆయన భారతీయమైన విలువలు ఆధారంగా రూపు చేపట్టిన ఉద్యమాలను నిర్మించటం. ఆయన రచనలు కూడ బహుళ ప్రజాదరణ పొందినవి.

ఇదివరలో మేము శ్రీ దత్తోపంత్ ఠేంగ్డే రచనలను తెలుగువారికి అందించాం. యిప్పుడు 'దిపెర్స్పెక్టివ్' పేరుతో ఆయన ఆంగ్ల భాషలో వెలువరించిన వ్యాస సంకలనాన్ని అందిస్తున్నాం. తెలుగులో ఆ గ్రంథాన్ని అనువదించి యిచ్చిన శ్రీ స్వాతిగారికి, గ్రంథ ముద్రణకు అనుమతి నిచ్చిన శ్రీ దత్తోపంత్ ఠేంగ్డేగారికి ఆంగ్ల ప్రచురణకర్తలు, సాహిత్య సింధూ - బెంగుళూరు వారికి మా కృతజ్ఞతాపూర్వక వందనములు.

వైశాఖ పూర్ణిమ
ప్రభవ
13 మే, 1987
హైదరాబాదు.

సంపాదకుడు

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | భారత దేశం సత్రం కాదు | .... | 1 |
| 2. | నిత్యం మారే 'ఇజాలు' - అనంత ధర్మం | .... | 12 |
| 3. | హిందూ సంస్కృతిలోని అసలు ఉద్దేశ్యాలు సద్గుణాలు | .... | 16 |
| 4. | జెండ్ - అవెస్తా నిర్లక్ష్యం చేయబడ్డ హిందూ సంస్కృతి | .... | 20 |
| 5. | హిందూ రాష్ట్రం వేదాంత పురాతనమైంది | .... | 22 |
| 6. | ద్రవిడ - వాదం | .... | 27 |
| 7. | బుద్ధుడు - మార్క్స్ - డా॥ అంబేద్కర్ | .... | 40 |
| 8. | బౌద్ధమతం తప్పు మార్గంలో పడుతోందా ? | .... | 44 |
| 9. | బుద్ధుడు ఓ చర్చిని స్థాపించలేదు. | .... | 50 |
| 10. | మన హిందూ సమాజం డా॥ అంబేద్కర్ | .... | 53 |
| 11. | నిమ్నవర్గాలవారి స్థితిగతులు నిజంగా మెరుగుపడ్డాయా? | .... | 58 |
| 12. | హిందూ జాతీయతే నిష్కృతి మార్గం | .... | 61 |
| 13. | మన రెండో శత్రువు | .... | 72 |
| 14. | చైనాలో కన్ఫ్యూషియనిజం-కమ్యూనిజం | .... | 83 |
| 15. | మార్క్సిజం - రైతాంగం | .... | 90 |
| 16. | కార్మిక విజయం - కమ్యూనిస్టుల వైఫల్యం | .... | 95 |
| 17. | మార్క్సిజం - హిందూత్వం | .... | 97 |
| 18. | ఇస్లాం - కమ్యూనిజం-రెండు భిన్న ధృవాలు | .... | 107 |
| 19. | భారతీయ దృష్టిలో ఆర్థిక సూత్రాలు | .... | 116 |
| 20. | జాతీయత - విదేశీ తెగల వాదం | .... | 132 |
| 21. | జాతీయతా విచ్ఛిన్నతకు కారణాలు | .... | 140 |
| 22. | స్వదేశీ క్రైస్తవులతో మాట, | .... | 148 |

# 1. భారత దేశం సత్రం కాదు

ప్రతి దేశానికి జాతి వెన్నెముక. దేశ పురోగతి, కీర్తి, సంస్కృతి, సంపత్తి-ఆ మాటకొస్తే సర్వస్వమూ ఆ జాతి మీదే ఆధారపడి వుంటాయి. దేశంలో నివసించే అందరు ప్రజల్నీ ఒకే జాతిగా గుర్తించటం అనేది సహజమైన విషయం.

క్రీ. శ. 15వ శతాబ్దం ప్రాంతాల్లో కొన్ని దేశాల ప్రజలు విపరీతమైన సంఖ్యలో వలసలు వెళ్ళటం, కొత్త భూభాగాన్ని ఆక్రమించుకోవటం జరిగింది. కొన్ని సందర్భాల్లో అయితే అక్కడి స్థానిక ప్రజల్ని సమూలంగా నాశనం చేసి, వాళ్ళ భూభాగాన్ని సంపూర్ణంగా ఆక్రమించుకోవటమూ జరిగింది. ఉదాహరణగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలను చెప్పుకోవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత కూడా కొత్త కొత్త మార్పులు వచ్చాయి. కొత్త దేశాలు పుట్టుకొచ్చాయి. అంతకుముందున్న దేశపుటెల్లలు నశించిపోయి కొత్త ఎల్లలు సృష్టించబడ్డాయి.

ఈ కొత్త మార్పులతో 'దేశంలో ఒకే జాతి' అనే సర్వసహజమైన ఆలోచన మారిపోయింది.

"అసలు జాతి అంటే ఏమిటి?"

"ఒకే భూభాగంలో వుండే రకరకాల సంప్రదాయాలున్న ప్రజల్ని ఏమనాలి?"........ఇలాంటి అనేక ప్రశ్నలు పుట్టుకొచ్చాయి. సరే! ఈ వ్యాఖ్యానాలకూ, సిద్ధాంతాలకూ కారణమేమిటి?

## భారత్‌లో :

భారతదేశం అతి ప్రాచీనమైంది. పుణ్య భూమి, కర్మ భూమి. పాశ్చాత్య ఖండాల్లో నివసించే ప్రజలు చరిత్రలో ఇటీవలికాలందాకా సంచాయుగా ఆయా భూభాగాల్లో తిరుగుతూ దేశ ద్రిమ్మరి జీవితాన్ని గడిపేవారని ప్రతీతి. వీళ్లు క్రమంగా ఒక్కో భూభాగంలో స్థిరపడ్డాక దేశాలు ఏర్పడ్డాయి. దీనికి ఎంతో ముందునుంచే, అనాది కాలంనుంచే నాగరికంగా, సాంస్కృతికంగా, ఒకే జీవన పంథాతో, ఒకే జీవన ధ్యేయంతో ఒకే జాతిగా వుంటున్నారు భారతీయ ప్రజలు. కాని ప్రస్తుతం పరిస్థితి ఎలా వచ్చిందంటే ఇప్పుడు మళ్ళీ మనం జాతీయతకు తాత్పర్యాన్ని చెప్పుకో వలసివస్తోంది! 'జాతి' అనే మాటలో వున్న అంతరార్థాన్ని వివరించుకో వలసివస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది?

మనం ఎక్కడికో సుదూరంలోవున్న కుగ్రామానికి వెళ్లాం అను కోండి. అక్కడి ప్రజల ఆచారాలు, అలవాట్లు కొత్తగా వుంటాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించి, వాటికి మూలం ఏమిటి అని ఊహాగానంచేసి ఓ నివేదికను తయారుచేస్తాం. ఆ నివేదికలో వివరించిన విషయాలను మనం కొత్తగా కనుక్కున్నట్లుగా, నివేదికే ఓ బ్రహ్మసృష్టిగా బీరాలుపోతాం. అవి మనకు కొత్త. కాని ఆ ప్రజలు అక్కడే, ఆయా ఆచార వ్యవహారాలతో ఎన్నో వేల సంవత్సరాలనుంచి పరంపరాగతంగా నివసిస్తూనేవున్నారు. మన అజ్ఞానాన్ని పోగొట్టుకుని వాళ్లను మనం అర్థం చేసుకున్నామా, లేక వాళ్లు వాళ్ల జీవిత విధానానికి నిర్వచనం చెప్పుకోవాలా? ఏది అసలు సత్యం? అదే జరిగింది భారతీయులమైన మన విషయంలోనూ.

నాగరికంగా ఇదివరకే కళ్లు తెరిచి, మన దేశానికి వలసవచ్చి, ఇక్కడి మన పరంపరాగత జీవనవిధానాన్ని స్పృశించి అర్థంచేసుకోవటం

మొదలెట్టినవాళ్ల వెర్రికేకలివి. జాతి అంటే ఏమిటో సరిగా అర్థం కాని తమదేశాలస్థాయిలో మనల్ని బేరీజువేసి అడిగే ప్రశ్నలివి. 'నీది అజ్ఞానం' అని ఘాటుగా చెప్పటం పోయి, 'మనమె ఒకే జాతేనా!' అని ఆలోచించు కోవటం అసందర్భమైన విషయం.కాని దురదృష్టకరమైన విషయం ఏమిటంటే- మన నాయకవర్గం ఈ విషయంలో తప్పటడుగులు వేస్తున్నారు. మన చరిత్రను వీళ్ళు ఆమూలాగ్రంగా అధ్యయనం చేసి అర్థం చేసుకోక పోవటం మరో దౌర్భాగ్యం. చారిత్రక సత్యాలనుంచి నిర్ణయాలు తీసుకోవటం పోయి ఎవరి మాటనో పట్టుకుని కొత్త సిద్ధాంతాలు రూపొందించి వాటికి అనుగుణంగా చారిత్రక సత్యాలను మలచాలని చూస్తున్నారు మన నాయకులు. ఏ ఎండ కాగొడుగు పట్టే వీళ్ల మనస్తత్వమే ఇందుకు కారణం అని చెప్పుకోవాలి.

"భారతదేశం ఓ ధర్మ సత్రం లాంటిది. ఎన్నో జాతుల వాళ్ళు వచ్చారిక్కడికి. అంతా ఒకే జాతికాదు. వీళ్ళందరితో ఓ కొత్త జాతి రూపొందుతోంది" అన్నారు విదేశీయులు.

"ఓహో! అవునౌను" అన్నారు మన నాయకులు.

"అమెరికా కూడా అంతేకాదా? పోల్చిచూసుకోండి. మీరూ అంతే. వాళ్ళలానే ఒక జాతిగా రూపొందుతున్నారు" అని గట్టిగా చెప్పేశారు తెల్లవారు.

"అవునవును. తమరు చెప్పేక మరేమిటి?" అన్నారు మనవాళ్ళు.

కాని మన చరిత్రను సమగ్రంగా గ్రహించి అన్నమాటలేనా ఇవి! అమెరికాతో మనకు పోలికేమిటి?

అసలు అమెరికాలో ఏం జరుగుతోంది?

## అమెరికాకు వలసలు

కొలంబస్ సముద్ర మార్గం కనుక్కున్నాక అమెరికాకు ఐరోపా దేశాలనుంచి వలసలు మొదలయ్యాయి. కొద్ది కొద్దిగా మొదలైన ఈ వలసలు సంవత్సరాలు గడిచేకొద్దీ ఉధృతమయ్యాయి. వందల సంఖ్య పోయి లక్షల సంఖ్యలో సాగాయి వలసలు. 'అట్లాంటిక్ సముద్రం దాటితే చాలు- వేలాది ఎకరాల భూమి మనదే. అదే మనకు బైబిల్‌లో వాగ్దానం చేసిన భూమి. కదలండి!' అని బయలుదేరారు ఐరోపా ఖండంలోని అన్ని దేశాలవాళ్ళు.

మొదట పెద్ద సంఖ్యలో అక్కడ నివాసాలు ఏర్పరుచుకున్నవి ఆంగ్లో సాక్సన్లు. అక్కడ తాత్కాలిక ప్రభుత్వాన్ని, కొన్ని చట్టాల్ని రూపొందించి వలసదార్లకు భూమి పంపకాలుకూడా మొదలెట్టారు వీళ్ళు. ఆంగ్ల భాష, ఆంగ్ల సంస్కృతి, వాళ్ళ ఆచారవ్యవహారాలు అమలులోకి వచ్చాయి. ఆటు తర్వాత పెద్ద సంఖ్యలో వచ్చిన వాళ్ళు జర్మన్లు. మిగతా అన్ని ఐరోపా దేశాల వాళ్ళు మొదట్లోనే ఆంగ్ల భాషను కొద్దోగొప్పో నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడ్డది, యూదులతో సహా. ఆఫ్రికానుంచి బానిసలుగా తేబడ్డ నీగ్రోలూ వున్నారు.

వీళ్ళందరూ భిన్నభిన్న ఆచారాలతో సంప్రదాయాలతో వచ్చిన భిన్నజాతుల వాళ్ళని మనం జ్ఞాపకం వుంచుకోవాలి.

మరి ఈనాటికైనా వీళ్ళంతా ఒకే జాతిగా సంలీనం అయ్యారా? అమెరికా జాతీయ నిర్మాణం పూర్తయిందా? ఇవి మొదటి రెండు ప్రశ్నలు.

అక్కడ నివసిస్తున్న ఈ భిన్న వర్గాలవాళ్ళు ఒకే భావావేశం ఆధారంగా ఒకేజాతిగా ఏర్పడ్డారా? అమెరికాలో మిశ్రమ సంస్కృతిని,

మిశ్రమ జాతీయతను సాధించటానికి జరిగే ప్రయత్నాలు ఫలించాయా? ఇవి మరికొన్ని ప్రశ్నలు.

మిల్టన్ గోర్డాన్ అనే శాస్త్రజ్ఞుడు అమెరికాలో వున్న అల్ప వర్గాల మధ్య సంలీనం గురించి చాలా విస్తృతంగా పరిశీలించాడు. "దీన్లో చాలా ఇబ్బందులున్నాయి. బ్రిటన్‌నుంచి వలసవచ్చిన భిన్న వర్గాల వాళ్ళమధ్య మాత్రం ఒకే సాంస్కృతిక ధోరణిని చాలావరకు సాధించటం జరిగింది. మిగతా వర్గాల వాళ్ళ విషయంలో ఈ సంలీనం సాధ్యపడటంలేదు. తరాలు గడిచిపోతున్నా వీరి మధ్యవున్న జాతి, మతభేదాలు అంతరించటంలేదు. సాంఘిక సంస్థల్లో, వాటి కార్యక్రమాల్లో, సాధారణ పౌరజీవనంతో సహా భిన్న ప్రకృతులు కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే వున్నాయి" అన్నాడాయన.

## హెచ్చరికలు, కొన్ని ప్రయత్నాలు :

కలగూరగంప జాతి అమెరికాది. ఎలా కలపాలి, ఒకే జాతిగా ఎలా రూపొందించాలి ? ఇవి సమస్యలు. నాలుగు శతాబ్దాలుగా వస్తున్న సమస్యలు.

అమెరికా చరిత్రలో జార్జి వాషింగ్టన్, జఫర్సన్ల పాత్రలు అతి కీలకమైనవి. ఆంగ్లో సాక్సన్లు కానివాళ్ళు అతిపెద్ద సంఖ్యలో స్థిరపడిపోవటం వీళ్ళకు నచ్చేది కాదు. మనస్సులో ఓ రకమైన అసంతృప్తి వుండేది. 'అమెరికన్ జాతీయతకు మూలం ఆంగ్ల జీవన విధానాలకు అనుగుణంగా వుండటమే. ఆంగ్లేయ సంస్థల్ని స్థాపించటం; ఆంగ్ల భాష, ఆంగ్లేయ సాంస్కృతిక విధానాల్ని అమలుపరచటం - ఇవన్నీ అమెరికా జాతీయ జీవన పంథాలో ప్రముఖంగా వుండాలి!' ఇదీ వాళ్ళ సిద్ధాంతం.

"ఆంగ్లో సాగ్జన్లు కానివాళ్ళు అసలు దేశంలో దిగుమతి అవుతున్నారు. వీళ్ళు తమ భాషల్ని మర్చిపోరు. ఆచార వ్యవహారాల్ని, అలవాట్లనీ తమతోపాటే దిగుమతి చేస్తారు. వాటిల్లో కొన్ని మంచివి వుండొచ్చు కాని ఎక్కువ భరించరానివే. వాటిని వాళ్ళు వదులుకోరు" అని వాపోయ్యాడు వాషింగ్టన్. థామస్ జెఫర్సన్ వీళ్ళ విషయంలో కొంత ఔదార్యాన్ని చూపించినా, ఉప్పెనలా వచ్చిపడే వలసల విషయంలో ఇలాంటి ఉద్దేశ్యాన్నే కనబరిచాడు. జర్మన్లు పెన్సిల్వేనియాలో తమ ప్రత్యేకతను నిలుపుకోవాలని చేసే ప్రయత్నాలను బెంజమిన్ ఫ్రాంక్లిన్ బహిరంగంగా, అతి తీవ్రంగా గర్హించాడు కూడా.

ఆంగ్లో సాగ్జన్ల ఆధిక్యత కోసం ఎన్నో చట్టాలు కూడా చేశారు. 1830, 1840 ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. 1850 ప్రాంతంలో 'అమెరికన్' పార్టీ ఏర్పరచటం, 1882 లో ఫెడరల్ సెలక్టివ్ చట్టాన్ని రూపొందించటం-ఇవన్నీ వలసల్ని అదుపులోకి తేవటానికే. అయినా వలస వచ్చే వాళ్ళల్లో తమ తమ దేశంమీద ప్రేమ, పక్షపాతం వదల్లేదు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో యూరోపు భూఖండంలో అన్ని దేశాల మధ్య పోరాటాలు చెలరేగాయి. ఇక్కడి అమెరికాలో వలసవచ్చిన వాళ్ళు తమతమ పూర్వదేశాలు ఏ ఆవేశాలతో వున్నాయో అలానే ప్రవర్తించటం మొదలెట్టారు. అమెరికా భూఖండంలోనే ప్రపంచయుద్ధం మొదలయ్యే పరిస్థితి రావటం చూచి వీళ్ళల్లో తమ తమ ప్రత్యేక దేశీయ భావాల్ని తరిమేసి అందర్నీ ఆంగ్లో సాగ్జన్ పంథాలో అమెరికన్లుగా చెయ్యాలనే ఉద్దేశంతో 'అమెరికనీకరణ' ఉద్యమం మొదలెట్టారు. అనుగుణంగా 1929 లో ఓ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. దీని ఉద్దేశ్యం ముందుగా దేశాల వారీగా వలసల్ని పరిమితం చెయ్యటం. 1952 లో మళ్ళీ మెకారన్-వాల్టర్ నిబంధన ప్రవేశపెట్టారు. ఇదికూడా వలసల్ని పరిమితం చెయ్యటానికే.

ఇంగ్లాండు నుంచి వలసవచ్చిన వాళ్ళకు సహజంగానే కోటాలు (**Quotas**) అధికంగా వుండేవి. ఆటు తర్వాత జర్మన్లకు. ఫ్రాన్సు, ఇటలీ దేశాలను లాటిన్ దేశాలు అనేవారు. వీళ్లకు తక్కువ కోటాలు. అలానే మరితర దేశాల వాళ్ళకూను. నీగ్రోలను నల్లవాళ్లు (**Blacks**) అని పిలుస్తారు. వాళ్ళను ఏయే దేశాలనుంచి తీసుకవచ్చారో ఏమో ! అయినా, బానిసలకి కోటా లేమిటి? ఇలా జరిగింది పంపిణీ.

ఉత్తర, పశ్చిమ ఐరోపా ప్రాంతాలనుంచి వచ్చిన వలసదార్లు ఆంగ్లో సాగ్జన్ల స్థాయిలో జీవన విధానాన్ని త్వరగా అలవాటు చేసుకునే వాళ్లు. తూర్పు ఐరోపావాళ్లు మాత్రం చాలా భిన్నంగా వుండేవాళ్ళు. చట్టాలు చేశారు, నిబంధనలు రూపొందించారు. ప్రభుత్వ విధానాలు ఏర్పాటు చేశారు. కాని ఏవీ అవగాహన ఆంగ్లో ట్యూటానిక్ వర్గాల వారి కున్నట్లు మిగతావారికుండేది కాదు. ఆచరణా అంతే. ఎవరి ధోరణి వాళ్ళదైంది.

"మా జాతీయ స్థాయిని బలహీనపరచి, మా పౌరజీవితాన్ని విపరీత మైన అంచనాలతో నింపి కుళ్ళి చెయ్యటానికే ఉపయోగపడ్డది వీళ్ళ రాక" అనేవారు ఆనాటి నాయకులు. అంతేగాదు, వారి ఆందోళన మరెంతో....

"ప్రతిచోట వీళ్ళు గుంపులుగా చేరి విడిగా కాలనీలు ఏర్పరచు కున్నారు. తమ తమ ప్రత్యేక జాతీయ ఆచారాలను, అలవాట్లను, ఆన వాయితీలను ఆచరించటం మొదలెట్టారు. ఇలా వదిలేస్తే భవిష్యత్తులో తరాలు కూడా విడిగా వుండటమే జరుగుతుంది. వీళ్ళ కాలనీలను విడగొట్టి అందరితో కలిసి వుండేలా చెయ్యాలి. ముఖ్యంగా వీళ్ళ పిల్లల మనస్సుల్లో ఆంగ్లో సాగ్జన్ అలవాట్లను, జీవిత విధానాలను పెంపొందించాలి, కొత్తగా

ఏర్పరచిన చట్టాలను, ప్రజాతంత్ర రీతులను వీళ్ళ మనస్సుల్లో స్థిరంగా నాటుకునేలా చెయ్యాలి. ఇదే ఓ పెద్ద కార్యక్రమంలా తయారైంది. మేం నమ్మే సిద్ధాంతాలపట్ల, మా ప్రజాస్వామ్య సంస్థలపట్ల, మా చట్టాల పట్ల వీళ్ళకు భక్తి ప్రపత్తులను ప్రజ్వలింపచెయ్యటమే మా ధ్యేయం", అనేవారు.

ఆంగ్లో సాక్సన్ సూత్రాల ఆధారపడే అమెరికన్ జాతీయత మిగతా ఆలోచనలు పెరిగితే కలుషితమై పోతుందనే ఆందోళన కనిపిస్తుంది. ఈ మాటల్లో అసలు ఓ కొత్త జాతీయతే ఏర్పడదనే భయమూ కనిపిస్తుంది.

అమెరికా గురించి చెప్పుకుంటే ఇదీ అక్కడి వాతావరణం. ఈ వాతావరణంలోంచి జాతీయతను సృష్టించటానికి వాళ్ళ పెనుగులాట చాలా ఏళ్ళుగా సాగుతోంది. ఎందరో నాయకులు ఎన్నో సిద్ధాంతాల్ని ప్రతిపాదించారు.

## జాతీయ నిర్మాణానికి ఎన్నో సిద్ధాంతాలు :

ఇలా ప్రతిపాదించిన సిద్ధాంతాల్లో హారేస్ కెల్లన్ సాంస్కృతిక అనేకత్వం (Cultural pheratism) సిద్ధాంతం ఒకటి. ఓ యాభై, అరవై ఏళ్ళ క్రితం దాకా ఈ సిద్ధాంతం గురించి చెపుతూనే వుండేవారు.

"అమెరికా సంయుక్త రాష్ట్రం అంటే భౌగోళికంగా, పరిపాలనా పద్ధతితో కలయిక కాదు. విభిన్న సంస్కృతుల సహజీవనం. భిన్న జాతులు కలవాలి. ఈ మేలు కలయికలతో ఆవిర్భవించాలి అమెరికా!" అనేవాడు కెల్లన్.

కెల్లన్ మనోనేత్రం ముందు సాక్షాత్కరించింది ఒకటైతే, జరిగింది మరొకటి. సాక్సన్లు కాని వాళ్ళంతా తమ ప్రత్యేక సంస్కృతి, భాష, ఆచారాలను వదల్లేదు, కెల్లన్ ఆశించిన సహజీవనమూ కుదరలేదు.

హెక్టార్ సెయింట్ జాన్ క్రేవికోయర్ ఫ్రెంచి రచయిత. ఇతను "మూస సిద్ధాంతం" అనే దాన్నొకటి సూచించాడు.

లోహాల్ని కలపాలంటే, ముక్కల్ని మూసలో వేసి, కరిగించి, ఆ ద్రవాలు కలిశాక మళ్ళీ చల్లారుస్తారు. అప్పుడు ఒకే లోహంలా కని పించే మిశ్రమ లోహం తయారౌతుంది. దీన్నే "సంవిలీనం" అందాం. "అమెరికన్ చరిత్రలో ఎల్లల ప్రాముఖ్యత" అనే పుస్తకాన్ని వ్రాసిన ఫ్రెడరిక్ జాక్సన్ టర్నర్ ఇజ్రాయెల్ జాంగ్విల్ అనే యూదు రచయిత కూడా ఇలాంటి సంవిలీన సిద్ధాంతాన్ని సూచించారు.

జాంగ్విల్ ఓ నాటకం వ్రాశారు. దానిలో నాయకుడు డేవిడ్.

"అమెరికానే పుటిమూస. లోహాలను కరిగించే ఓ పెద్ద మూసలాంటిది. భిన్న భిన్న లోహాలలాంటివాళ్ళం, అన్ని ఐరోపాజాతుల వాళ్ళం. మన మంతా ఈ అమెరికా అనే మూసలో కరిగిపోయి, కలిసిపోయి, ఓ సరికొత్త రూపాన్ని సంతరించుకుంటాం. ఇక్కడ మీరంతా యాభై వర్గాలుగా, యాభై భాషలతో, యాభై రకాల చరిత్రలతో, జాతివైరాలతో నిలబడు తున్నారు. కాని సోదరులారా! చాలాకాలం వరకు మీరు ఇలానే వుండరు. ఇక్కడ దేవతాగ్నులు ప్రజ్వరిల్లుతున్నాయి. మీ జన్మవైరాలు, ప్రతీకార వాంఛలు తృణప్రాయంగా ఈ అగ్నిలో భస్మమైపోతాయి. ఆ దేవుడు జర్మన్లను, ఫ్రెంచివాళ్లను, ఐరిష్‌జాతులు, ఆంగ్లేయులు, యూదులు, రష్యన్లు అన్న భేదాలు లేకుండా అందర్నీ ఈ బ్రహ్మాండమైన మూసలో కరిగించి,

అమెరికన్లుగా పోత పోస్తున్నాడు" అని సంవిలీన (మూస) సిద్ధాంతాన్ని డేవిడ్ ద్వారా వివరించాడు జాంగ్‌విల్.

ఈ నాటకం 1908 లో బాగా ప్రచారంలో ఉండేది. కెన్నడీ శ్రీమతికి మరో కొన్ని విషయాలు స్ఫురించాయి. సంవిలీనం సిద్ధాంతం ప్రజల్లో నాటుకొనే రోజుల్లోనే మొదటి ప్రపంచయుద్ధం వచ్చిపడింది. ఆ యుద్ధకాలంలో సంవిలీన సిద్ధాంత ఆదర్శాలు, ఆవేశాలు, భావాలు అలానే మాటల్లో ఉండిపోయాయి గాని, అమల్లోకి మాత్రం రాలేదు. ప్రజల మనస్తత్వాలు యుద్ధ వాతావరణంలో విచిత్రంగా మారాయి. తాము తమ దేశాన్ని వదిలివచ్చి చాలా సంవత్సరాలైంది. కొందరి విషయంలో తరాలు కూడ గడిచిపోయ్యాయి. అయినా జర్మన్లు తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవడాన్ని గురించే ఆలోచించసాగారు. ఆంగ్లేయుల్ని అనుసరించ టాన్ని వ్యతిరేకించారు. కొత్తగా తయారౌతున్న అమెరికన్ జాతిలో కలవ లేకపోయ్యారు. కొందరు జర్మనునాయకులైతే సంయుక్తరాష్ట్రంలో జర్మన్ ప్రాంతాన్నొకదాన్ని సృష్టించాలని ఆశపడ్డారు కూడ. అంతకు ముందు నుంచే దానిన వివాదం కూడ చెలరేగి కొనసాగుతోంది. సంయుక్త రాష్ట్రం ఛిన్నాభిన్నం అవుతుందనేదాకా వెళ్ళాయి పరిస్థితులు. సందులో సందుగా ఈ వివాదంలో రాష్ట్ర విచ్ఛిత్తి అయితే, వెంటనే తమకొక జర్మన్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవాలనే యోజనలూ సాగాయి. ప్రపంచ యుద్ధ వాతావరణంలో ప్రతి జర్మన్ కూడా అమెరికా దేశ శత్రువుగా రూపొంద గలడనే అనుమానం మొదలైంది. ప్రమాదకర పౌరుడిగా తయారు చేసింది. అమెరికనీకరణ గతి అలా తయారైంది.

సంవిలీన సిద్ధాంతాన్ని నమ్మి ప్రచారం చేసేవాళ్ళుకూడా జరిగే విషయాల్నిచూచి నిస్పృహ చెందారు. మరో వివాదంకూడా తలెత్తసాగింది. అదే మతం.

అందరి మతాలు ఒక్కటే, క్రైస్తవం. వారిలో భేదాలున్నా మూలం ఒక్కటే గదా; ఈ ఆధారంతో అందరూ కలిసి పోగలరనే ఆశ వుండేది. కాని, రాను రాను ఆ ఆశ సన్నగిల్లింది. అమెరికన్ సమాజం కాథొలిక్, ప్రొటెస్టెంట్, యూదు అనబడే మూడు వర్గాలుగా రూపం దిద్దుకోసాగింది.

"అమెరికా స్వరూపం మత విభేదాలతో మూడు ముక్కల్లా వుండే!" అన్నది శ్రీమతి కెన్నడీ. మరి ఓ జాతిగా ఎలా రూపొందాలి? పాత జాతీయతలు పోవాలి. క్రైస్తవుల్లోని విభేదాలూ పోవాలి. ఇతర మతాల విభేదాలు పోవాలి. అన్నీ పోయి ఒక జాతి పుట్టాలి. ఎలా?

1818లో రాజ్యాంగ కార్యదర్శిగా వుండేవాడు, జాన్‌క్విన్సీ ఆడమ్స్. ఆయన ఓ సారి ఉత్తరం రాస్తూ అమెరికా భవిష్యత్తును గురించి ఆందోళన వ్యక్తం చేశాడు.

"అమెరికన్ జాతిని గురించి మొదట ప్రతిపాదనలు చేసినవాళ్ళు చాలా చిత్త శుద్ధికలవాళ్ళు. తాము కోరింది ఏమిటో, దాన్ని ఎలా సాధించాలో వాళ్ళకు స్పష్టంగా తెలుసు. కాని రాను రాను తర్వాతి తరాల వాళ్ళ ఆలోచనలలో మార్పులు వస్తున్నాయి. వీళ్ళ పోకడలు అసలు ఆదర్శానికి భిన్నంగా వున్నాయి.

అమెరికాకువచ్చినవాళ్ళు స్వేచ్ఛాయుత జీవితంలోకి అడుగుపెట్టారు. సర్వమూ ఇక్కడ సమృద్ధిగా వున్నాయి. కాని వాళ్ళు ఓ విషయాన్ని మరిచిపోకూడదు. ఈ దేశం మంచి చెడ్డలతో తాదాత్మ్యం పొందాలి. నైతిక, రాజకీయ, భౌతిక విషయాల్లో వాళ్ళకు ఎన్నో మార్పులు కనిపిస్తూ వుండవచ్చు. తాము వదిలిపెట్టి వచ్చిన ఐరోపా దేశాల పరిస్థితు

లకు ఇక్కడి పరిస్థితులు ఎంతో భిన్నంగా వుండొచ్చు. కాని పూర్తిగా సర్దుబాటు చేసుకొని, ఈ దేశ శ్రేయస్సు కోసమే పాటుపడాలి. అలాకాక తమ స్వార్థం మాత్రమే చూసుకొని దేశ సమగ్రతను పట్టించుకోకపోయినట్లయితే ఇక్కడ అన్నింటినీ అనుభవిస్తూ మాత్రం కొనసాగటం దుర్లభం. అదుగో! అట్లాంటిక్ మహాసముద్రం ఎదురుగా సిద్ధంగా వుంది. తట్టా బుట్టా సర్దుకుని ఇంకా తమ స్వదేశాలే అనుకునే ఐరోపా దేశాలకు వెళ్ళొచ్చు. వాళ్ళు కచ్చితమైన నిర్ణయానికి రావల్సిన అవసరం ఎంతైనా వుంది. అమెరికన్లుగా తాము పొందాలని ఆశించే ఆనందాలకు, ఐశ్వర్యాలకు దూరమై ముందు ముందు చాలా నిరాశ పొందాల్సివస్తుంది. ఇక ఐరోపా మనుగుల్ని వదిలించుకోవాల్సిన సమయం వచ్చింది. భవిష్యత్తు వైపు దృష్టి సారించి తర్వాతి తరాల శ్రేయస్సుకూడా ఆలోచించాలి. పాత విషయాలు, పాత సంప్రదాయాలు మర్చిపోవాలి. ఇక్కడ ఎవరెవరంటే ఎవరూ గొప్ప కాదు. అందరూ ఒక్కటే.

తమ పిల్లల మనస్సుల్లో తాము వదిలివచ్చిన దేశాలపట్ల అభిమానాన్ని, పక్షపాత వైఖరిని పెంచటం ఎంతో ప్రమాదం. కాళ్ళిక్కడ, జీవనం ఇక్కడ, అభిమానాలు అపేక్షలు మరోచోట. ఇది ద్వంద్వ ప్రవృత్తికి దారితీస్తుంది. భవిష్యత్ సంతతి యావత్తూ కేవలం అమెరికా దేశాన్ని ప్రేమించే అమెరికన్ పౌరులుగా మాత్రమే తయారవ్వాలి."

ఆడమ్స్ వెలిబుచ్చిన ఆందోళనలో అమెరికాలో నెలకొనివున్న భయంకర పరిస్థితి వివరంగా తెలుస్తుంది. వలసవచ్చిన ఐరోపా దేశవాసులంతా ఒకేజాతిగా రూపొందటానికి ఎన్ని ఆటంకాలు, ప్రతిబంధకాలూ వున్నాయో; అసలా ఆలోచనే ఎంత దుస్సాధ్యంగా వుందో తెలుస్తుంది. ఇదీ అమెరికా జాతీయతా సాధన చరిత్ర!

## మరి భారత్‌కు పోలికెక్కడ ?

మరి 'భారత్‌లో కొత్తజాతి' గురించి మాట్లాడేవాళ్ళు ఏ విషయంలో మనల్ని అమెరికాతో పోలుస్తున్నట్లు! ఇప్పుడిప్పుడే పుట్టి కళ్లుతెరుస్తున్న దేశాల విషయంలో ఏ పరిస్థితులున్నాయో అవే ప్రపంచంలో ఎన్నో లక్షల సంవత్సరాలనుంచి స్థిరంగావున్న అతి సనాతన సమాజాల విషయంలో కూడా నిజం అని ఎలా అనుకోగలరు? అసలు భారత్‌లో పురాతనకాలం నుంచి వికాసం పొందిన 'రాష్ట్రీయత్వ' భావం పాశ్చాత్య జాతీయతకు ఎంతో భిన్నమైంది. అంతేకాదు దానికంటే ఎంతో విశాలమైంది, ఉన్నతమైంది. విదేశాల్లోవుండే గందరగోళాలను భారత్‌కు ఆపాదించి ఎలా సతమత మవుతున్నారు మన నాయకులు? ఈ విషయంలో తమ తెలివితేటలనంతా చూపి విషయాన్ని మెలిక తిప్పటం అనాలోచితం. హ్రస్వదృష్టితో, లేకుంటే మరేదో స్వార్థ చింతనతో చేసేపని ఇది.

చరిత్ర విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో విషయాన్ని గ్రహించాలి. విశ్లేషించి సత్యాన్ని అర్థం చేసుకోవాలి. వితండవాదాలు పనికిరావు. చరిత్ర విషయంలో ఎవరో చెప్పినదాన్ని నమ్మి తప్పుదోవ పట్టరాదు. చరిత్రను వక్రీకరించరాదు. వందదేశాలనుంచి వలసలుపోయి సర్దుకోలేక సతమతమయ్యే అమెరికన్ సమాజం సత్రంజాతి కావొచ్చు. అమెరికా సత్రం కావొచ్చు. హిమాలయ పర్వతాలనుంచి, ఆ సింధు గంగా సాగర పర్యంతం, హిందూ మహా సముద్రం దాకా ఒకే సామాజిక వ్యవస్థతో వున్న మన సమాజానికి ఆ అమెరికన్ సమాజానికి పోలికలేమిటి? హిమాలయా పర్వతాల్లో శ్రీరాముడు సీతభర్తే, తమిళదేశంలోనూ సీతభర్త రాముడే. శ్రీకృష్ణుడు భారతీయ భూభాగంలో అన్ని మూలలా వందనీయుడే. ఈ గడ్డమీద వున్నది సమగ్రంగా రాష్ట్రీయతాభావాన్ని జీర్ణం చేసుకున్న ఓ విశిష్ట జాతి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, తదితర దేశాల్లోలా సంకీర్ణ జాతి కాదు.

# 2. నిత్యంమారే "ఇజాలు" - అనంత ధర్మం

సనాతన ధర్మం విశ్వజనీనం. ఇది మానవ నిర్మితంకాదు. మొదట హిందువులు గ్రహించింది కాబట్టి దీన్ని హిందూధర్మం అంటారు. పాశ్చాత్యదేశాల్లో భూమ్యాకర్షణ శక్తిని మొదట గ్రహించింది న్యూటన్. సాపేక్ష సిద్ధాంతాన్ని గ్రహించింది ఐన్‌స్టీన్. ఆ రెండూ వాళ్ళ పేర్లతోనే చలామణీ అవుతున్నాయి గదా! ఈ ధర్మాన్ని మొదట చూడటమేగాకుండా ఈ ధర్మ సూత్రాల పునాదుల పైనే సాంఘిక-ఆర్థిక వ్యవస్థను కూడా నిర్మించుకున్నారు హిందువులు. కాలంగడిచేకొద్దీ తలెత్తే వివిధ సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి అనుగుణంగా వ్యవస్థను మార్చుకుంటూ సుఖజీవనం చెయ్యసాగారు. కాని పద్ధతులు మారినా మూలం ఆ సనాతన విశ్వజనీన ధర్మమే! ఆచరణ సందర్భానుసారంగా మారవచ్చుకాని అన్నీ ఒకే సత్యం యొక్క ప్రత్యక్ష స్వరూపాలే. అదే ధర్మం! ఇదే హిందూధర్మంలోవున్న సజీవత్వం.

ఇజాలు:- ఇజాలు ఆలోచనా స్రవంతికి అడ్డుకట్టలు. ఇజాల ఉపయోగం అతి పరిమితం. ఒక కాలంలో ఒక సమాజంలో ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించుకోవటానికి పనికి వస్తాయి. ఒకే కాలపరిమితిలో విభిన్న సమాజాల సమస్యలు భిన్నంగావుంటాయి. సమస్యల స్వరూపాలు ఒకే రకంగా వున్నా ఆయా సమాజాల ఆచార వ్యవహారాల్నిబట్టి పరిష్కార మార్గాలుంటాయి. ఒకే సమస్యకు, ఒకే సమాజంలో కాలాన్ని బట్టి పరిష్కారం మారొచ్చు.

అంటే ఏ ఒక్క "ఇజమూ" ఒకే కాలంలో అన్ని సమాజాలకూ సరిపోక పోవచ్చు, ఒకే సమాజానికి అన్ని కాలాల్లో పనికిరాకనూ పోవచ్చు. పరిస్థితులు ఎప్పుడూ మారుతూ ఉంటాయి. ఇజాలు అలాకాదు. ఇజాల ఆలోచనలు విస్తృతంకావు. అతి పరిమితం. హ్రస్వదృష్టి, పరిమిత ఆలోచనలు ఇజాల సహజ లక్షణాలు.

సాధారణంగా ఇజాలు మనం అనుకొన్నట్లుగా వుండవు. మనం అతిగా మాట్లాడుకొనే మార్క్సిజాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. 'దాస్ కాపిటల్'లో మార్క్స్ పెట్టుబడి విధానం అంతర్గత వ్యతిరేకత్వంలో ఎలా ముక్కలౌతుందో వ్రాశాడుగాని, ఆర్థిక సోషలిజం గురించిగాని, రాజకీయ తంత్రాంగం గురించిగాని ఒక్కమాటా వ్రాయకపోవడం విచిత్రం అనిపిస్తుంది. తత్ఫలితంగా మార్క్సిజం ఓ ఇజంగా పనికిరాదు. అసంపూర్ణమైంది. ఈనాడు మార్క్సిస్టులం అని చెప్పుకొనే ప్రతివాడూ అవతలివాడిని భిన్నవాది (Deviationist) అనడం ఇందువల్లనే!

ఇజాలకు మరో లొసుగుంది. ఇజాన్ని ప్రతిపాదించేవాడు ఎంత మేధావైనా తన సిద్ధాంతాలకు ఒక రూపానివ్వటంలో, కొన్ని నిర్ణయాలు చెయ్యటంలోనూ ఆనాటి మానవ మేధాశక్తి, స్థాయీలమీదే ఆధారపడాలి. కాని మానవ విజ్ఞాన అభివృద్ధికి పరిధులు లేవు. ఈనాటివరకు అంగీకరించిన శాస్త్రీయ సిద్ధాంతాలు కాలానుగుణంగా కనుక్కొనే కొత్త విషయాల ఒరవడిలో అశాస్త్రీయమై పోతున్నాయి. వాటి ఆధారం మీద తయారైన సూత్రాలన్నీ తత్ఫలితంగా అర్థరహితం అవుతాయి. కాబట్టి రోజులు గడిచేకొద్దీ, జ్ఞానం పెరిగేకొద్దీ "ఇజం" భూతమై (వాజం-Wasm) పీడిస్తుంది మన ఉద్దేశ్యంలో.

"కొత్తవాటికి చోటిచ్చి పాత ఇజాలు పోతాయి. ధర్మం ఎన్నో విధాలుగా పరిపూర్ణం అవుతూవుంటుంది. లేకుంటే ఏదో ఒక ఇజం ఈ ప్రపంచాన్ని కుళ్ళిపోయేట్టు చేస్తుంది."

# 3. హిందూ స్మృతిలోని అసలు ఉద్దేశాలు, సద్గుణాలు

వివిధ మతాలవాళ్ల హిందూధర్మం ఏమున్నా ఆలోచనాతీరు, దాన్ని అన్ని మతాల కలయికలా చేసినా, చట్టాల విషయంలో వున్న తీరుమాత్రం దాన్ని విశ్వధర్మంగా నిలబెట్టింది. రూపొంది అది నియమబద్ధం చేసిన న్యాయసూత్రాలు విశ్వవ్యాప్తం కాలేదు. కానీ మనింపు చట్టాలకు అలవాటుపడ్డ మనకు హిందూ న్యాయచట్టాల అభివృద్ధి ఆశ్చర్యం కలిగించక మానదు. మొదట మనం చూడాల్సింది వేదాలను వాటికి అనుబంధంగా వున్న షడ్దర్శనాలను. తర్వాత ధర్మశాస్త్రాలు. ధర్మశాస్త్రాలను తయారుచేసినవాళ్ళు వివిధ కాలాల్లో జీవించారు. మనువు, అత్రి, విష్ణు, హారీత, యాజ్ఞవల్క్య, ఉశనస, ఆంగీరస, వ్యాస, శంఖ, లిఖిత, దక్ష, గౌతమ, శతాతప, వసిష్ఠ- వీళ్ళందరూ ధర్మశాస్త్రాల నిర్మాతలు. మిగతా పురాతన మూలాలు, మీమాంస, న్యాయ, పురాణాలు. హిందూ న్యాయ చట్టాలకు ఉత్కృష్టమైన స్మృతులు,ఆచారాలు,సద్భావన, నిరంతర అంతర్మథనంతో ఉద్భవించే ఆలోచనలుకూడా దోహదకారిగా వుంటాయి.

తర్వాతి కాలంలో పుట్టుకొచ్చిన నిబంధనలు, వ్యాఖ్యానాలు మూల గ్రంథాలను మూలకు నెట్టటం విచిత్రం. నిబంధనలను తయారు చెయ్యటం ఓ వెయ్యేళ్లనుంచి జరుగుతూనే వుంది. తొమ్మిదో శతాబ్దం నుంచి పంథొమ్మిదో శతాబ్దం దాకా ఈ పని సాగింది. ఆఖరు నిబంధన వారన్ హేస్టింగ్స్ కోరిక ప్రకారం తయారైన "వివాద భంగార్ణవ." దీనికే "వివాదార్ణవసేతు" అనికూడా మరో పేరు వుంది. ఈ నిబంధనలు దేశం

లోని అన్ని మూలల్లో హిందూ న్యాయ శాస్త్ర కూటాలకు కారకాలయ్యాయి. తూర్పు ప్రాంతాల్లో దాయ భాగ కూటం ఉత్తర భారత్ మొత్తానికి ఆధార మైన కాశీ,గండక,కోసీ, గంగ నదుల మధ్య వున్న ప్రదేశానికి ఆలవాలంగా వున్న మిథిల, మహారాష్ట్ర, బెరార్, ఉత్తర కర్ణాటక, సింధు ప్రాంతాల కున్న పశ్చిమ కూటం, దక్షిణాన పాత మద్రాసు ప్రెసిడెన్సీ భాగానికో కూటం, పంజాబ్‌ను ఆదేశించే పంజాబ్ కూటం- ఇవన్నీ ఏర్పడ్డాయి.

అనాది కాలంనుంచి హిందువులు ఓ నాగరిక సమాజంలా బ్రతుకుతున్నారు. ఈ కాల గమనంలో ఎప్పుడూ ఒక నిబంధనా చట్టాన్ని అమలు జరుపుకోలేదు. స్మృతులు నిబంధనలు కావు. ఒక స్మృతి మరోదాన్ని బహిష్కరించదు. అధిగమించదు, కాదని త్రోసిపెయ్యదు. అన్ని స్మృతులు న్యాయ శాస్త్ర మూలకాలే!

హిందూ న్యాయ శాస్త్రంలో మరో విశేషం వుంది. స్మృతికి, ఆచారానికి విభేదం వుంటే, ఆచారానికే ఎక్కువ విలువ. కేరళలో అమలులో వున్న "మరుమ్మకతాయం" చట్టం దీనికి ఒక ఉదాహరణ. మన సమాజంలో అనేక పొరల నాగరికతలు అభివృద్ధి చెందాయి. అన్నీ హిందూ సాంఘిక ఆర్థిక చట్రంలోనే ఇమిడి ఉన్నాయి. అమలు పరుచుకొనే తీరు వేటిది వాటిదే. హిందూ న్యాయ శాస్త్రాలను ప్రపంచంలోని అన్ని జాతులు అమలు పరుచుకొనే విషయంలో ఈ దృక్పథం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని అసంకల్పితంగానైనా వాళ్లు అందరూ గ్రహించిననాడు అంతా హిందువులే కాగలరు.

పాశ్చాత్య విద్యను అభ్యసించినవాళ్లు మతాన్ని, చట్టాన్ని, శాస్త్రాల్ని కలగాపులగం చేస్తుంటారు. అది పొరపాటు. మతాల్ని ప్రబో

పెట్టినవాళ్ళ చట్టాల్ని ఇష్టపడరు. అబ్రహాం, జీసస్ ఆరాధన పొందుతారు. కొందరు, వేళ్ళమీద లెక్కపెట్టగలిగినవాళ్ళున్నారు. మతాన్ని, చట్టాన్ని కూడా తామే ప్రవేశపెట్టారు మహమ్మద్ ప్రవక్తను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సమగ్రమైనది, అన్నింటినీ ఇముడ్చుకోగలది, చైతన్య వంతమైనదీ అయిన హిందూ న్యాయశాస్త్రం భారత్‌లోని అందరు ప్రజల్ని, విదేశీయుల్ని కూడ తన పరిధిలో ఇముడ్చుకోగలదు. ఎవరో కొందరు సడలింపు ధోరణి ఏ మాత్రం లేని వాళ్ళు తప్ప మిగతా అందరికీ ఇబ్బంది వుండదు. వీళ్ళుకూడా కాలక్రమేణా తాము ఆచరించేసూత్రాలు ఎంత పాతవో, మారే కాలానికి ఎంత అసందర్భమైనవో, హాస్యాస్పదమైనవో, కొత్త పరిస్థితుల్లో తమ సమస్యలను ఎలా తీర్చలేకుండాపున్నాయో అతిత్వరలోనే గ్రహించగలరు. ఈ పనికిరాని, చాదస్తపు, పురాతత్వం నిబంధనల్ని వదిలించుకుని తీరుతారు.

హిందూ న్యాయశాస్త్రం ప్రకారం 'హిందు' అన్న పదంలా 'వైదిక' అన్న పదం విస్తృతార్థం కలిగివుంది. హిందు అనబడే ఓ పెద్ద వృత్తంలో వైదికులు ఒక ముఖ్యభాగం మాత్రమే. అంతేకాదు. మన రాజ్యాంగంలోని 25వ నిబంధన ఈ విషయంలో అతి స్పష్టంగా వుంది. దాన్లోని ఉప నిబంధన 2(b) సిక్కు, జైన, బౌద్ధమతాలు అనుసరించే వాళ్ళంతా; హిందూ మత సంస్థలు కూడా హిందు అన్న పరిధిలోకే వస్తారని చెప్తోంది. రాజ్యాంగం మొత్తంలో హిందూ అన్న పదానికి అధికార పూర్వక నిర్వచనాన్ని చెప్పే నిబంధన ఇదే!

రాజ్యాంగ నిర్మాతలు హిందూత్వం మీద సాధికార ప్రమాణం కలిగివుండేవాళ్ళని మనం అనుకోవటంలేదు. కాని ఇచ్చిన నిర్వచనం సమస్య పరిష్కారానికి మంచి మార్గం అనవచ్చు. ఈ ఉద్దేశ్యంతోనే టి. డబ్ల్యు. రైస్‌డేవిడ్స్ తన ప్రఖ్యాత పుస్తకం 'గౌతముని జీవితం'లో

"గౌతముడు చాలా గొప్పవాడు, మేధావి, అతి చక్కని హిందువు" అని వ్రాశాడు. మత భేదాలకు సంబంధం లేకుండా హిందూ న్యాయశాస్త్రంలో అందరు భాగస్వాములే. డెమొక్రిటస్ పాశ్చాత్య దేశాల్లో భౌతికవాదం ప్రవేశపెట్టడానికి వేలాది సంవత్సరాలముందే భారత్‌లో బృహస్పతి ఈ వాదాన్ని ప్రవేశపెట్టాడు. హిందువుల్లో ఆస్తికులు కూడా బృహస్పతిని గురువుగా అంగీకరించారు. హిందువుల పవిత్ర గ్రంథాలను విమర్శించి వ్యతిరేకించిన కపిలుడూ హిందువే. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్న ప్రకారం గౌతముడు పరివ్రాజకుడయ్యే నాటికి భారత్‌లో బ్రాహ్మీ వేదాంతంతోబాటు 62 విభిన్న సిద్ధాంతాలుండేవి.

సరియైన పరిశోధన కొనసాగిస్తే పారశీలకులు అనుసరించే సాంఘిక ఆచారాల ఆధారంగా వాళ్ళూ హిందూత్వంలో భాగమేనని తేలగలదు. వాళ్ళ ఆరాధ్య గ్రంథం 'జెండ్-అవెస్తా' ఛండ-అవస్థా! ఈ విషయం స్పష్టంగా వాళ్ళకూ తెలీదు, మనకూ తెలీదు.

విశ్వహిందూ పరిషత్ వాళ్ళు చేబట్టిన బృహత్కార్యంలో ఇటు దేశంలో, అటు విదేశాల్లో అండగా నిలవగల స్థిరాస్తి హిందూ స్మృతుల్లోని సుగుణాలు, మూలతత్వాలే. ఈ శాస్త్రాల అద్భుత ఫలితాలను తమకు తాముగా నిరాకరించే వాళ్ళుతప్ప మానవాళి మొత్తం స్వాగతించగలదు. మనువు తన స్మృతికి 'మానవ ధర్మశాస్త్రం' అని పేరుపెట్టటంలో గల ఔచిత్యాన్ని గ్రహించవచ్చు. పాశ్చాత్య ఆలోచనల పరిధిలో, వాళ్ళ నిబంధనల గోలలో కొట్టుకపోకుంటే హిందూ న్యాయ శాస్త్రాలు హిందువులకు ఎనలేని నిధులు.

# 4. 'జెండ్ అవెస్తా' నిర్లక్ష్యం చేయబడ్డ హిందూ స్మృతి

ప్రపంచ వ్యాప్తంగా వున్న హిందువుల్ని ఒకే వేదిక మీదికి తేవటానికి విశ్వహిందూపరిషత్ ప్రయత్నిస్తోంది. నిర్లక్ష్యంచేయబడ్డ మన పాత గ్రంథాల గురించి సమగ్ర పరిశోధన చేయటం చాలా అవసరం. ఈ పరిస్థితే కొనసాగితే మనమే నిందలపాలు కావలసివస్తుంది. బాధ్యత మనదే అవుతుంది. మన పారశీక సోదరుల జెండ్ అవెస్తా ఆ కోవలోకి వచ్చే గ్రంథమే.

ప్రొ॥ మాక్స్‌ముల్లర్, డా॥ హాంగ్, యల్. హెచ్. మిల్స్, సర్ విలియం జోన్స్ ఇంకా మరి కొందరు ఈ గ్రంథ విషయంలో వ్రాసిన విషయాలవల్ల కొన్ని ముఖ్యమైన సంగతులు బయటపడ్డాయి :

1. జెండ్ అవెస్తా కేవలం 'ఛంద అవస్థా' కల్తీ రూపం.
2. జెండ్ అవెస్తాలో కనీసం 60 శాతం మాటలు స్పష్టమైన సంస్కృతం మాతృకగా కల పదాలు.
3. వేదాలకు, అవెస్తాకు వ్యాకరణ పోలిక ఉన్నాయి.
4. సంస్కృత పదాలను ఓ క్రమపద్ధతిలో సంకరం చేసి పెడగొట్టటం జరిగింది. ఉదాహరణకు 'ట' - 'త'గా మారింది. స్వ - స్యగా, హ - జ గా, స - హ గా మార్పులు చెందాయి. అరబ్బీ భాషలో కూడా సంస్కృత 'స' - 'హ' గా మారటం చూడొచ్చు.
5. 'అర్యమాస' అనే సంస్కృత పదానికి స్నేహితుడు, భగవంతుడు అని రెండర్థాలున్నాయి. అవెస్తాలో కూడా ఐర్యమానకు అవే అర్థాలున్నాయి. సంస్కృతంలో 'మిత్ర' అనే పదానికి మూడర్థాలు - సూర్యుడు, స్నేహితుడు, దేవుడు. 'మిత్ర్' అన్న పదాన్ని అవెస్తాలో అవే అర్థాలతో వాడారు. 'గొ' కు అలాగే రెండు భాషల్లోనూ రెండర్థాలు - గోవు, భూమి.

6. వేద భాష, అవెస్తా భాష ఒకే భాష రెండు స్వరూపాలు.
7. వేదాల్లో వున్న గాయత్రి, త్రిష్టుప, అనుష్టుప, అసురి, ఉషతి లాంటి ఛందస్సులు ఎన్నో అవెస్తాలో కూడా వున్నాయి.
8. యజ్ఞవిధి వాటి రకాలు, పరికరాలు రెంటిలో ఒకేరకంగా నిర్దేశించబడ్డాయి. రెండూ 'సోమ' 'హోమ' కు ఒకే ప్రాముఖ్యత నిస్తాయి.
9. రెండూ 'అగ్ని' ఆరాధనకు ప్రాముఖ్యత నిస్తాయి.
10. రెండూ గోవు, గోమూత్రాల ప్రాముఖ్యతను ఉదహరిస్తాయి.
11. పారశీకులను ఆర్య అని వర్ణించటం పరిపాటి. అవెస్తాలో ఆర్యత్వాన్ని పొగడటం జరిగింది.
12. రెంటిలో తత్వ విచారం, సృష్టి జ్ఞానం, సృష్టి వికాసం విషయాలు లాంటి ఎన్నో శాస్త్రాల్లో దాదాపు ఒకేరకమైన ఆలోచన వుంది.
13. వేదాల్లోని ముప్పై ముగ్గురు దేవతలకు అవెస్తా చెప్పే ముప్పై ముగ్గురు 'రథుల'కు పోలిక వుంది.
14. అవెస్తా కర్మ, పునర్జన్మలను గుర్తిస్తుంది.
15. గోవును సమాజ స్వరూపంగా అవెస్తా గౌరవిస్తుంది.
16. అవెస్తాలో సనాతన తత్వ జ్ఞానాన్ని గురించి చెప్పబడ్డది.
17. పారశీకులకూ కూడా ఉపనయనం వుంది. దాన్ని 'కుషాతి' అంటారు.
18. అవెస్తాలో వర్ణించిన సాంఘిక పద్ధతి చాతుర్వర్ణ్యాలకు పోలివుంది.
19. అవెస్తాలో బ్రాహ్మణుని అథర్వ, అథర్వణ అని, క్షత్రియుల్ని రథేస్త్రో, రథేష్ట అని పిలవటం చూడొచ్చు.
20. డా॥ హాంగ్ 'బ్రాహ్మణులు, పార్శీలు ఒకే కులానికి చెందిన రెండు వర్గాలు' అని నిర్ణయించాడు.

ఈ ఆధారాలతో జెండ్ అవెస్తా 'విస్మృతం చేయబడ్డ హిందూ శాస్త్రమే' అని పరిశోధన చేసి నిరూపించాల్సిన బాధ్యత మనదే!

# 5. హిందూ రాష్ట్రం వేదాలంత పురాతనమైంది

రాష్ట్రీయత్వ సిద్ధాంతం మన దేశంలో అతి పురాతనకాలంనుంచి నెలకొనే వుంది. ప్రపంచ చరిత్ర ఓ స్వరూపాన్ని పొందేసరికే భారత్ సర్వసంపూర్ణ రాష్ట్రంగా స్థిరపడివుంది. అందువల్లనే జాతీయత (nationalism) అనే ఆంగ్లపదం మన రాష్ట్రీయత్వానికి పర్యాయపదమని, అలా పిలువబడే వ్యవస్థల స్వరూపం ఒకలానే వుండగలదని మనం నమ్ముతూ వచ్చాం. కాని చారిత్రక సత్యాలు ఈ ఆలోచనకు భిన్నంగా వున్నాయి.

## ఐరోపాలోని జాతీయత నెపోలియన్ కాలంనుంచే

ఐరోపా చరిత్రలో మొదట కుటుంబం ఒక సామాజిక కూటమి (unit)గా వుండేది. క్రమంగా తెగ ఒక కూటమైంది. ఐరోపా ఖండమంతా స్థిరంగా వుండక నిత్యం తిరిగే సంచార తెగలతో నిండివుండేది. వాళ్ల జీవన విధానం వల్లనే ఒకచోట నివాస స్థలంమార్చి, తిరగాల్సి వచ్చేది. ఈ పద్ధతివల్ల వాళ్లకు స్థిరంగా ఓ భూభాగంమీద ప్రేమాభిమానాలు పెంపొందే అవకాశం లేకపోయింది. రక్తసంబంధాల ఆధారంగా వున్న తెగలే ఆ కాలంలో సాంఘిక వ్యవస్థకు మూలాధారాలయ్యాయి. మధ్యయుగంలో వ్యవసాయం ఆధారంగా స్థిరపడ్డ సమాజాలవల్ల కొన్ని వందల ఏళ్ళ తర్వాత ప్రాదేశికవాదం ప్రారంభమైంది. ఈ రెంటి కలయిక కారణంగా జాతీయతా భావోత్పన్నత ఫ్రెంచి విప్లవం నాటికి పూర్తయింది. ఉదాహరణకు ఇంతకు ముందు ఇంగ్లాండు, ఇంగ్లీషు వాళ్ళ

నివసించే దేశంగా వుండేది. కాని ప్రస్తుత నిర్వచనం ప్రకారం ఇంగ్లాండులో నివసించే ప్రజలు అందరూ ఇంగ్లీషు వాళ్లే! ఇంగ్లాండు భూభాగం అని పిలవబడేదాన్ని ఇంగ్లీషు రాజులు పరిపాలించేవాళ్లు. కింగ్ జాన్ మొదటి ఇంగ్లాండు రాజు. అలానే ఫ్రాన్సురాజులకు ముందు ఫ్రాంకురాజులుండేవారు.

మిగతా దేశాల్లో చరిత్ర ప్రారంభం కాకముందే భారత్‌లో జాతీయ భావం స్పష్టంగా వ్యక్తమైంది.

తర్వాతి కాలంలో తరచిచూస్తే ఓ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఐరోపాలో మొట్టమొదటిసారిగా సక్రమమైన నాయకత్వాన్ని అందించ గలిగిన గ్రీకులు ఓ జాతికాదు, ఒకే దేశం కాదు. వాళ్ళకు పట్టణాలే రాష్ట్రాలు. గ్రీకుజాతి, గ్రీకురాజ్యం అనివుండేవికావు. రోమ్‌కూడ ఓ పట్టణ రాష్ట్రం. రోమ్ సామ్రాజ్యస్థాయిని అందుకొనే నాటికక్కూడా, అది ప్రదర్శించింది, ఓ పట్టణానికి పరిమితమైన సామ్రాజ్యవాదమే కాని, రోమన్ జాతీయతకాదు. రోమ్ సామ్రాజ్యం, రోమన్ జాతీయతాభావాన్ని కలిగించలేక పోయింది. ఆలంబనము కాలేకపోయింది. క్రైస్తవ చర్చి పరిధిలో క్రైస్తవులంతా ఒకే కుటుంబానికి చెందినవాళ్ళు. చర్చి ప్రాబల్యం ఉన్నన్నినాళ్ళూ జాతీయత ఉద్భవం సాధ్యం కాలేదు. 18 వ శతాబ్దం మొదలు దాకా యుద్ధాలన్నీ రాజవంశాలకు, మతాలకు మాత్రమే చెందివుండేవి. ఉదాహరణకు, లూయిస్ - 14 ను ముందుపెట్టుకొని, ఇంగ్లాండ్ "రాజుల యుద్ధాలు" చేసింది (King's wars). మొట్టమొదటి ఆంగ్ల జాతీయతాయుద్ధం పద్ధెనిమిదో శతాబ్దంలో జరిగిన "వార్ ఆఫ్ జెంకిన్స్ ఇయర్" (War of Jenkin's Ear).

# హిందూరాష్ట్ర ఆవిర్భావం

సంయుక్త అమెరికారాష్ట్రాల, గ్రీకుల ఆంఫిక్టియోనిక్ లీగ్ పద్ధతిలో నెపోలియన్ ఆలోచన సాగించిన సమయంలో విభిన్న దేశాల్లో జాతీయతా భావం ఎంతవరకూ అభివృద్ధి చెంది వుంటంటారు ?

“ఐరోపాలో ముప్ఫై మిలియన్ల ఫ్రెంచివారు, యాభై మిలియన్ల ఇటాలియన్లు, మరో ముప్ఫై మిలియన్ల జర్మన్లు వున్నారు. వీళ్ళందరితో నేనో ఐక్య జాతిని రూపొందించ దలిచాను. ఫ్రెంచి వాళ్ళలో ఐక్యత కోసం పాటుబడ్డాను. స్పెయిన్లో అది అసాధ్యమని తేలింది. ఇటాలియన్లను ఓ జాతిగా రూపొందించాలంటే నాకు ఓ ఇరవై ఏళ్ళు కావలసి వస్తుంది. జర్మన్లనో జాతిగా తీర్చి దిద్దాలంటే మరెంత ఓర్పు కావాలి” అని వాపోయ్యాడు నెపోలియన్.

ఫ్రాన్సులో నెపోలియన్ సాధించగలిగినట్లు, ఇంగ్లాండులో “ఛాథం” జాతీయతా భావం గల ఓ తరాన్ని నిర్మాణం చెయ్యగలిగాడు. ఎనిమిదవ హెన్రీ కాలంలో ఇంగ్లాండులో పోప్ నియంతృత్వం పట్ల చెలరేగిన వ్యతిరేకత; ఎలిజబెత్ రాణి కాలంలో మతరూపేణా స్పెయిన్ కొనసాగించిన ఆక్రమణకు ఫలితంగా ఉద్భవించిన వ్యతిరేకత; స్పైస్ దీవులమీద డచ్చి వారి సైనిక చర్య ఫలితం; కెనడా; భారత్‌లలో ఫ్రెంచివారి ఆక్రమణా ధోరణికి తలెత్తిన విజృంభణ - ఇవన్నీ కలిసి “ఛాథం” నేతృత్వంలో అతి ప్రగాఢ జాతీయతా తత్వం నెలకొనింది. విప్లవదినాల తర్వాత పాత ధోరణిలో ఫ్రాన్సు మొత్తం ఖండానికి వ్యతిరేకంగా నిల్చింది. ఫ్రెంచి వారిలోని విప్లవ ధోరణిని నెపోలియన్ చాకచక్యంగా తీవ్ర దేశాభిమానంగా మలిచాడు. విడిపోయిన జర్మన్లమీది యుద్ధాల్లో నెపోలియన్ ఛావు దెబ్బలు కొట్టగలిగాడంటే అది కేవలం ఫ్రెంచివారిలో మేల్కొన్న

జాతీయతా భావం వల్లనే. జర్మన్ జాతీయతా భావానికి "ఫ్లిఖ్ట్-గి ఫుహ్ల" (Phlicht-Ge Fuhl) ధ్యేయనిష్ఠ ఆధారమైంది. ఆస్ట్రియన్ల క్రౌర్యాల, దుర్మార్గాలవల్లనే ఇటాలియన్ జాతీయత మేల్కొంది. నెదర్లాండు దేశంలో ఫిలిప్ యొక్క సైన్యాధిపతుల అఘాయిత్యాల ఫలితంగానే జాతీయతా జ్వాల మేల్కొంది. ఇలా ఐరోపాలోని ప్రతిదేశంలో ఇటీవలి కాలంలోనే జాతీయ వ్యతిరేక సంఘటనల వల్లనే ప్రజలు చైతన్యవంతు లయ్యా రనవచ్చు.

ఇలా మేల్కొన్న జాతీయతా భావం యొక్క ఫలితాలు తెలిసినవే. హిమాలయాలంత పురాతనమైన భారతీయ రాష్ట్రీ తత్వమంత గాఢంగా, పవిత్రంగా పాశ్చాత్య జాతీయతా భావం వుండటం అసంభవం. భారత్‌లో మాతృభూమి, జాతీయ సమాజం అనే ఈ రెండూ ఎంతగా పెనవేసుకు పోయాయంటే ఒకదాన్ని వదిలి మరోదాన్ని గుర్తుకు తెచ్చుకోలేం. ఈ నేల-ఈ రక్తం, ఈ రక్తం-ఈ నేల, ఒకటి లేకుండా మరొకటి లేదు. తత్ఫలితంగా అందరిలోనూ అతి ఉదాత్తమైన, పవిత్రమైన, అతి సున్నితమైన ఆవేశాలు సర్వసహజరీతిలో సర్వస్వాన్ని భారతమాత పాదాలవద్దే అర్పితం చెయ్యాలనే భావన పెంపొందించి. భారతీయ రాష్ట్రీత్వంలోని ప్రత్యేకత ఇదే! ఏ ఇతర దేశంలో కూడా ఇలాంటి భావావేశాలు, ఇంత సుదీర్ఘ కాలం సాధించి నిలుపుకోవటం అసాధ్యం. ఏది ఏమైనా భావావేశాలు మనస్సులో లోతుగా నాటుకోవాలంటే కాలగమనం ఓ ముఖ్యవిషయం.

## ఐరోపా జాతీయత సంకుచితం-మత వ్యతిరేకం:

మరో విషయం! విప్లవాత్మక ధోరణిలో, వ్యతిరేక వాతావరణంలో ఉద్భవించిన పాశ్చాత్య జాతీయత సహజంగానే అంతర్జాతీయతా భావంతో కలవలేదు. భారతీయ రాష్ట్రీయత దేశానికి వ్యతిరేకం బాధ్య-సగుణాత్మకం.

పురాతన కాలంలో భారతీయుల్ని విశిష్టంగా ప్రత్యేక గుర్తింపుతో నిలబెట్టింది వారి సంస్కృతే! అదే విశ్వసంస్కృతి. ఈ ప్రత్యేక గుర్తింపు వల్లనే హిందూ జాతీయతకు అంతర్జాతీయ దృక్పథాలు వుండటం సహజమే. అలానే విశ్వజనీన భావనా సరళి కూడా పాశ్చాత్య ఆలోచనలో వ్యక్తమయ్యే జాతీయత, అంతర్జాతీయతల మధ్య వున్న సంఘర్షణ హిందూ జాతీయతాభావంలో లేదు.

మూడో విషయంకూడా ముఖ్యమైనదే. పాశ్చాత్యదేశాల్లో జాతీయతాభావం సరికొత్తది. అక్కడి వాళ్ళ మేధస్సులో భక్తిని ప్రేరేపించే ఇటీవలి విషయం. ఇప్పటిదాకా ప్రబలంగా వున్న కొన్ని శక్తివంతమైన భావావేశాలకు ప్రతిద్వంద్విగా ఎదురు నిల్చి, ఈ కొత్త జాతీయతా భావం నిలతొక్కుకోవలసి వుంది. శతాబ్దాల నుంచి ఆధిక్యతను సంతరించుకొన్న చర్చి, అటు తర్వాత తలెత్తిన ఏ కొత్త భావాలకైనా పెద్ద సవాలుగా నిలుస్తుంది. ఐరోపాలో జాతీయతను నిలబెట్టాలనుకొనే అన్ని దేశాల అధినేతలు దీన్ని ఎదుర్కోక తప్పలేదు.

“ప్రజా జీవితాన్నుంచి యూదుల్ని తొలగించాం. వాళ్ళ ఆలోచనా కేంద్రం మాస్కో. కేథలిక్కులూ రోమ్‌నే తమ కేంద్రంగా చూస్తారు, కాబట్టి వాళ్ళనూ తరిమేశాం. అంతర్జాతీయతను పట్టుక ఊగులాడుతుంటారు ఫ్రీమేసన్స్. అందుకని వాళ్ళనూ వదిలించుకొన్నాం” అంటారు డా॥ గోబెల్స్. ఇలానే దాదాపు అన్ని ఐరోపా దేశాలూ, విదేశాలపట్లగల భక్తి శ్రద్ధలతో కొద్దో గొప్పో బాధపడుతూనే ఉన్నాయి. పాశ్చాత్య జాతీయతా భావ తీవ్రతను బలహీనపరిచే మరో అంశం ఇది.

భారతీయ ఆలోచన సంపూర్ణ భక్తి భావాన్ని ప్రదర్శిస్తుంది. భారతీయుల విశ్వాసం పితృభూమి (father land), పవిత్ర భూమి

(**Holy land**)ల మధ్య చీలిపోదు. భారత్ రెండుగాను. యాత్రా స్థలాలు అన్నీ తన పొలిమేరల మధ్యలో వున్నందువల్లగాదు, ప్రతి అంగుళం భూభాగం తనకు పవిత్రమైనందువల్లనే ఈ భావం.

పాశ్చాత్య విద్యా మైకంలో పడ్డ మన మేధావులు మనదైన ప్రతి దాన్ని పాశ్చాత్య కొలమానంతో విలువ కట్టడం మొదలుపెట్టారు. అందు వల్లనే రాష్ట్రీయత, జాతీయతల అర్థాల్లో తడబాటు. ఈ పదాలు రెండూ సమానమైన అర్థం కలవని మనవాళ్ళు నమ్మటం మొదలెట్టారు. కాని నిజానికి వీటి మధ్యవున్న స్పష్టమైన భేదం ఎంత గుణాత్మకమైనదంటే ఒకదాని కొకటి సరిపోలదు. మన రాష్ట్ర భావం ఎన్నో విధాలుగా ప్రత్యేకమైంది. పాశ్చాత్యులు రాష్ట్ర భావానికి సమానమైన పదాన్ని అసలు ఊహించలేకపోయ్యారు.

# 6. ద్రవిడవాదం

మనం ఇంతగా అనుకునే జాతీయ సమైక్యత ఎలా సాధ్యం? నిజ మైన జాతీయతా భావాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలి. మొదట పెడ ర్థాలకు దారితీసే తుంటరి వాదాల్ని నిర్దయగా నలిపేయకుంటే కూడా ఇది అసాధ్యమై పోతుంది. ఓ ఎండమావిగా మిగిలిపోతుంది. ద్రవిడస్థాన్ ఏర్పాటును కోరుతున్న 'ద్రవిడ ఇజం' ఇలాటి ఓ తుంటరి ఆలోచన. అసలు దీన్ని ప్రవేశ పెట్టిందెవరు?

ఈ 'ద్రవిడ' అనే పదం ముత్తార్ (మొదటి), ఎడై (మధ్య), కడై (ఆఖరు), సంగం (సంఘ) కాలాల్లోని తమిళ గ్రంథాల్లో ఎక్కడా మనకు కనిపించదు.

ఈ ద్రవిడ సిద్ధాంతాన్ని మొదట ప్రవేశ పెట్టినవాడు బిషప్ కాల్డ్ వెల్. అతను 1856లో వ్రాసిన "ద్రవిడ భాషల్లోని వ్యాకరణంలో పోలికలు" అన్న పుస్తకంలో తాను హిమాలయాలను లంఘించి చైనా, జపాన్, హంగరీ, లాప్‌లాండ్, ఫిన్‌లాండ్, టర్కీ, కాకస్ దేశాల్లో భాషలకు దక్షిణాది భాషలకు సాదృశ్యాన్ని నిర్ధారించటానికి ప్రయత్నించాడు. అతని లెక్క ప్రకారం ద్రవిడులు అనబడేవాళ్లు (?!) తురేనియన్ వర్గం వాళ్ల భాష మాట్లాడుతారట. దీన్నే 'శిథియన్' వర్గం అని అంటారు. ఐరోపావాళ్ల లెక్క ప్రకారం ప్రపంచ భాషలు మూడు రకాలు. ఒకటి శిథియన్. మిగతావి రెండూ 'సెమిటిక్', ఇండో-యూరోపియన్ భాషలు. సంస్కృతాన్ని ఆఖరున చేర్చారు. ద్రవిడ భాషలకు సంస్కృతంతో ఎలాంటి పోలిక లేదని నిరూపించ ప్రయత్నించారు కాల్డ్‌వెల్. వ్యాకరణ స్వరూపం శిథిక్-తురేనియన్లతో పోలివుందంటాడు. పోలికలు ఇండో-యూరోపియన్‌లతో వున్నవి భారతీయ భూమిమీదకు రాలేదని, ఆర్యులకు ముందుండేవారి చరిత్రకు ముందు కాలంలో ఆర్యులు, తురేనియన్లు కలిసి ఒకటే జాతిగా వున్నప్పటివి అని ఆయన వాదం.

## కాల్డ్‌వెల్ సిద్ధాంతాలు వివాదాస్పదమైనవి:

కాల్డ్‌వెల్ ఉద్దేశ్యం ప్రకారం "ద్రవిడభాషల్లో సంస్కృతం చాలా కొద్దిగా వుంది. సంస్కృతభాష కంటే ఎక్కువగా వుంది మిగతాది.

"సర్వనామాలు; అంకెలు; క్రియా నామవాచక ప్రత్యయాలు వాక్యంలో పదాల అమరిక-ఆ మాటకొస్తే భాషను సజీవంగా వుంచే సర్వస్వమూ ద్రవిడ భాషల్లో మౌలికంగా, సమూలంగా సంస్కృతానికి భిన్నంగా వున్నాయి. దక్షిణాది భాషల్లో ఎక్కువగావున్న అసలైన ద్రవిడ పదాల్ని స్థానిక వ్యాకరణ కర్తలు సంస్కృత ధాతువుల

కాలనుంచి విడిగా వుంచి, దేశ్యాలు అచ్చద్రవిడ పదాలు అని విశేషణాలతో గుర్తిస్తున్నారు. మౌలికద్రవిడ పదాలనుంచి ఉద్భవించిన సంస్కృత పదాలను గుర్తించటంలో కష్టం అనిపించలేదు. సంస్కృత తద్భావాలు ఉపయోగించిన ద్రవిడ భాషలు కొన్ని వాటిని పూర్తిగా వదిలించుకున్నాయి. వీటిని అవసరాలుగా కాక అలంకారాలుగా, భాషను అతి సున్నితంచేసే అనవసరమైన నిబంధనలుగా గుర్తించటం జరిగింది."

"ద్రావిడ భాషలన్నిటిలోనూ బాగా అభివృద్ధిచెందిన తమిళం కావాలనుకుంటే సంస్కృతాన్ని పూర్తిగా వదిలించుకుని నిలబడగలదు. ఇంకా పెరగనూగలదు.'' బిషప్ కాల్డ్వెల్ చేసిన వ్యాఖ్యాన సారం ఇది!

అటు తర్వాత ఐరోపా విద్యాధికులు అతని మాటల్లోని నిజానిజాలు పరిశోధించకుండా వాటినే స్థిరసత్యాలుగా ఆమోదించారు. డా॥ కిట్టెల్, డా॥ హెచ్. గుండెర్ట్ ఈ కోవకు చెందినవారు.

కాని తర్వాతి పరిశోధన కారణంగా ఊహించబడే విషయాలు :

1. గ్రీకు రచయితలు అందించిన శిథియన్ పదాలు స్పష్టంగా ఇరానీయులవి. అంటే అవి ఇండో-యూరోపియన్ కుటుంబానికి చెందినవి శిథియన్ భాషలు ఎటువంటి పరిస్థితిలోనూ ఒకే కుటుంబంలో చేర్చలేం; ద్రవిడ భాషలను భారత్‌కు బయటి దేశాల్లోని భాషా కుటుంబాలతో సరిపోల్చాలని చేసిన ప్రయతాలు విఫలమయ్యాయి. (**The Linguistic Survey of India Vol. IV**).

2. ద్రావిడ భాషల్లో బిషప్ చేసిన కొన్ని సిద్ధాంతాలను చూస్తే అవేవో అకస్మాత్తుగా, నిరాధారంగా చేసినట్లనిపిస్తుంది. దక్షిణ భారత భాషలకు, ఆర్యభాషలకు చాలా ప్రగాఢమైన, విప్లవాత్మక సారూప్యా

లున్నాయి. ద్రావిడ ఆర్యభాషల్లో భేదాలు తెల్పినా, సంస్కృత భాషకు మధ్యఉన్న విభేదాలంత తీవ్రంకాదు. తత్ఫలితంగా ద్రావిడ భాషలను ఆర్యభాషల వర్గంలో చేర్చాలేగాని తురేనియన్ భాషా కుటుంబాలతో చేర్చ వీలులేదన్న విషయం ఇంకా సమర్థనీయమే. మామూలు జీవితంలో వాడే పరికరాలు, పనిముట్లు, స్థలాలపేర్లు, పనుల విషయంలో వాడిన పదాలు-ఇవన్నీ స్పష్టంగా ఒకే రీతిలో వున్నాయి. ఉపసర్గలు, సముచ్చయాలు ఆర్యన్ భాషలోవే. (డా.జి. యు. పోప్).

3. ద్రావిడ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కాల్డ్వెల్‌కూ, ఆ తరువాతి వాళ్ళకూ వేదభాషల గురించి, దానిలోంచి ఉద్భవించిన ప్రాకృతాల గురించి తెలీదు.

4. ద్రవిడ వ్యాకరణ రూపాలు ఇండో - ఆర్యన్ వర్ణాలనుంచే పుట్టాయి. ద్రవిడ పరిభాషలోని ప్రాథమిక భాగాల్లో కూడా ఆర్యన్ కానిది చెప్పుకోదగ్గంతలేదు. ద్రవిడ వ్యాకరణం ఆర్యన్ మూలంనుంచే తీసుకోబడ్డది. ప్రాకృతాల్లో మార్పుచెందిన సంస్కృతపదాలు ద్రవిడభాషల్లో మరింతగా మారిపోయి అసలు మూల పదాలు గుర్తించలేనంతగా తయారయ్యాయి. వీటిని సంస్కృత తద్భవాలుగా గుర్తించాలంటే ప్రాకృత శబ్దశాస్త్ర పరిజ్ఞానం వుండాలి. నిజానికి తమిళ విద్వాంసులు 'సెన్-తమళ్' అంటే స్వచ్ఛమైన తమిళం అనే ద్రవిడపదాలు; క్రియా ధాతువులు అపభ్రంశ సంస్కృత తద్భవాలని నిరూపించవచ్చు. నిర్దేశార్థక, ప్రశ్నార్థక, సర్వనామాలు ఆర్యభాషనుండి వచ్చినవే. ద్రవిడ భాషల్లో ఉపయోగించే క్రియాకాలం (tense), 'ల'కార ప్రత్యయాలు ఆర్యన్‌నుంచే తీసుకోబడ్డాయి. ఆర్యన్ కానివి లేనేలేవు. ద్రావిడ వ్యాకరణ రూపాలు, ద్రావిడ ధాతువులకు సంస్కృత ప్రత్యయాలు చేర్చి రూపొందించినవే." (ద్రవిడ సిద్ధాంతాలు - 210. 1 - **Dravidian Theories - ch. I**).

## ఊహలు చారిత్రక సత్యాలై కూర్చుంటాయి!

భాషా భేదం రూపంలో దొడ్డిదారిన భారత్‌లో ప్రవేశించిన ద్రవిడ వాదం క్రమంగా జాతీయ భావ రూపంలో ముందుగదిలో తిష్ఠ వేసుకూర్చుంది. బిషప్ కాల్డ్‌వెల్ పిచ్చిగా చేసిన నిర్ణయాలు కాలక్రమేణా ఏదో పెద్ద నిరూపణ చెందిన సత్యాలుగా మారాయి. శాస్త్రీయ పరిశోధనలు గాని, కనీసం సరిచూట్టంగానీ జరుగలేదు. బిషప్‌గారి "ఉండి ఉండవచ్చు" లాంటి ప్రయోగాలు తర్వాతివాళ్ళు "కచ్చితంగా వున్నవి" అని మార్పు చేసేశారు. 'ఇలావుంటే బాగుండు' అని అతను వ్యక్తీకరించినవి అతని సిసలైన ఊహలు చారిత్రక సత్యాలై కూర్చున్నాయి.

ఈ విషయంలో ప్రమాణాలుగా చెప్పబడుతున్న వాళ్ళ అశాస్త్రీయ దృక్పథం ఈ సందర్భంలో చెప్పుకొనితీరాలి. ఉదాహరణకు వి.ఎ. స్మిత్ తన పుస్తకం "పురాతన హిందూ ఇండియా" (**Ancient-Hindu India - 1920**)లో బిషప్ కాల్డ్‌వెల్ చేసిన వ్యాఖ్యానాల నన్నింటినీ ఆమోదించాడు. మళ్ళీ "పూర్వకాల ద్రవిడ సంస్థల విషయాలను గ్రహించటానికి లభ్యమయ్యే ఉపకరణాలు అతి తక్కువ. ఉన్నవాటి మీద చరిత్ర కోసం చేసిన పరిశోధనలూ అసంపూర్ణమే....భవిష్యత్తులో భాషల విషయంలో మంచి శ్రద్ధాసక్తులు కలిగిన విద్వాంసుడు ద్రవిడ నాగరికత చరిత్రను పరిశోధించి మంచి గ్రంథాన్ని తయారు చెయ్యగలడేమోగాని, ప్రస్తుతం లభించే సాహిత్యం మాత్రం అతి స్వల్పం. పైగా చెదురుమదురుగావుంది. అసలు దీన్ని గుర్తించటానికే కష్టంగా వుంది. లోపాలున్నాయి. ఎన్నో విషయాలు వివాదాస్పదంగా కూడా వున్నాయి" అని మరోచోట వ్రాశాడు. కాని స్మిత్ ఆ నమ్మశక్యంగాని బిషప్ కాల్డ్‌వెల్ సిద్ధాంతాలమీదే ఆధారపడి "ద్రవిడ సంస్కృతి" "ప్రత్యేక ద్రవిడ నాగరికత" అనేవి వున్నాయని మాత్రం అన్నాడు. ఎలా అయినా ఈ పదాలు నలుగురిలో పాకిపోవాలిగా మరి!

మిగతా ఐరోపా విద్వాంసులు ఇలాటి అశాస్త్రీయ దృక్పథాన్నే అవలంబించారు. శ్రీ కనకసభై పిళ్లై ఈ విషయంలో పరిశోధన చేసిన మొట్టమొదటి భారతీయుడు. ఆయన తన ఊహల్ని అతి స్వేచ్ఛగా విహరింపచేసి చరిత్రకు చిత్ర విచిత్ర స్వరూపాన్నిచ్చాడు. ఆయన కల్పనలు, ఇష్టాయిష్టాల మోజులు; మన కాల్డ్‌వెల్ వ్రాతలు వీటన్నింటినీ అటు తర్వాతి రచయితలు చారిత్రక సత్యాలుగా తీసుకోవటం జరిగింది.

ఊహల మీద ఆధారపడి చేసుకున్న నిర్ణయాలు జాతీయ చరిత్ర పరిధిలో ప్రశంసల్ని, గౌరవాన్ని ఎలా పొందగలవు?

## స్వప్నంలో జన్మభూమి

తమనుతామే ఒక ప్రమాణంగా ప్రకటించుకున్న ఐరోపా రచయితలు ద్రావిడ సిద్ధాంతాన్ని భాషాస్థాయినుంచి ఓ జాతీయస్థాయికి పెంచాలని పాటుబడ్డారు. ఈ ద్రావిడులకు ఓ జన్మభూమిని వెతికిపెట్టే బృహత్తర కార్య భారం చేబట్టారు.

"ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో మునిగిపోయిన లెమూరియన్ ఖండం ద్రవిడ నాగరికతకు జన్మభూమి" అని తేల్చారు. మరి ఈ ఊహకు ఆధారాలేమిటి? ఏమీలేవు! ప్రపంచ సాహిత్యంలో ఏ ఒక్క వాక్యంగాని, ఏ శిథిలాలుగానీ కాదు- ఈ ఐరోపా విద్వాంసులు కలగనేదాకా 19, 20 వ శతాబ్దాల వరకూ ఈ ద్రవిడ నాగరికత గురించి ఎవ్వరూ వినలేదు. వాళ్ళ సిద్ధాంతానికి బలం చేకూర్చటం కోసం ద్రవిడ జన్మభూమి అవసరం ఒకటి వచ్చిపడ్డది. అదీ భారత్‌కు బయటవుండాలి. కాబట్టి ద్రవిడ నాగరికత తప్పక ఎక్కడో లెమూరియన్ ఖండంలో అభివృద్ధి చెందే వుండాలి. లేకుంటే హిందూ నాగరికతకు భిన్నంగా ద్రవిడ నాగరికత అనే మరోటి భారత్‌లో వుందంటే నిరూపించుకోవాల్సిన సవాలు

ఎదురౌతుంది. కాబట్టి ద్రవిడ జన్మభూమి సిద్ధాంతం ఓ ఊహ! ఈ ఐరోపా వారి ఊహించే ప్రజ్ఞ చెప్పుకోదగ్గదే. హిందూ యోగుల అంతర్ జ్ఞానాన్ని మించిన ఊహా జ్ఞానం వీరిది! యోగులు భూతకాలంలోకి చొచ్చుక పోయి ఆనాటి స్థితిని గ్రహించే శక్తికలిగివుంటే, వీళ్ళు ఇలా వెనక్కి ప్రయాణంచేసే శ్రమ లేకుండానే ఎన్నడూ లేనిదాన్ని కనిపెట్టటంలో సమర్థులు.

## ఆర్య - దస్యుల అసలు అర్థం

పైగా మరో అవసరం వచ్చిపడింది. 'దక్షిణానవున్న ద్రవిడు లనబడే వాళ్ళు మిగతా హిందూ జాతికి భిన్నమైనవాళ్ళు' అని నిరూపిం చాలి. ఇంతకుముందు అనుకున్నట్లు తమిళ సాహిత్యంలో ఎక్కడా ద్రవిడ పదం కనిపించదు. స్కాంధ పురాణంలోవున్న పంచ - ద్రవిడ భావం ద్రవిడ జాతి సిద్ధాంతాన్ని నిరూపించదు. నిజానికి ద్రవిడులకు, హిందూ స్తాన్‌లోవుండే మిగలావారితోగల ఏకీభావాన్ని తెలియచేస్తుంది. సాంప్ర దాయ పంచ ద్రావిడుల్లో మహారాష్ట్రులు, గుర్జరులు కూడా వున్నారు. ద్రవిడ-ఇజం సిద్ధాంతులకిది అంత అనుకూల విషయం కాదు పాపం. దీనికి మార్గం దక్షిణాది హిందువులను మినహాయించి మిగతా హిందువులకో పేరు పెట్టటమే. 'ఆర్య' పదం దీనికి పరిష్కారం అని ఆలోచించారు. తత్ఫలితమే ఆర్య జాతి సిద్ధాంతం. ఆర్య విరోధి జాతి అనార్యులు, దస్యులు లేక ద్రవిడులు; వీరికి ఆర్యులకు మధ్య యుద్ధాలు. వరసగా అన్నీ పుట్టుకొచ్చాయి.

ఈ ఆర్యపదంలో విశేషత ఏమిటి? డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ లాటి విద్వాంసులు ఈ ఆర్య అనేది ఒక జాతికిగాని, ఒక ప్రాంతానికిగాని

పేరు కాదని గ్రహించారు. ఈ పదానికి మూలం 'ర్' అన్నది. దాని అర్థం 'గౌరవనీయ' 'ఉదాత్త' అని. ఉదాహరణకు 'సాహిత్య దర్పణంలో' నటి, దర్శకులు పరస్పరం ఆర్య అనిపిలుచుకోవాలనివుంది. చిన్నవాడు అన్నను ఆర్య అని పిలవాలనే వాడుక వుంది.

నాలుగు వేదాల్లో వ్యక్తుల గుణశ్రేష్ఠతల, గుణహీనతలనుబట్టి ఆర్య, అనార్య, దస్యు అని పదాలు వాడటం జరిగింది. శ్వపచుడు (ఛండాలుడు) కూడా ఆర్యుడు కావచ్చు. మహా భారతంలో ధర్మవ్యాధుడనే మ్లేచ్ఛుడు తన తపశ్శక్తితో ఆర్యుడు కావటమేకాదు కౌశిక బ్రాహ్మణుడికి బోధ చేయటానిక్కూడా సమర్థుడయ్యాడు. వంశపారంపర్యంగా వస్తున్న వారి ధర్మ వ్యతిరేక వర్గానికి చెందిన ప్రహ్లాదుడిని హిందువులు ఆర్యుడిగా స్వీకరించారు. శ్రీమద్ భాగవతం ప్రకారం సంపూర్ణ ధర్మానుగామి అయిన ఛండాలుడు ఆర్యత్వాన్ని పొందవచ్చు. అదే ధర్మాన్ని ఆచరించని బ్రాహ్మణుడు ఆర్యుడని అనిపించుకోలేడు. శ్రీ శంకరాచార్యుల 'మనీషా పంచకం' ప్రకారం ఆత్మజ్ఞానంలో ఓ స్థాయికి చేరిన ఛండాలుడు ఆర్యుడౌతాడు. ప్రతి వర్ణంలో అనార్యులు, దస్యులు అనే వ్యక్తులుంటారు. ఆర్యత్వంగాని, దస్యుత్వంగాని ఏదో ఒక వర్ణానికి పరిమితంకాదు. మహా భారతంలోని శాంతిపర్వంలో స్పష్టంగా చెప్పిన విషయం:

"దృశ్యంతే మానుషే లోకే
సర్వ వర్ణేషు దస్యవః"

దస్యులు అన్ని వర్ణాల మానవాళిలో వున్నారు.

ఆర్యత్వం ఏ వర్ణంవారి సొంతమూ కాదు. అలా ముడిపెట్టటం తప్పు.

ఇలాటి ఎన్నో నిర్ధారణలు ఆధారంగా గౌరవ శ్రీ బాబాజీ మహరాజ్ పండిట్ టిగువ నిర్వచనాన్ని ప్రామాణికంగా అంగీకరించారు.

"కర్తవ్య మాచరణం కార్యం అకర్తవ్యామనాచరణ్ ।
తిష్ఠతి ప్రకృతాచారే సవై ఆర్య ఇతిస్మృతేహ॥"

ఏది చెయ్యాలో అది చేసేవాడు, ఏది చెయ్యరాదో దానికి దూరంగా వుండేవాడు, నిర్ణీత కృత్యాలను నిరంతరం చేసేవాడు ఆర్యుడు. ఏ యూరోపియన్ శాస్త్రపదవేత్తా ఆర్య అనేది ఒక జాతికిగాని, వర్గానికిగాని, కొంత మంది ప్రజలకుగాని ప్రత్యేకించిన పదంగా నిరూపించలేదు.

## పక్షపాతం అర్థరహిత సిద్ధాంతాలకు దారితీస్తుంది

ఆర్యజాతి, ద్రవిడజాతి అన్న సిద్ధాంతాలను అటు తర్వాత పాశ్చాత్య విద్వాంసులు ఎలా నిర్మాణం చేశారో తెలుసుకోవాలి.

మొట్టమొదట భారత్ ఒకే దేశం కాదని, భారతీయులంతా ఒకే ప్రజ కాదని ఊహించటం జరిగింది. ఏది ఏమైనా వాళ్ళు ఈ దేశంలోని అసలైన నివాసులుకాదు. అల్లా వచ్చిపడ్డ వలసదార్లే అందరూ. ప్రతి వలసా అలా ఒక భాష మాట్లాడే వర్గానిది. అందువల్లే భారత్‌లో ఇన్ని భాషలు మాట్లాడేవాళ్ళున్నారు. విశాలంగా ఆలోచిస్తే భారతీయులను రెండు భాషా వర్గాలుగా విభజించవచ్చు. ఈ రెండు వర్గాలవాళ్ళూ జాతిరీత్యా భాషరీత్యా కూడా వేరుగా ఉండేవారు. నిరంతరం పరస్పరం విరోధంతో వుండేవారు.

సిద్ధాంతం మొత్తం భాషాభేదాలు అన్న అతిబలహీన సూత్రం మీద ఆధారపడివుంది. కాని ఇది నిలవని సిద్ధాంతం. అతి త్వరలోనే ఏవి

ద్రవిడ భాషా విశేషాలు అని అనుకున్నారో అవన్నీ దక్షిణాదికి మాత్రమే పరిమితం కాలేదని తేలిపోయింది. ఈ భాషా విశేషాలు ఉత్తరాదివారి భాషల్లోకూడా కనిపించాయి.

రెండవ అంశం. సంస్కృతాన్ని వీళ్ళు ఇండో-యూరోపియన్ కుటుంబానికి చెందిన భాష అన్నారు. కాని ఈ భాషకు ఇండో-యూరోపియన్ భాషల్లో వున్న కొన్ని స్పష్టమైన గుణాలు లేవు. ఈ రెండు సిద్ధాంతాల ఫలితంగా మొదట ప్రవేశపెట్టిన ఆలోచన గురించి అనేక అనుమానాలు తలెత్తుతాయి.

నిష్పాక్షపాతంగా ఆలోచించే ఏ విద్వాంసుడైనా ఈ అంశాలవల్ల కొన్ని నిర్ణయాలకు రాకతప్పదు.

1. ఏ కారణాలు ఆధారంగా సంస్కృతాన్ని ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి చెందింది అన్నారో అదే విధంగా మరికొన్ని కారణాలు ఆధారంగా అది తప్పు అనవచ్చు.

2. ద్రవిడ భాషలు అని పేరుపెట్టిన అన్ని భాషలకు సంస్కృతం పరాయిదికాదు.

3. సంస్కృతం, ద్రవిడ భాషలు ఒకే మూలంనుంచి పుట్టినా వుండాలి, తప్పితే-

4. ఆర్య ద్రవిడ కుటుంబ భాషలు అని వేరువేరుగా చెప్పినవన్నీ నిజానికి ఒకే వర్గానికి చెందినవైనా అయివుండాలి.

కాని ఈ తర్కాన్ని ఓ ప్రత్యేక ఉద్దేశ్యంతో, పక్షపాత బుద్ధితో ఆలోచించే యూరోపియన్ విద్వాంసులు ఒప్పుకోలేకపోయ్యారు. పైగా

తాము శుద్ధిగా నమ్మిందాన్నే పట్టుక్కూర్చుని, దాన్ని నిరూపించటానికి మరో తిరుగుడు పెట్టారు. అదేమిటంటే, ఆర్యులు భారత్‌లోకి ప్రవేశించే ముందే ద్రవిడులు ఉత్తరాన, వాయువ్య ప్రాంతాన మొత్తం విస్తరించి వుండేవాళ్లు. అందువల్లనే ఆర్యుల భాషల్లో ద్రవిడ ప్రాబల్యం కనిపిస్తుంది. కానీ ఈనాటికీ ఖచ్చితమైన చారిత్రిక సత్యాలతో ఈ ఊహను నిరూపించుకోలేకపోతున్నారు.

ద్రవిడ భాషలు ఉత్తరాన విస్తరించి వుండేవని ఎలా నిరూపించుకోవాలి? ఇండో ఆర్యన్ విశేషణాల్లో ద్రవిడ లక్షణాలున్నాయి. వేదాల్లో కూడా ద్రవిడ ప్రాబల్యం కనిపిస్తుంది. ముఖ్యమైన ద్రవిడ లక్షణాలను విజ్ఞులు ఇలా గుర్తించారు:

1. 'సెరిబ్రల్' అక్షరాలు అనబడే వాటిని ఇండో ఆర్యన్ వాడుక భాషలో గమనించారు.

2. 'ర' ను 'ల' గా, 'ల' ను 'ర' గా ఎలా అంటే అలా వాడటం.

3. క్రియా రూపకాల బదులు సంధాన కారకాలైన అసమాపక క్రియారూపాలను వాడడం.

4. భూతకాల కర్త్రర్థక అసమాపక క్రియా రూపాలను, భవిష్యత్ కాలపదబంధాలను తయారుచేయటం.

కొందరు పండితుల ఉద్దేశం ప్రకారం మనం అనుకునే ఆర్యభాష లోని ఈ పదాలు నిజానికి ద్రవిడ భాషల్లో. ఆర్య భాషా లక్షణాలు హిందువులకు పూర్వం ఉన్న నాగరికత అవశేషాలు. పాశ్చాత్య పక్షం ఆధారంగా చూసే ద్రవిడ పదాలు నిజానికి ఆర్య జీవితాన్నే నిరూపిస్తున్నా

యని ఖచ్చితంగా నిరూపించారు ఈ పండితులు. (ఉదాహరణకు ఒర్రైజా, జింజింబర్, కర్వియాన్, ఆల్గం, తుకిలాంటివి). ఏ నిరూపణ లేకుండా క్రింది విషయాలను అంగీకరించిన పండితులు దిగ్భ్రాంతికి లోనయ్యారని చెప్పాలి.

1. ఇండో ఆర్యన్ భాషా సంప్రదాయం ఒకటి వుందనీ, సంస్కృతం దానికి చెందిందనీ అనటం.

2. ద్రవిడ భాషా సంప్రదాయం ఒకటుందనటం.

3. ఈ రెండూ విభిన్నమైన వలసలకు చెందిన తరంగాలనటం.

హిందువులకు పూర్వం మరో నాగరికత వుందనటం ఓ కలలోని ఊహయితే దాని పట్టుకుని, మిగతా సిద్ధాంతాలు చేశారు తర్వాతివాళ్ళు. అందువల్లే ఈ 'ఆర్యన్‌లో ద్రవిడ లక్షణాలు', 'ద్రవిడన్‌లో ఆర్య లక్షణాలు' అనే తికమక. ఈ గందరగోళాలు, తికమకలు, అభూత కల్పనలు, అన్ని సమస్యలు, అసందర్భాలు భరత వర్షంలో 'ఒకేజాతి', 'ఒకే ప్రజ' అని ఒప్పుకుంటే దూదిపింజల్లా తేలిపోతాయి.

## ఒకేజాతి-ఒకే ప్రజ

ఈ క్రింది విషయాలను స్పష్టంగా గుర్తించాలి.

పోటియా పర్వతం మీది హిందూఋషి అగస్త్యుడు మొట్టమొదటి తమిళ వ్యాకరణం వ్రాశాడు. అందులో అక్షరాల అమరిక సంస్కృత పద్ధతిలో వుంది. ఈనాటి తమిళ వ్రాత పద్ధతి తొమ్మిదో శతాబ్దానిికి చెందింది. తొలి లిపిపద్ధతైన 'వట్టె ఝుత్తు' ఈనాటి పద్ధతికి భిన్నమైంది. ఆ తొలి పద్ధతి అశోకుని బ్రాహ్మీలిపిని పోలివుంటుంది. తొల్కాప్పియం,

ఇరయనార్, అకప్పొరుల్, కురున్‌తొకయ్, అకనానూరు, కళిత్తొకై, పరిపాతల్, పట్టుప్పట్టు, సిలప్పాదికారం, మణిమేకలైల నుంచి లభించే చిత్రం సంపూర్ణంగా, ఎటువంటి అనుమానాలకూ తావివ్వని హిందూ సమాజానిదే! సిలప్పాదికారంలో వర్ణించిన పట్టణ స్వరూపం 'అర్థశాస్త్ర' కాలంనాటి పాటలీపుత్రను, మరికొన్ని ఇతర ఉత్తరదేశ పట్టణాలను పోలి వుంటుంది. విస్తరణా పద్ధతిలో మదురై పట్టణం పాటలీపుత్రను పోలివుంది. కోటలు, పట్టణానికి బలం చేకూర్చే కట్టడాలు అన్నీ కౌటిల్యుడి వివరణలనే అనుసరించివున్నాయి. మిగతా ఎన్నో విషయాలతో బాటుగా సిలప్పాదికారంలో నాలుగువర్ణాల వారి ప్రత్యేక దేవతామూర్తులను వర్ణించటం జరిగింది. నాలుగు వర్ణాల వారు కలిసినప్పుడు చెలరేగే నిరంతర మాటల గొడవ; యాగాల్లో బ్రాహ్మల నివేదనలవల్ల హోమగుండంలో నుంచి ఉప్పులించే పొగలు; ప్రతి ఏడాది జరిగే ఇంద్రుడి పండగ; శివుడు, సుబ్రహ్మణ్య, విష్ణు, బలరాముడు, ఇంద్రుడులాంటి వేదకాలంనాటి, అటు తర్వాతి దేవతలను ఆరాధించటం; శివ, కృష్ణ, దుర్గ, శ్రీదేవి, ఇంద్రాణీల నృత్యాలు; ఫాల్గుణమాసంలో కాముడి పండగ; గ్రహాలకు హిందువుల పేర్లు; హిందువుల నెలలపేర్లు; పన్నెండు నెలలు అవి పౌర్ణమితర్వాతనుంచి మొదలవటం: ఇలాంటివి ఎన్నోవున్నాయి ఆ గ్రంథంలో.

ఇవేకాదు- సనాతన తమిళ గ్రంథాలు మణిమేకలై పరిపాతల్‌లలో వివరించబడ్డ వేదాంతం, దేవీ దేవతలు, ఆరాధనా పద్ధతి, కాల నిర్ణయం, కాల విభజన, ఆనాటి తమిళనాడు కోని జీవన పద్ధతులు అన్నీ నూటికి నూరు శాతం హిందువలవే. "ద్రవిడులు" అతి గౌరవప్రదంగా చూచే తిరుక్కురల్‌లో అధ్యాయాలను నాలుగు పురుషార్థాల పద్ధతిలో విభజించారు. అందులో అర్థవిభాగం కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని పోలివుంది. గ్రంథమంతా హిందూ సమాజానికి అద్దం పట్టింది.

అన్ని ఆధారాలు ఒకే నిర్ణయానికి దారితీస్తాయి. హిందూసంస్కృతి, నాగరికతలకు భిన్నమైన మరో ద్రవిడ సంప్రదాయం వుందనటానికి ఆధారాలే లేవు. మతం, వేదాంతం, జీవనధ్యేయం, చరిత్ర, పేరులు, లిపి, భాష, శాస్త్రజ్ఞానం, సాంఘిక ఆర్థిక స్థితిగతులు ఏది తీసుకున్నా ఇదే సత్యాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. ఎన్ని ఊహాగానాలు చేసి చెప్పినవైనా తరచి చూస్తే 'ద్రవిడస్' అన్న ప్రతిదీ ఆఖరుకు 'హిందు' అని తేలుతుంది.

# 7. బుద్ధుడు, మార్క్స్, డా॥ అంబేద్కర్

డా॥ అంబేద్కర్ కమ్యూనిస్టులకు బద్ధ వ్యతిరేకి. 1950లో బర్మాలో బౌద్ధం, మార్క్సిజం ఒకే రకమైనవని నిరూపించే కరపత్రంపట్ల అమిత ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడాయన. నిజానికి కమ్యూనిజం బౌద్ధంతో సహా అన్ని మతాల మీదికి యుద్ధాన్ని ప్రకటించింది. బుద్ధుడు దాస్ కాపిటల్‌ను పట్టకారతో కూడా తాకి వుండేవాడుకాదన్నదీ పరమ సత్యమే! డా॥ అంబేద్కర్ ఎప్పుడూ మార్క్స్ కమ్యూనిస్టుల మహమ్మద్ అనీ, దాస్ కాపిటల్ వాళ్ళ కురాన్ అనీ అంటూండేవాడు. బుద్ధుడు [illegible] వ్రాతలను వ్యతిరేకించేవాడు.

"గురువు అనే గౌరవంతో గురువు చెప్పిందాన్ని అలానే ఎప్పుడూ ఆమోదించవద్దు. ఏ సిద్ధాంతమైనా మీరు స్వయంగా పరిశీలించి, అనుభవానికి తెచ్చుకుని, విశ్లేషించి చూచి, అది మానవాళికి తప్పక మేలు కల్గిస్తుందనే నమ్మకం కుదిరాకే అనుసరించండి. మీకు మార్గదర్శకంగా ఆమోదించండి."

ఏ కమ్యూనిస్టు కూడా ఈ పద్ధతిని అనుసరించలేదు. అలాచేస్తే ట్రాట్స్కీ గతే పడుతుంది!

బుద్ధుడు వ్యక్తిగత ఆస్తుల్ని నిషేధించలేదు. ఆస్తిపాస్తుల్ని సంపాదించుకోమన్నాడు. కాని అవి వినయ సంపన్నత అధీనంలో వుండాలి, పరిత్యాగం సిసలైన మానసిక స్థితి. అది స్వచ్ఛందంగా జరగాలి. పైన్నుంచి ఎవరో భయపెడితే, ఒత్తిడి తెస్తే జరిగే పని కారాదు. బుద్ధ సన్యాసులు సమాజ జీవనాన్ని తమ యిష్టానుసారం స్వీకరిస్తారు. ఎవరి బలవంతమూ వుండదు. అందరు సామాన్యులకూ బౌద్ధం ఈ జీవితాన్ని నిర్ణయించదు. బౌద్ధ సన్యాసులకూడా తమ ఇష్టానుసారం తిరిగి సామాన్య జీవితాన్ని గడిపే స్వేచ్ఛ వుంది.

మార్క్స్ సిద్ధాంతంలోని వర్గ పోరాటం మార్క్సుకు బౌద్ధంలోని 'సంసారం' అనబడే సహజ ప్రపంచ సంబంధ పద్ధతి తెలియదని స్పష్టం అవుతోంది. 'ఫ్రాన్సిస్ కథ' ప్రకారం నిజానికి మార్క్సుకు, లెనిన్‌కు బాగా వినబడ్డ ఆనాటి జారిస్టు రష్యాలోని క్రైస్తవం తప్పించి మరో మతాన్ని గురించి తెలీదు.

బలవంత ఆక్రమణతో ఏ సమస్యా తెగదని బుద్ధుడు నమ్మాడు. "విద్వేషం ద్వేషంవల్ల సమసిపోదు, ప్రేమవల్ల అంతమవుతుంది. ఇది అతి పురాతన సిద్ధాంతం."

కమ్యూనిజం పునాది ద్వేషం, పగ. బౌద్ధానికి ఆధారం ప్రేమ. తన ధ్యేయసాధనకు కమ్యూనిజం బాహిర బలాత్కారాలనే అనుసరిస్తే, బౌద్ధం అంతర్గత పరివర్తన మీద ఆధారపడుతుంది.

కమ్యూనిజం కార్య పద్ధతి బాహిరమైంది, బౌద్ధ పద్ధతి అంతర్గత మైంది. "మనస్సు, సంకల్ప శక్తి గలిగిన ఈ పొడుగాటి శరీరంలోనే భిక్కులారా మీకు ప్రపంచ సృష్టి, స్థితిలయాలను తెలిపాను. క్రౌర్యాన్ని అంతం చెయ్యటానికి, మంచిని స్థాపించటానికి, మనస్సును శుద్ధి చెయ్యటానికి అందరు బౌద్ధులకు బోధలు ఇవే!"

బుద్ధుడి బోధంకు ఏ విధంగానూ సరిపోలని నిరంకుశత్వం మీదే కమ్యూనిజం ఆధారపడుతుంది. బౌద్ధం వ్యక్తిగత స్వేచ్ఛను ఆవేశిస్తుంది. 'కార్మిక నిరంకుశత్వం' దాన్ని అణగద్రొక్కుస్తుంది. ప్రతి వ్యక్తి తన 'ధమ్మమత'ను అనుసరించే హక్కుపుంది, ఈ హక్కుమీది ఆక్రమణ బౌద్ధానికి వ్యతిరేకం. ఏ కొద్దిమంది చేతులోనో అధికారం కేంద్రీకృతం అయిపుండటం ప్రమాదకరం. లోభ, దోష (ద్వేష), మోహ లనే మూడు గుణాలు ప్రతివ్యక్తి మనస్సులో వుండే దోషాలు అన్నాడు బుద్ధుడు. సంపూర్ణాధికారం గల పాలకవర్గంలో ఈ ధోరణులు ప్రబలటం ఖాయం,

మానవ జీవిత లక్ష్యం ఏమిటి? 'అత్యధిక స్థాయిలోని భౌతిక ఆనందం' అంటారు మార్క్సిస్టులు. తార్కికంగా ఆలోచిస్తే మార్క్సిస్టులు అనే 'గతితర్క భౌతికవాదం' ఆటవిక న్యాయమే! అలాటి భౌతిక ఉద్దేశా లను బౌద్ధం ఆమోదించదు. కోరికలకు అంతంలేదు. కోరికల బడబాగ్నిని శారీరక సుఖాల ఆజ్యంపోస్తూ ఎన్నటికీ ఆర్పలేం. ఈ వాంఛలను, తృష్ణను త్యజించటమే అసలైన మార్గం. అంతిమ పరాకాష్ఠగా బౌద్ధం నైతిక సిద్ధాంతాలనే అన్ని వైరుధ్యాల అంతానికి పరిష్కారంగా చెప్తుంది.

నిజానికి బౌద్ధానికి, మార్క్సిజానికి వున్న భేదాలు ఇంకా మౌలిక మైనవి. మార్క్స్ వ్యక్తీకరించినట్లు పదార్థంతప్ప మరేదీలేదు. మనస్సు

పదార్థంయొక్క బాహిరరూపమే. తన అదుపులోలేని బాహిర భౌతిక పరిస్థితులవల్లనే మనిషి రూపొందుతాడు. వ్యక్తికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు, తన ఇష్టానుసారంచేసే అవకాశం లేవు. కాబట్టి నీతి, అవినీతి అనేవాటికి అర్థంలేదు. కాని, బౌద్ధం వ్యక్తి తన స్వేచ్ఛానుసారం నడుచుకోగలిగే శక్తిమీద సమ్మకం వుంచుతుంది. కాబట్టి అది నైతిక, పారంపర్య విలువలమీద ఆధారపడుతుంది.

ఆత్మ, భగవంతుడు విషయాల్లో కొన్ని సిద్ధాంతాలను నిరాకరించినా బౌద్ధం మౌలికంగా ఆముష్మిక ప్రాధాన్యత కలది. బుద్ధుడు తన కాలంలో లోకాయతికలు, నాస్తికులు, వేచేదవాదినులు ప్రచారంచేసే భౌతికవాదాన్ని తీవ్రంగా ఖండించాడు. బౌద్ధుల పదజాలంతో చెప్పాలంటే మార్క్స్ ప్రచారం చేసింది 'వేచేద దిట్ఠి' అంటే శూన్యవాదం. హత్యాకాండలు జరిపే మార్క్సిస్టులు బౌద్ధ సిద్ధాంతాలైన పునర్జన్మ, కర్మలను ఆమోదించలేరు. మార్క్సిస్టుల భౌతిక వాదానికి పునాదైన శూన్యవాద సిద్ధాంతంలోని బోలుతనాన్ని బుద్ధుడు తన 'బ్రహ్మజాల సుత్త'లో స్పష్టంగా చెప్పాడు. భౌతిక వాదులైన కమ్యూనిస్టులు నిర్వాణానికి (నిబ్బాణ) దారితీసే అష్టవిధులను ఒప్పుకోరు.

డాక్టర్ అంబేద్కర్ కొత్తగా బౌద్ధులు అయిన వాళ్ళకు ఈ విషయాలను స్పష్టంగా తెలియచేయటానికి ప్రయత్నించారు. వీళ్ళంతా కమ్యూనిస్టుల ప్రచార ప్రవాహంలో కొట్టుకపోతారని ఆయన భయం. ఆయన చనిపోయేదానికి కొద్దిరోజుల ముందే 'బౌద్ధం - మార్క్సిజం' అనే పుస్తకాన్ని ఈ ఉద్దేశంతోనే పూర్తిచేశాడు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆయన పార్టీలోని ఓ వర్గం కమ్యూనిస్టులతో చేతులు కలపటానికి ఎంతో ఆత్రుత పడ్డది. ఆ పుస్తకం మాత్రం ఈనాటికీ వెలుగును చూడలేక పోవటం దురదృష్టం. బహుశా అది పదిమంది చేతుల్లోకి వెళ్ళటం కొందరికి ఇష్టం వుండి వుండకపోవచ్చు!

# 8. బౌద్ధమతం తప్పు మార్గంలో పడుతోందా?

నాగపూర్‌లో 1956, అక్టోబర్, 14న అతి పెద్ద సంఖ్యలో ప్రజల్ని బౌద్ధమతానికి మార్చిన భారతీయ బౌద్ధమహాసభవారు డిసెంబర్, 6, 1960న బౌద్ధమత కార్యకర్తలకు, సన్యాసులకు ఓ సభను ఏర్పాటు చేశారు. అలాంటి కార్యక్రమం ఏర్పాటు చెయ్యటం అదే మొదటి సారి.

కొత్తగా బౌద్ధాన్ని చేపట్టినవారికి బుద్ధుని మతం గురించి వివరంగా తెలియచెప్పటానికి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు. ఈ పనికిగాను విహారాలను, విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చెయ్యాలని డా॥ అంబేద్కర్‌కు కొన్ని యోజనలుండేవి. దురదృష్టవశాత్తు ఆయన అటు తర్వాత ఎక్కువ రోజులు సజీవంగా లేరు. ఆయన అనుయాయులకు ఇలా ఎటువంటి రంగుల పూతాలేని ధార్మిక విషయాలపట్ల అంత రుచి వున్నట్లనిపించదు. ఈ రాజకీయ వేత్తలకు బౌద్ధమతం గురించి అ-ఆలన్నా వచ్చో లేదో అనుమానమే!

బౌద్ధం స్వీకరించేముందు కూడా వీళ్ళకు మతం మీద అభిమానం ఎంతమాత్రం వుండేదో వాళ్ళ మిత్రులకు శత్రువులకూ తెలుసు. ఈనాటి వరకూ కూడా వాళ్ళ మత ప్రేమ రహస్యంగానే వుండిపోయింది. ఈ బౌద్ధ నేతలను గౌరవనీయ యం. పన్నాసిరి, మహాథెరో, శ్రీదేవప్రియవలి సింహాలతో పోల్చి వాళ్ళ అనుయాయులుకూడా చెప్పటం లేదు. ఈ ధార్మిక వ్యక్తులకు కొత్తగా బౌద్ధంలో చేరిన వాళ్ళ మీద ఎట్లాటి అదుపూ లేదు.

మహారాష్ట్రలో ఓ ఆర్థిక సామాజిక వర్గంగా వున్న, రాజకీయపార్టీ పరిధిలో వున్న ఈ వినూత్న బౌద్ధుల సామాన్య ప్రజలకు చెందిన కులం వారు కాదు వాళ్లు. అసలైన విషయం ఈ కొత్త బౌద్ధుల నాయకవర్గానికి మతం అన్నదాని మీద పెద్ద శ్రద్ధలేదు. అందువల్లనే నిజమైన భిక్కులను వీళ్లెవ్వరూ ఆత్మవిశ్వాసంతో 'వీళ్ల మా నాయకులు - మమ్మల్ని నడిపిస్తారు' అని చెప్పుకోరు.

## అసలు అంబేద్కర్ ఆశయం

డా॥ అంబేద్కర్ బౌద్ధం నుంచి క్రింది విషయాలను ఆశించాడు:

1. నైతిక విలువల మీద సమాజం నిలబడగలగాలి.
2. ఈనాటి శాస్త్రీయ, హేతువాద పరిధిలో అందరి మనస్సులకు తృప్తి కలిగించే బోధలు ఇవి.
3. మౌలికమైన స్వేచ్ఛ, సమానత, సౌభ్రాతృత్వం పెంపొందించే సూత్రాలు గల వ్యవస్థ.
4. అన్ని బాధలకూ నిష్కృతి మార్గం చూపి వయనిస్తూ పేదరికాన్ని అంగీకరించకపోవటం.

ఈ ఆదర్శాలను బౌద్ధం సఫలం చేయగలదని ఆయన ఆకాంక్ష. కాని ఈ నాటి నూత్న బౌద్ధుల వ్యవహారం వారి నాయకుల పంథా బౌద్ధాన్ని ఇరుకులో పడేస్తున్నాయి.

డా॥ అంబేద్కర్ తన ఉద్యమాన్ని మౌలికంగా, సంపూర్ణంగా ధార్మికంగానే వుంచదల్చుకున్నాడు. దీని సాధనకోసం బౌద్ధమత సంస్థ తీసుకోవలసిన కార్యక్రమాలు కొన్ని వున్నాయి.

1. భారత్‌లో బౌద్ధాన్ని వ్యాప్తిచేయటం.
2. బౌద్ధుల ఆరాధనకు దేవాలయాలను నిర్మించటం.
3. మత విషయాలను బోధించటానికి పాఠశాలల్ని, కళాశాలల్ని స్థాపించటం.
4. అనాధాశ్రమాల్ని, వైద్యాలయాలను, సహాయ కేంద్రాలను స్థాపించటం.
5. బౌద్ధవ్యాప్తికి కార్యకర్తలను తయారుచేసే ఆశ్రమాల స్థాపన.
6. అన్ని మతాల గురించి పఠనం.
7. ప్రతి సామాన్యుడికి బౌద్ధం గురించి స్పష్టంగా తెలిపే సాహిత్య ప్రచురణ.
8. అవసరమైన కొత్త తరం ప్రచారకులను ప్రోత్సహించటం.
9. భారత్‌లోవున్న అందరు బౌద్ధుల సమావేశాలు నిర్వహించి ఏక మార్గంలో నడపటం.
10. ముద్రణాయంత్రాల స్థాపన.

## కార్యదర్శి ఆత్మవిమర్శ

రిపబ్లికన్ పార్టీలో అత్యధికవర్గం బౌద్ధాన్ని సమర్థించేదే. కాని అంబేద్కర్ కోరిన విషయాలేవీ జరగలేదు.

"అతి పెద్ద సంఖ్యలో వ్యక్తుల్ని బౌద్ధమతంలోకి మార్చి మూడేళ్ల యింది (ఈ మాట అన్నరోజుకు). కాని ఇంత సుదీర్ఘ కాలంలో చెప్పుకో తగ్గ పనంటూ ఏదీ చెయ్యలేదు" అని వాపోయాడు భారతీయ బౌద్ధ మహా సభ కార్యదర్శి. ఎందువల్ల ఏమీ చెయ్యలేకపోయ్యారో కూడా వివరించా డాయన.

"బౌద్ధ ఉద్యమం ఘోరంగా నిష్ఫలం కావటానికి కారణాలు ప్రత్యేకంగా వెతుక్కోనక్కర్లేదు. బౌద్ధులు, కార్యకర్తలు కూడా, తామెంతో తీవ్రంగా కృషి చెయ్యగలమని చెప్పుకుతిరిగిన నాయకుల్ని సంపూర్ణంగా నమ్మారు. నిజానికి ఆ నాయకుల్లో ఎవరికీ ఆత్మశుద్ధి లేదు. వాళ్ల నిజ స్వరూపాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. చెయ్యవలసిన కృషికి వ్యతిరేకంగా వుంది వాళ్లు చేసే పని." అసలు విషయం ఇది.

సెప్టెంబర్ 28-30, 1960 లో పశ్చిమ ప్రాంత భారతీయ బౌద్ధ మహాసభలు నాగపూర్ దీక్షా మైదానంలో జరిగాయి. బౌద్ధాన్ని రాజకీయాలకు వాడుకోవటాన్ని బహిరంగంగా ఖండించటం జరిగింది.

"కృషి సక్రమంగా జరగాలంటే ధార్మిక, రాజకీయ కార్యక్రమాల్ని విడివిడిగా వుంచాలి. వీలైనంతవరకు భిన్నవ్యక్తులు ఈ సంస్థల బాధ్యతల్ని వహించాలి" అని నిర్ణయం చేశారు. మహాసభ తన ఆత్రుతను ఇలా వ్యక్తం చేసింది కూడా :

"కొన్ని సందర్భాల్లో ధార్మిక సంస్థల మీద రాజకీయ ప్రాబల్యం, ఒత్తిడి నేరుగా వుంటోంది; పెరుగుతోంది. స్వప్రయోజనాల కోసం, బేరాల కోసం బౌద్ధాన్ని దుర్వినియోగపరచటం కూడా జరుగుతోంది. ఇది చాలా దురదృష్టకర విషయం. ఈ పరిస్థితి ధర్మవ్యాప్తికి, సమాజ పురోభివృద్ధికి హాని."

రాజకీయ ఆధిక్యత వెంటనే తొలగిపోవాలని, మతరీత్యా స్వప్రయోజనాలకు ప్రాకులాడటాన్ని అందరూ గర్హించి వ్యతిరేకించాలని తీర్మానించింది మహాసభ.

# కొత్త బౌద్ధులు కమ్యూనిస్టులతో చేతులు కలిపారు

ఈ కొత్త బౌద్ధుల్ని రాజకీయ ప్రయోజనాల కోసం రిపబ్లికన్ పార్టీ వాడుకోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇదీ తప్పే అయినా మహా రాష్ట్రలో కులరీత్యా ఈ పార్టీ బౌద్ధులతో గుర్తింపు పొందటం ఓ రకంగా విడ్డూరం కాదు. విచిత్రం ఏమంటే తమ మత వ్యతిరేక ఆదర్శాలకు కమ్యూనిస్టులు ఈ కొత్త బౌద్ధుల్ని వాడుకుంటూంటే ఊరుకోవటం! భారతీయ బౌద్ధ నాయకులు కమ్యూనిస్టులను బహిరంగంగానే సమర్థించటం విచిత్రం. అతి ముఖ్య బౌద్ధ రాజ్యం టిబెట్ ను సైన్య శక్తితో కబళించి, బౌద్ధ నాయకుడు దలైలామాను ఆ బౌద్ధ రాజ్యాన్నుంచి తరిమేసిన కమ్యూనిస్టులతో చేతులు కలిపారీ నాయకులు!!

దీక్షా మైదానంలో చేసిన నిర్ణయాలు ధార్మికమైనవి. కమ్యూనిస్టులతో పొత్తు కలిపిన రిపబ్లిక్ పార్టీ నాయకవర్గం మత వ్యతిరేక కమ్యూనిస్టుల్ని ధార్మిక ఆందోళనకు తమతో బాటు నాయకత్వం వహించమని ఆహ్వానించటాన్ని ఏమనాలి? బర్మాలోని శ్రీ యు చాన్ హటూన్ బుద్ధ శాసన సభ అధ్యక్షుడు. చాలా గౌరవనీయుడు.

"బౌద్ధ మూల సూత్రాలకు, కమ్యూనిజానికి ఎక్కడా పొత్తు కుదరదు. పైగా అతి వ్యతిరేకం కూడా" అన్నారాయన.

డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ నూటికి నూరుశాతం కమ్యూనిస్టు వ్యతిరేకి. హరిజనుల్ని కమ్యూనిస్టు కబంధ హస్తాలనుంచి కాపాడే ఆశయంతో ఆయన తన అనుయాయులతోసహా బౌద్ధాన్ని స్వీకరించాడు. జాతీయ ప్రాధాన్యతగల ఈ మహత్కార్యాన్ని తానే చేయగలనని ఆయన విశ్వసించాడు. ఈ ధార్మికచర్యవల్ల ఆయన ఓ కొండలా కమ్యూనిస్టులకు హరిజనులకు మధ్య సమున్నతంగా నిలబడ్డాడు.

దేశానికి, జాతికి, మతానికి, హరిజనులకు డా॥ అంబేద్కర్ చేసిన మహోపకారాన్ని ధ్వంసం చేయటానికే ఆయన తర్వాతి నాయకత్వం నడుం కట్టింది.

## గురూజీ, యు చాన్ హటూన్-కొత్త బౌద్ధులు

బౌద్ధానికి ప్రమాదం వేదాల వల్ల, జైన మతం వల్ల ఏ మాత్రం లేదు. నిజమైన ప్రమాదం వారి రాజకీయ నాయకుల వల్లే వుంది. మత ప్రమేయం లేని సెక్యులర్ రాజకీయ నాయకుల చేతుల్లో మతం ఎప్పుడైతే పావులా మారుతుందో అప్పుడే దాని వినాశనం మొదలౌతుంది. ఈ కుళ్ళు రాజకీయాల నుంచి భారతీయ బౌద్ధ మతం తన్ను తానే కాపాడుకోవాలి.

కొన్నేళ్ళ క్రితం పర్యటించిన గౌరవనీయ శ్రీ యు చాన్ హటూన్ ఈ విషయాన్ని అతి స్పష్టంగా తెలిపారు. ఆయన ఆర్. యస్. యస్. నాయకుడయిన పరమ పూజనీయ శ్రీ గురూజీని కలుసుకున్నారు. బౌద్ధ ఉద్యమం సరియైన మార్గంలో నడిచినంత కాలం తమ సంపూర్ణ సహకారం దానికి ఉండగలదన్నారు శ్రీ గురూజీ. అసలు బౌద్ధం పట్ల హిందూ వైఖరిని కూడా వివరించా రాయన. ఈ అధునాతన కాలంలో రెండు సమ్మతాలకు చెందిన ఈ ఇద్దరు నాయకుల కలయికకు ఎంతో ప్రాముఖ్యత వుంది. భారత్‌లోనే గాక ఈశాన్య ఆసియా మొత్తంగా ఈ ధర్మానుయాయ శక్తులకు మరింత బలం చేకూరింది. నాగపూర్‌లో శ్రీ యు చాన్ హటూన్ బౌద్ధ నాయకుల నుద్దేశించి సభాముఖంగా మాట్లాడారు. శ్రీ గురూజీ తన చర్చల్ని వివరించి, గౌతమ బుద్ధుని మత ప్రయోజనార్థం రాజకీయాలను త్యజించమన్నారు. కాని బౌద్ధ కార్యకర్తలు వ్యక్తం చేసిన విషయాలు దుఃఖాన్నే కలిగిస్తాయి. "విదేశీ బౌద్ధ సోదరులకు, మహామనీషి

శ్రీయు చాన్ హటూన్‌కు వీళ్ళు స్వయంగా రాజకీయాలను మతానికి దూరంగా వుంచుతామని ప్రమాణం చేసి చెప్పరు. కాని దౌర్భాగ్యం ఏమంటే వీళ్ళు మళ్ళీ పాత పద్ధతిలోనే నడుస్తున్నారు. ఏమీ మార్పు లేదు." బౌద్ధుల్ని ఆ బుద్ధుడే రక్షించాలి!

# 9. బుద్ధుడు ఓ చర్చిని స్థాపించలేదు

ప్రవక్తం చేత నిర్మాణం చెయ్యబడ్డ అన్ని మతాలూ ప్రత్యేకంగా వుంటాయి. గుత్తాధిపత్యం వాటి ప్రత్యేకత. హిందూ ధర్మం అలాకాదు. క్రైస్తవం ప్రకారం జీసస్ ద్వారా తప్ప మోక్షంలేదు. ఈ మాట క్రీస్తు అనలేదు. 'పాల్' అన్నాడు, క్రీస్తు పేరుమీద. ఇస్లాంలో కూడా మహమ్మద్ ప్రవక్త అనీ, ఆఖరువక్త అని నమ్మినవాళ్ళకే మోక్షం. యూదుల్లో కూడా మోసెస్ బోధలను నమ్మినవాళ్ళకే క్షీర ప్రవాహాలు, తేనెయేరే పుణ్య స్వర్గంలో ప్రవేశం. యెహోవా సందేశాలే అవి మరి! మొన్న మొన్నటి కొత్త మతం కమ్యూనిజం. మానవాళి శ్రేయస్సు గుత్తాధిపత్యం మార్క్స్‌దే!

హిందూ ధర్మంలో అలాటి స్వామ్యాధికారం చెప్పబడలేదు మతాలలోని విభిన్న దృక్పథాల్లో ఏకత్వాన్ని చూచారు హిందువులు.

'సర్వదేవ నమస్కారః
కేశవం ప్రతిగచ్ఛతి'
అని నమ్మారు హిందువులు.

"కౌంతేయా! ఏ దేవుడినైనా భక్తితో కొలిస్తే నన్ను కొల్చినట్లే!" అన్నాడు శ్రీకృష్ణుడు. యెహోవా, అల్లా, స్వర్గ సామ్రాజ్య పితలను ఊహించే చెప్పాడు కృష్ణుడు. బౌద్ధం హిందూత్వపు విశిష్ట ధర్మం. దీనికి కూడా ప్రవక్తల సాంప్రదాయం లేదు. బుద్ధుడు తాను ఓ ప్రవక్తనని ఎప్పుడూ అనలేదు. తన మతం మాత్రమే సృష్టి నిగూఢ రహస్యాలను తెలియజేస్తుంది అనలేదు. 'అందరికీ మోక్షాన్ని నా ద్వారానే ప్రసాదిస్తాను' అనలేదు. 'ఎవరికి వారే ఆ సంస్కారాన్ని పొందాలి' అన్నాడు. అతను లిఖిత శృతులను ఆమోదించలేదు.

"సిద్ధాంతం సజీవంగా వుండాలి. ఒకరి అధికారంతో కాదు. నా మాటనుబట్టి కూడా కాదు. స్వతస్సిద్ధంగా అది సత్యమని నిరూపణ కావాలి." తన బోధనల్ని తన వ్యక్తిత్వానికి, వ్యక్తి ఆరాధనకు దూరంగా వుంచాడు గౌతముడు.

ఈ కారణంగానే బుద్ధుడి జీవిత చరిత్రా విశేషాలు మనకు అతి తక్కువగా లభిస్తాయి. రాజ గృహంలో బుద్ధుడి నిర్యాణం తర్వాత కశ్యపుడు నిర్వహించిన మహా సభలో కూడా బుద్ధుడి జీవిత విశేషాల సంకలనానికి యోజన జరగలేదు. ఆహూత ప్రజానీకానికి రెండే విషయాలు చెప్పటం జరిగింది. ఒకటి 'ధర్మం', రెండోది 'వినయం.' అంతేగాని బుద్ధుడి జీవిత చరిత్ర కాదు.

"ఓ సిద్ధాంతం మానవ సాధికార ముద్రతోనే అమలులో వుండాలనేట్లయితే అది సిద్ధాంతమే కాదు. ప్రతిసారి బోధ చేసిన వ్యక్తి పేరు పలకాలనే నియమం వుంటే అది 'ధర్మం' కాదు" అన్నాడు బుద్ధుడు. ఈ కారణంగానే తన వారసుడిని నియమించ నిరాకరించాడు. "ధర్మం

తన వారసుడిని తానే చూసుకుంటుంది" అన్నాడు. "సుమార్గం గురించి వారసత్వ విభేదాలను నియంతృత్వం పరిష్కరించలేదు. మరి వారసుడు ఏం చెయ్యగలడు? నియంతగా నిలబడాల్సిందే!"

అందువల్లనే బుద్ధుడు బౌద్ధ చర్చిని నియమించలేదు. ఆ ఆలోచనే చెయ్యలేదు బుద్ధుడు. తన బోధలు ప్రత్యేక మతంగా రూపొందాలని ఆయన కోరలేదని చెప్పటానికి చాలా ఆధారాలున్నాయి. అలా కాకపోతే మతం మార్పును ప్రవేశపెట్టి వుండేవాడే. ఆయన ప్రవేశ పెట్టింది 'సంఘ దీక్ష.' సంఘ సేవకు, ఆనాటి హిందూ సమాజంలో వ్యక్తికి భిక్షు దీక్ష నిచ్చాడు. కాని, ఉపాసకుల దీక్ష లేదు, ధర్మ దీక్ష లేదు. తనదైన ఓ ప్రత్యేక వర్గాన్ని స్థాపించాలని ఆయన అనుకోలేదనటానికి ఇంతకంటే మరో ఆధారం అక్కర్లేదు. ఇది ఆయన హిందూ ఆలోచనలకు ప్రతీక. హిందూ సాంప్రదాయాలకు, హిందూ ధర్మంలోని మతాలకున్న స్వభావానికి అనుగుణంగా వుండటాన్ని మనం చూడొచ్చు.

భారత్‌లో బౌద్ధ మత పునరుజ్జీవనానికి ఏర్పాటు చేసిన బౌద్ధ కార్యకర్తల, బౌద్ధ సన్యాసుల సమావేశాలనుంచి కొత్త వాతావరణాన్ని సృష్టించిన నూతన బౌద్ధులు ఈ విషయాలి గుర్తించుకోవాలి. వీరి కొత్త పోకడల, హిందువేతర మతాల వారి చాతుర్యాల దృష్ట్యా ఈ హెచ్చరిక అవసరం అనిపిస్తోంది. ప్రవక్తల మతాల ధోరణిలో కొనసాగితే ఆయన హిందూ సమాజానికి చేసిన సేవకు, ఆ బుద్ధుడికే అన్యాయం చేసినవాళ్లు కాగలరు.

# 10. మన హిందూ సమాజం-
# డా॥ అంబేద్కర్

"ఆర్యులు భారత్‌కు ఎక్కడ్నుంచి వచ్చారు?"

"ఆర్యజాతివారి అసలు స్వస్థలం ఆర్కిటిక్ ప్రాంతం" అన్నాడు తిలక్ మహాశయుడు.

ఇదో క్రొత్త ఆలోచన!

కాని ఓ విషయాన్ని విస్మరించటం జరిగింది. వైదిక ఆర్యులకు గుర్రం చాలా అభిమాన జంతువు. వారి మతం తోటీ, జీవనంతోటి అత్యంత సాన్నిహిత్యం కలిగివుండేది. "గుర్రం మరి ఆర్కిటిక్ ప్రాంతాల్లో వుండే జంతువేనా?" అన్నది అసలు ప్రశ్న, 'కాదు' అన్నది జవాబైతే ఆర్యుల స్వస్థలం ఆర్కిటిక్ ప్రాంతం అనే సిద్ధాంతం ప్రమాదంలో పడుతుంది.

ఋగ్వేదం తరచిచూస్తే ఆర్యులు భారత్ బయట నుంచి వచ్చి దండయాత్రలు చేశారనే దానికి ఎటువంటి ఆధారాలూ దొరకవు. వేద సాహిత్యం మొత్తంలో ఆర్యులు భారత్‌కు బయటివాళ్లు అనే వాదనకు తగిన ఆధారాలు లభించవు. ఋగ్వేదం ఆధారంతో ఆర్యులు, అనార్యులైన 'దాస'-దస్యు' జాతుల మీద దండయాత్రచేసి విజయం చేశారనేది శుద్ధ అబద్ధం అని చెప్పొచ్చు. అంటే ఆర్యులు బయటివాళ్లు, దాస-దస్యు అనే

వాళ్లు భారత్‌లోని ఆటవిక జాతులు అనేది తప్పుడు వాదం. ఈ ప్రముఖ విషయంలో ఋగ్వేదానికి పాశ్చాత్య సిద్ధాంతం వ్యతిరేకంగా వుంది. భారతీయతకు ఋగ్వేదమే ఆధారం కాబట్టి దానికి వ్యతిరేకమైన ఆలోచనలనూ మనం నిరాకరించాలి.

పాశ్చాత్య సిద్ధాంతాన్ని పరిశీలించాక ఈ క్రింది అభిప్రాయాల్ని వ్యక్తం చేయొచ్చు.

1. ఆర్యజాతి అనేదాన్ని గురించి వేదాలకు తెలీదు.
2. భారత్‌లో స్థానికులు అనబడే దాస, దస్యు జాతుల మీద ఆర్యులు ఎక్కడినుంచో వచ్చి దండయాత్ర చేశారనే దానికి ఎటువంటి ఆధారాలు లేవు.
3. ఆర్య, దాస, దస్యు అనేవాళ్లు భిన్నజాతులనటానికి ఆధారాలు లేవు.
4. ఆర్యులు దాస, దస్యులకంటే భిన్నమైన శరీర రంగులో వుంటే వారనటానికి వేదాల్లో ఆధారం దొరకదు.

ఈ సందర్భంలో మహాభారతం, శాంతిపర్వంలో ఆరవ అధ్యాయం 23 వ శ్లోకాన్ని గమనించవచ్చు.

"అన్ని వర్ణాశ్రమాల్లో దస్యులున్నారు."

దీనివల్ల దస్యు అనేమాట ఆర్యులు కానివారిపట్ల ఉపయోగించినది కాదు.

## శూద్రులు, అనార్యులు

శూద్రులు, అనార్యులు అనే ఆలోచన మనువు, అర్థశాస్త్రాల సిద్ధాంతాలకే వ్యతిరేకం. కౌటిల్యుడు అతి స్పష్టంగా శూద్రుల్ని ఆర్యులు అంటాడు.

1. శూద్రులు సూర్యవంశ ఆర్యులు.

2. శూద్రులు క్షత్రియ వంశజులు.

3. శూద్రులు ఎంతో ప్రముఖ క్షత్రియ వంశానికి చెందినవాళ్లు. వీళ్లల్లో కొందరు అతిశక్తివంతమైన రాజులుగా దేశాన్ని పాలించారు.

## శూద్రుల సామాజిక స్థాయి

'ఉపనయనం లేదు కాబట్టి శూద్రులు అనార్యులు' అన్నవాదం ఆధారం లేనిది. ఇటీవలి కల్పన.

ఒకప్పుడు శూద్రులు జంధ్యం ధరించేవారన్నది నిర్వివాదాంశం. మాక్స్‌ముల్లర్ ఉదాహరించిన 'సంస్కార గణపతి' ప్రకారం శూద్రులు ఉపనయనానికి అర్హులు.

శూద్రులు రాజుల పట్టాభిషేకాల్లో పాల్గొనేవారు. రత్నిలు సాధికార పత్రాన్ని అందించాకే రాజులకు పాలనార్హత లభించేది. రత్నిలలో ఒకరు శూద్రుడనేది గమనార్హం. రాజును బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ప్రధానులు అభిషేకించేవారు. పూర్వం జనపద, పౌర అనే రెండు సభలను శూద్రులు అలంకరించేవారు. ఈ సభల్లో సభ్యులుగా వారు బ్రాహ్మణులకు కూడా వందనీయులై గౌరవమర్యాదలు పొందేవారు. శాంతి పర్వంలో ఓ భాగంలో శూద్రులు బ్రాహ్మణులతో సమాన సంఖ్యలో మంత్రులుగా వుండేవారని స్పష్టంగా వుంది. శూద్రులు బీదవాళ్లుగా, అల్పులుగా వుండేవారు కాదు. వాళ్ళు ధనవంతులే! మైత్రేయని సంహిత (iv : 2-7-10), పంచవింశ బ్రాహ్మణ (vi : 1-11), ఛాందోగ్య ఉపనిషత్తు (iv : 1-2) లలో రైక్వ అనే గురువు జనశ్రుతి అనే అతనికి వేదవిద్య బోధించినట్లు వుంది. జనశ్రుతి శూద్రుడు. కవష ఐలూష అనే

అతను శూద్రుడు. ఋషి! ఋగ్వేదంలోని పదవ పుస్తకంలోని అనేక శ్లోకాల రచయిత.

## అస్పృశ్యత మరెలా వచ్చింది?

వేదకాలంలో అస్పృశ్యత లేదు. ధర్మసూత్రాల కాలంనాటికి అపవిత్రత వుండేగాని అస్పృశ్యత లేదు. మనువు నిర్ణయం ప్రకారం అయిదవ వర్ణం లేదు. మనువు కాలంలో కూడా అస్పృశ్యత లేదు. మనుస్మృతిలో అస్పృశ్యత నిర్దేశింబడలేదని కచ్చితంగా చెప్పొచ్చు. క్రీ॥ శ॥ 200 లలో లేని ఈ జాడ్యం క్రీ॥ శ॥ 600 ల్లో పుట్టుకొచ్చింది. డా. డి. ఆర్. భండార్కర్ నిరూపించినట్లు 4 వ శతాబ్దంలో గుప్తరాజులు గోహత్యను అత్యధిక నేరంగా చూచేవారు. దీన్నిబట్టి మనం ఈ అస్పృశ్యత దాదాపు క్రీ॥శ॥ 400 సంవత్సర ప్రాంతాల్లో పుట్టిందని కొంత ధైర్యంగా చెప్పొచ్చు.

బౌద్ధం, సనాతన ధర్మాల మధ్య చెలరేగిన ద్వేషం ఫలితంగా విడిపోయిన వారిపట్ల ఈ అస్పృశ్యతను పాటించేవారా అని ఓ అనుమానం. కాని ఇది కాదనే అనాలి. బ్రాహ్మణులు వ్యాప్తిచేసిన తిరస్కారం బౌద్ధులకు వ్యతిరేకంగానే గాని వాళ్ళను అనుసరించిన సామాన్య ప్రజల పట్లగాదు. కాని అస్పృశ్యత ఏర్పడ్డది సామాన్యప్రజల పట్లే కాబట్టి దీనికి కారణం మరోటి ఏదో వుండివుండాలి. ఇలా వేదధర్మం నుంచి విడిపోయినవాళ్ళు అస్పృశ్యులుగా కావటానికి వాళ్ళు గొడ్డుమాంసం తినటం కారణం అనుకోవచ్చా!? ఈ ప్రశ్నకు అవుననే జవాబే అసలుకారణం అయ్యుండాలి. మనకు కనబడే సత్యాల ఆధారంగా మరో కారణాన్ని అనుకోలేం.

కేవలం ఊడ్చేపని, పాకీపన్లు అస్పృశ్యతకు కారణంకాదు. ఎందుకంటే, 4 వ శతాబ్దం దాకా ఈ పన్లను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు కూడా చేస్తూనే వుండి వుండాలిగా!

ఆర్యపదం జాతి నిర్దేశకం అవునో కాదో మనకు తెలీదు. చరిత్రకారులు 'ఆర్యులు వేరే జాతివాళ్ళు' అని ఊహించేసి మిగతా చరిత్రంతా తయారుచేసి పొరపాటుచేశారు. ప్రజల జాతిని నిర్ణయించటానికి మానవ శరీరశాస్త్రం ఏ మాత్రమైనా నమ్మతగ్గదైతే హిందూ సమాజంలో విభిన్న వర్గాలమీద చేసిన ప్రయోగాల ఫలితంగా తేలిందేమంటే-ఈ అస్పృశ్యులు ఆర్యులనేవాళ్ళకన్నా గానీ, ద్రావిడులనబడేవాళ్ళకన్నా గానీ భిన్నంగా లేరు. పరీక్షలవల్ల బ్రాహ్మణులు, అస్పృశ్యులు ఒకేజాతికి చెందిన వాళ్ళేనని తేలింది. బ్రాహ్మణులు ఆర్యులైతే అస్పృశ్యులూ ఆర్యులే! బ్రాహ్మణులు ద్రావిడులైతే వీళ్ళూ ద్రావిడులే! శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిస్తే ఈ భిన్నజాతి సిద్ధాంతం అస్పృశ్యులపట్ల శుద్ధ కల్పితం. దీన్ని మర్చిపోవచ్చు.

## వీళ్లు గ్రామాలకు దూరంగా ఎందుకున్నారు?

అస్పృశ్యులు విడిపోయిన వాళ్ళని కచ్చితంగా చెప్పొచ్చు. విడిపోయ్యారుగాబట్టి గ్రామాలను వదిలి దూరం వెళ్ళిపోయ్యారు. అస్పృశ్యత అనేది గ్రామాలకు దూరంగా వుండటానికేం సంబంధంలేని విషయం. అస్పృశ్యులుగా నిషేధించబడ్డారు కాబట్టి తరిమివేయబడి ఊరికి దూరంగా పోలేదు. విడిపోయి మొదట్నుంచీ ఊరికి దూరంగానే ఉన్నారు. అంటే ఓ కాలంలో ఈ అస్పృశ్యుల పూర్వీకులు ఊరికి దూరంగా మిగతా సమాజంతో విడిపోయి వుండేవారే గాని అంటరాని వారు మాత్రం కాదు.

# 11. నిమ్న వర్గాలవారి స్థితిగతులు నిజంగా మెరుగుపడ్డాయా ?

స్వాతంత్ర్యం లభించి ఇన్నేళ్లయ్యాక కూడా నిమ్న వర్గాల సాంఘిక స్థితిలో మార్పులేక పోవడం శోచనీయం. గ్రామాల్లో అస్పృశ్యత 1947 ముందెలా వుందో ఈనాడూ అలానే వుంది. నిమ్నవర్గాల్లోనే కొన్ని కులాల వాళ్లు మరీ అన్యాయంగా దూరంగా వుంచబడతారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వాల్మీకులు, బీహార్లో డోంబులు, అన్ని రాష్ట్రాల్లో భంగీలు, మహారాష్ట్రలో మాంగులు; లోహార్లు, బధాయిలు, దుమ్నాలు హిమాచల ప్రదేశ్‌లో ఇలా ప్రత్యేకంగా వేరుపరచి చూచే కొన్ని కులాలుగా చెప్పుకో వచ్చు.

## అస్పృశ్యత ఇంకా వుంది

ఎంతో మంది నిమ్న వర్గాల వాళ్లు తమలోనే అస్పృశ్యతను పాటిస్తారు. ఇతర కులాలవాళ్లను వాళ్ల బావుల్లో నీళ్లు చేదుకోనీరు. సహపంక్తి భోజనం చెయ్యరు. నాయి బ్రాహ్మణులు కూడా వాళ్ళకు క్షవరం చెయ్యరు. హోటళ్లలో, దేవాలయాల్లో వాళ్లకు ప్రవేశం లేదు. 1955 లో ప్రవేశపెట్టిన అస్పృశ్యతా నివారణ చట్టం నామమాత్రంగానే వుంది. ఈ చట్టం కింద కేసులెన్నో చూస్తే దాని ప్రభావం ఎంతో తెలుస్తుంది. కేసులున్నా అవి ఓరాగాన తేలవు.

నాగాలాండ్, మణిపూర్, అండమాన్ నికోబర్, లక్షదీవుల్లో తప్ప మిగతా చోట్ల దీని ప్రభావం చాలా ఎక్కువే. అన్ని ప్రాంతీయ ప్రభుత్వా

లకు ఈ విషయమై అసలు సమగ్రమైన సమాచారమే తెలీదు. పౌర సంబంధ సమాచార శాఖ వాళ్ళు ఈ విషయమై పెద్దగా పనేం చెయ్యటం లేదనాలి.

## తమ హక్కులు తమకే తెలీదు వీళ్ళకు

గిరిజన, సాంఘిక సంక్షేమ అధికారులకు ఆ శాఖలో వుండవలసిన దీక్ష, పట్టుదల లేవు. ఏదో ఈ మధ్య కొంత మేలే తప్ప, ఈ వర్గాల వాళ్ళకు చట్టప్రకారం అందాల్సిన వడ్డీలేని అప్పులూ సరిగా అందవు. చట్ట ప్రకారం ఏర్పాటైన ఎన్నో సౌకర్యాల వివరాలే వీళ్ళకు తెలీవు. అవి వీళ్ళకు అందనే అందవు.

పట్టణాల్లో నిమ్నవర్గాలకు ఇళ్ళు కట్టించారు కానీ పల్లెల్లో వుండే వాళ్ళకేవీ? మూడవ ప్రణాళికలో ఇలాంటి కార్యక్రమాలే లేవు. మురికివాడల నిర్మూలనం విషయంలో ఏం ప్రగతి సాధించాం?

నిమ్నవర్గాలవాళ్ళు ఎక్కువ మంది స్వంత పొలాలు లేని వ్యవసాయ కూలీలు. సాంఘిక సమస్యల్ని, ఆర్థిక సమస్యల్ని విభజించి చూచే ఉష్ట్ర పక్షి తత్వాన్ని పట్టు కూర్చుంది ప్రభుత్వం. ఇది నిజానికి వాస్తవ దృక్పథం కాదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేక, పై కులాలమీద సంపూర్ణంగా ఆధారపడ్డ నిమ్నవర్గాలవాళ్ళు చట్ట ప్రకారం తమకున్న అస్పృశ్యతా నివారణ హక్కుల్ని ఎలా దబాయించి పొందగలరు? జంకుగొంకులతోనే బ్రతుకుతున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యంలేనిదే ఎన్ని కబుర్లు చెప్పినా సాంఘికంగా పురోభివృద్ధిని సాధించలేరు. సమస్య బహుముఖమైంది. పై కులాలవాళ్ళ ధోరణి, అమాయకత్వం ఓ వైపు, ఆర్థిక అస్వాతంత్ర్యం మరోవైపు పట్టి పీడిస్తుంటే అసహాయంగా వున్నారు నిమ్నవర్గాలవారు. ప్రభుత్వవర్గాల

వారి అసమర్థత, ప్రత్యేకంగా వీళ్ళ అభివృద్ధికోసం ఏర్పాటు చెయ్యబడ్డ డిపార్టుమెంటు ఆఫీసర్లకు పట్టుదల, శ్రద్ధలేకపోవటం-ఇవన్నీ కట్టకట్టుకుని నిమ్న వర్గాలవాళ్ళ దుస్థితిని శాశ్వతం చేసేస్తున్నాయి. భారతదేశ ముఖ్య పట్టణంలో వుండే భంగీలస్థితి ఇదే.

## మన సమాజంలో పుట్టిన సంఘ సంస్కర్తలు

ఈ సమస్యా పరిష్కారం విషయంలో ఎవరినీ తప్పుపట్టలేం. ప్రభుత్వం అనుసరించే పద్ధతే తప్పు. సమాజంలోని వాళ్ళ మనస్సుల్లో పరివర్తన రావాలి. చట్టాలవల్ల మార్పులు రావు. స్వాతంత్ర్యం ముందు ఎంతో మంది నాయకులు ఈ విషయంలో తమ జీవితాల్నే సమర్పించారు. ప్రజల వ్యతిరేకతకు, క్రోధానికి కూడా భయపడక రాజారాంమోహన్‌రాయ్, మహాత్మా ఫులే తమ హృదయ కవాటాలనేగాక, ఇళ్ళ తలుపుల్ని కూడా బార్లా తెరిచారు ఈ అస్పృశ్యులకు. సాహు ఛత్రపతి, 1920 లో నాగ పూరులో జరిగిన మహాసభలో అధిక కులాలవాళ్ళను అస్పృశ్యుల్ని తమ రక్తబంధువులుగా చూడమని మనఃపూర్వకంగా అభ్యర్థించాడు. ఒకే మతం, ఒకే జాతి, ఒకే దైవం అన్న సిద్ధాంతాన్ని పాటించిన కేరళ శ్రీ నారాయణ గురు తన పరిధిలో ఈ సమస్యను పరిష్కరించటానికి కృషి చేశాడు. తన వాళ్ళను ఉద్ధరించటానికే కంకణం కట్టుకున్న డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ కొత్త కులం, కొత్త మతం, కొత్త దేముడు అన్న క్రొత్త వ్యూహాన్ని అనుసరించాడు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ స్థాపకుడు డా॥ హెడ్గెవార్ ఈ సమస్యకు కొత్త పరిష్కార మార్గాన్ని అనుసరించాడు. విభేదాలను పట్టుకుని ఊగిసలాడకుండా మౌలికంగా హిందూ సమాజమంతా ఒక్కటే అన్న విషయం మీద ఎక్కువ శ్రద్ధచూపి, ఆ పద్ధతిలో అన్ని కార్యక్రమాలు రూపొందించాడు. మహాత్మాగాంధీ ఈ కార్య క్రమాన్ని తన జీవితాశయంగా శ్రమించాడు. నిమ్నవర్గాల దుర్భర

పరిస్థితిని స్పృశించని క్షణమే లేదు ఆయన జీవితంలో. ప్రజల్లో మానసికంగా సాంఘిక పరివర్తన రావటానికి వీళ్ళంతా ఎంతో కృషిచేశారు.

### చట్టాలు కాదు, వాతావరణం మారాలి

సాంఘిక, ధార్మిక సంస్కర్తల జీవిత లక్ష్యంగా సాగాల్సిన ఈ పని ప్రభుత్వం చట్టాల ద్వారా, కార్యాలయాల ద్వారా పూర్తి చేయాలనుకుంటోంది. సాహిత్యపరంగా చూస్తే పార్లమెంటు సబ్‌కమిటీలు వేసి 'శాకుంతలం' వ్రాయించటానికి వీలవుతుందా? అలాగే సమాజంలో ఉద్భవించిన ఎందరో మహాత్ములు, గాయకులు, నాట్యకారులు, మతాధికారులు చట్టాల వల్ల, పార్లమెంటుతో చర్చల ద్వారా ఉద్భవించలేదు. ఈ మౌలిక సత్యాలను అవగాహన చేసుకుని యావత్ ప్రజల మానసిక స్థితిలో మార్పు వచ్చేలా మన పనులు తయారు చెయ్యాలి. రాజారాంమోహన్‌రాయ్, మహాత్మా ఫులే, స్వామి వివేకానంద, శ్రీ నారాయణ గురుస్వామి, డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్, డా॥ హెడ్గెవార్, కర్మవీర్ షిండే, మహాత్మాగాంధీల ఆశయాల పునరుద్ధరణ జరగాలి.

# 12. హిందూ జాతీయతే నిష్కృతి మార్గం

నిమ్న వర్గాల వాళ్ళ సమస్య సాంఘిక, ఆర్థికపరమైంది. ధార్మిక వేత్తలు జాగ్రత్తగా, ఎక్కువ స్పృశించని విషయాల మీదే తమ శక్తిని ప్రదర్శించారు రాజకీయవేత్తలు. వాళ్ళ రాజకీయ ప్రయోజనాలకోసం చేసే పనులు ఇబ్బుపెట్టే బాధ కంటే మందు బాధ ఎక్కువైనట్టుగా వున్నాయి. సామాజిక జీవితం పైన, మతం పైన రాజకీయాల ఆధిపత్యం వుంటాయి.

దానికా ప్రోత్సాహమే లభించకూడదు. రాజకీయంకాని సమస్యలకు రాజకీయ పరిష్కారం ఎలా లభించగలదు? రాజకీయ స్వప్రయోజనాలకోసం మతాన్ని వాడుకోవటం పూర్తిగా అసమంజసం. మతం మీద ఆధిపత్యం రాజకీయాలు చేజిక్కించుకుంటే ఈ అవకాశవాదుల చేతుల్లో కోట్లాది ప్రజల భవిష్యత్తు ఏం కావాలి ?

## రోగులమీద శ్రద్ధవుండే డాక్టరు కావాలి

మతం పేరు మీద మతాధికారులు ప్రజల్ని దోచుకోవటం గర్హించాల్సిన విషయమే. అలా అని ఆ దోపిడి గుత్తాధిపత్యాన్ని రాజకీయవాదులు చేజిక్కించుకోవటం మరీ ఘోరం కాగలదు. భారతీయ సాంప్రదాయంలో సన్యాసులు, రాజకీయవాదులు రెండు రకాలవారూ ఉన్నారు. రాజర్షులు, ఋషిరాజులు. ఇద్దరూ వంద్యులే. జనకమహారాజు ప్రఖ్యాతి చెందిన రాజర్షి. అలా అని సన్యాసుల్లో రాజకీయవేత్తలు, రాజకీయవేత్తల్లో సన్యాసులు మొదలై మతంతో రాజకీయాల్ని భ్రష్టుపట్టించటం, రాజకీయాలతో మతాన్ని కలుషితం చెయ్యటం సహించరాని విషయాలు. మత, సామాజిక సమస్యల్ని మత-సామాజిక నాయకత్వమే తీర్చాలి. శతాబ్దాల తరబడి పక్షవాతంతో దెబ్బతిన్న హిందూ సమాజం తన పొట్ట పెంచుకోవటానికి కాక రోగికి చికిత్స చేసే వైద్యుడికోసం ఎదురుచూస్తోంది. దైవ కృపవల్ల పోయిన శతాబ్దం రెండవ భాగంలో అలాటి వైద్యుడు దొరికాడు.

ఎఝువ కులంలో తిరువేంద్రం దగ్గరున్న చెంపాఝంతి గ్రామంలో 1856, ఆగస్టు నెలలో ఓ రైతు కుటుంబంలో పుట్టాడు శ్రీ నారాయణ. వేదాంతంలో అతి త్వరగా గుర్తింపు లభించిందతనికి. పసితనంలోనే తన్న ఇంటిదగ్గరున్న మహాకృష్ణ దేవి ఆరాధన అంటే ఎంతో ఇష్టపడేవాడు నారాయణకు. అతని ఇష్టదైవం కృష్ణుడు. అప్పుడు

ప్పుడూ ఆత్మ సాక్షాత్కారాన్ని పొందిన అయ్యస్వామిని కలుస్తుండేవాడు. అటు తర్వాత ఆత్మ జ్ఞానంలో అత్యున్నత స్థాయిని చేరుకున్న విద్యాధిరాజుతో సాన్నిహిత్యం ఏర్పడ్డది. నారాయణకు వేదాంతంలో, ఆత్మ జ్ఞానంలో తొలి బోధలు చేసింది ఈయనే. విద్యాధిరాజు నాయరు కులస్థుడు. ఆయన సాన్నిధ్యంలో నారాయణ మొదట త్రివేంద్రం దగ్గరున్న ఆరవికరలో, అటు తర్వాత నాగర్‌కోయిల్ దగ్గరి మరుత్వామలలో ధ్యాన సాధన చేశాడు. ఆత్మజ్ఞాన సముపార్జనతో ఉన్నత స్థాయికి పునాది ఇక్కడే పడ్డాయి నారాయణకు.

తన జ్ఞానాన్ని, శక్తిని సమాజంలో అట్టడుగున ఉన్న వారి ఉన్నతికే వినియోగించటానికి నిర్ణయించుకున్నాడు నారాయణ. తనను అమితంగా కదిలించిన వారి సేవలోనే మోక్ష మార్గం వుందని నిర్ణయించుకున్నాడు. ఉదాత్తత చూపించి లాభం పొందాలని గాని, లాభనష్టాల బేరీజు వేసుకుని గాని ఈ సేవ చెయ్యలేదతను. సర్వతోముఖ ఆరాధనా భావంతోటి, ప్రేమ భావంతోటి చేసిన సేవ అది. భగవంతుడి ముందు వెలిగే దీపంలా నలభై సుదీర్ఘ సంవత్సరాలు ఈ సేవతో తననుతాను దహించుకున్నాడు.

## ఒకే ప్రజ, ఒకే ధర్మం, ఒకే దేవుడు

ఆత్మ జ్ఞానంలో పరిపూర్ణుడు నారాయణ. కాని ఆశయంతో సమానంగా శరీరం నిలబడలేక పోయింది. ఆయన దుర్బల శరీరానికి కొన్ని అవధులున్నాయి మరి. కృషిలో కొన్ని పరిధుల్ని నియమించుకోక తప్పలేదు. ముప్పై లక్షల మంది దాకా వున్న ఎఝవుల కూడా సంపూర్ణంగా న్యాయం చేకూర్చలేనని గ్రహించాడు. 'జై జగత్!' అన్న నినాదం ఇచ్చి, ఆఖరుకు ఏమీ సాధించలేకపోయే దానికంటే ఓ వర్గానికన్నా సంపూర్ణ న్యాయం చేకూర్చి తన బాధ్యతను తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

కాని తన ఈ ప్రయత్నాన్ని సంకుచిత తత్వంగా అపార్థం చేసుకొంటారనీ తెలుసాయనకు. పైగా ఎఝువల్లో సరియైన దృక్పథాన్ని కలిగించకుంటే వీళ్లు మిగతా సమాజంతో కలిసిపోక తాము ఒక ప్రత్యేక వర్గంలా రూపొందే ప్రమాదముందనీ గ్రహించాడాయన, అందుకనే ఆయన "ఒకే ప్రజ, ఒకే మతం, ఒకే దైవం" అన్న తన సిద్ధాంతాన్ని వాళ్ళకు, వాళ్ళ ద్వారా ప్రపంచానికి తెలియచేయటంలో సఫలీకృతుడయ్యాడు.

ఆయన ఈ కృషిలో మతాధికారిగా, నేతగా, సాంఘిక సేవకుడిగా తాదాత్మ్యం చెందాడు.

విశ్వసిద్ధాంతంతో తత్త్వజ్ఞానాన్ని మేళవించటం హిందూత్వంలో వున్న విశిష్టతే! ప్రతివ్యక్తి తన మతాన్ని అనుసరిస్తూ వీటన్నిటిలో వున్న ఏకత్వ సిద్ధాంతాన్ని గ్రహించాలి అన్నాడు నారాయణగురు. ఓసారి ఒక క్రైస్తవుడు మంత్రోపదేశం చెయ్యమని ఆయన్ని వేడుకున్నాడు.

"నీ మతం ఏమిటి?" అని అడిగాడు స్వామీజీ.

"క్రైస్తవం."

"బైబిల్ చదివి అందులో బోధల్ని అనుసరించావా?"

"లేదు. ఇంకా చదవలేదు."

"ముందు మంచి క్రైస్తవుడివి కా" అన్నది ఆయన సలహా!

ఈ సంఘటన ఓ క్రైస్తవుడికి పూజనీయ శ్రీ జగద్గురు శ్రీ శృంగేరీ శంకరాచార్యకు మధ్య జరిగిన సంభాషణను జ్ఞప్తికి తెస్తుంది. శ్రీ నారాయణ గురు ఎప్పుడూ అనేవాడు- "మతం ఏదైనా వ్యక్తి మంచివాడైతే చాలు."

## నిశ్శబ్దంగా నడిచేపని

ఆయన తత్త్వజ్ఞాని అయినా నిత్యజీవితంలో అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలించేవాడు. ప్రాపంచిక విషయాల్లో చాలా విలీనమైనట్లు కనిపించేవాడు. కాని అదంతా అట్టడుగున వున్నవాళ్ళ ఉద్ధరణకే. ఆయన ఏవో బురఖాలు వేసుకున్న సన్యాసిగాదు, అసలైన సన్యాసి. కాంగ్రెసువాళ్ళు కల్లు త్రాగరాదని చెప్పేడానికి ఎంతోముందే ఆయన కల్లుగీయవద్దని చెప్పాడు. వాళ్ళ శుభ్రత గురించి శ్రద్ధ తీసుకొనేవాడు. సాంసారిక జీవితాల్ని బాగుపరిచాడు. ఓర్పును, మితవ్యయాన్ని నేర్పాడు. దురాచారాలను నిర్మూలించాడు. బాగా కష్టపడి పనిచేసే అలవాటును పెంపొందించాడు. శ్రమ చెయ్యటాన్ని నేర్పాడు. 'తియ్యాల' సర్వతో ముఖాభివృద్ధికి కావలసిన సంస్థల్ని ఏర్పాటు చేశాడు. అన్నిటికంటే ముఖ్యమైంది శ్రీ నారాయణ ధర్మసంఘం, సన్యాసుల వ్యవస్థ. 'పరిపాలం' అనే సాంఘిక సంస్థ. శ్రీ నారాయణ ధర్మంలో భాగం ఇది. మహాసభలు పెట్టి, ఆందోళనలు లేవదీసి ఏర్పాటు చేసిన సంస్థలు కావివి. వ్యక్తులతోటి సంపర్కంతో, మాటల సందర్భంలో ఏర్పాటు చేసినవీ సంస్థలన్నీ. అధునాతన పద్ధతుల ప్రచారంగాని, డప్పు వాయించటం గాని లేదు. ఆయన నిశ్శబ్దంగా చేసిన పని పెద్ద జాతీయ నాయకుల్ని కూడా ఆకర్షించింది. 1922 లో స్వామీజీని చూడటానికి రవీంద్రనాథ్ టాగూర్ స్వయంగా వచ్చాడు. సాంఘిక సమస్యల గురించి చర్చించటానికి మహాత్మా గాంధీ డిసెంబరు, 1925 లో శివగిరికి వచ్చాడు. ఆయన శిష్య బృందంలో మహాకవి కుమారన్ ఆసాన్ లాంటివాళ్ళు వుండేవారు.

## సామాజిక పునరుజ్జీవనానికి దేవాలయాలే కేంద్రాలయ్యాయి

సాధారణ మానవుల మనస్సులు పేరు, రూపం లేకుండా ఏకాగ్రతను సాధించలేవు. ఆధ్యాత్మిక చింతనకు అందువల్లనే ఓ దేవతా మూర్తి స్వరూపం అవసరం. కాని ఎఝువ కులం వారికి దేవాలయ ప్రవేశం లేదు. మరి వాళ్ళు సగుణోపాసన ఎలా చేయగలరు? నిమ్న వర్గాల నాయకులు దేవాలయ ప్రవేశ హక్కును బలవంతంగా పొంద ప్రయత్నించారు. కాని గురు ఈ పోకబారు పద్ధతిని అనుసరించలేదు. ఆయన వినాశనానికి, విధ్వంసానికి రాలేదు, సంతృప్తిని అందించటానికే వచ్చాడు. ప్రతి సమస్యకు ఆయన పరిష్కారం నిర్మాణాత్మకంగా వుండేది. ఆందోళనాయుతం కాదు. ఆయన ఉద్దేశ్యం ధార్మికం, రాజకీయం కాదు. ఆయన ఎఝువలను వేరే దేవాలయాలను కట్టుకొమ్మన్నారు. అక్కడ ఎఝువలు, తియ్యాలే పూజార్లుగా వుంటారు. ఆయన అలా ఎన్నో దేవాలయాలను కట్టించాడు. అవన్నీ సామాజిక కేంద్రాలయ్యాయి. అలా కట్టిన ప్రతి దేవాలయం చుట్టూ ఓ బడి, మఠం, వైద్యశాల, గ్రంథాలయం, ఉపన్యాస మందిరం, ఓ బ్యాంకు, విశ్రాంతి గృహం, మంచితోట ఇలా ఎన్నో ఏర్పడ్డాయి. ఈ దేవాలయాలు ఆత్మచింతనకు, ఆరాధనకు మాత్రమేకాక ఆఖరుకు సామాజిక పునరుజ్జీవనానికి ఎంతో దోహదంచేశాయి.

## కులాన్ని అడగొద్దు, చెప్పొద్దు, అసలాలోచించొద్దు

కొందరు పై కులాలవాళ్ళు ఈయన ఉద్యమాన్ని అంతగా సమర్థించలేదు. ఒకరు తియ్యాలు శివార్చన చేయటాన్ని గర్హించారు. అప్పుడు నారాయణ గురు శిష్యుడొకాయన ఇలా జవాబిచ్చారు: "మేము ఆరాధించేది బ్రాహ్మణ శివుడిని గాదు. ఈయన ఎఝువ శివుడు" అని.

శ్రీ గురు ఈ దేవాలయాల్ని ఎఝువలకంటే అధమ కులం అనుకునే పరియాలకు మరికొన్ని ఇలాటి కులాలవారికి ప్రవేశానికి తెరిచాడు. ఆయన ఆఖరుగా కట్టింది అలెప్పే దగ్గరి చేర్తలైలో. అందరికీ ఆశ్చర్యం కలిగేట్లు ఆయన ఇక్కడ ఓ విగ్రహం బదులు ఓ అద్దాన్ని ప్రతిష్ఠించాడు. దీనికో ప్రత్యేకత వుంది. ప్రతి ఋషి చెప్పేదేమిటి? "నిన్ను నీవు తెలుసుకో!" అనేగా.

కులంపేరుతో వచ్చే విభేదాలు ఈనాటి అధునాతన వక్రీకరణలు. సామాజిక విచ్ఛిన్నతకు, తత్ఫలితంగా నిమ్నవర్గాల వారి అధ్వాన్నస్థితికి ఇవే కారణాలుగా నిల్చాయి. మన సమాజాన్ని అభిమానించే ప్రతి వ్యక్తీ కులాల్ని విమర్శించాడు. శ్రీ గురు మన సమాజం ఈ వికృతాన్ని వదిలించు కోవాలని ఆశించాడు. దానికై శ్రమించాడు.

"నిజానికి కులం అనేది ఏదీలేదు. కులాన్ని అడగొద్దు, చెప్పొద్దు, ఆలోచించొద్దు" అన్నాడాయన.

హిందూ సంస్కృతి పోషకులం అనేవారి అసహనతను, పొగరును, అహంకారాన్ని వ్యతిరేకించినా హిందూగ్రంథాలను, శ్రుతులను వదలి పెట్టలేదు శ్రీ నారాయణ. పైగా ఆయన తన ఉద్యమ పునాదుల్ని వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలతో వేసుకున్నాడు. ఆయన చెత్తను పారేసి శుద్ధి బంగారాన్ని మాత్రం చేబట్టాడు. తన చైతన్య రథాన్ని నక్షత్ర మండలంవైపు మళ్ళించాడు. అందర్నీ అత్యున్నత స్థాయికి చేర్చటమే ఆయన ధ్యేయం.

...... శ్రీ గురు అన్ని మూఢ నమ్మకాల్ని, మూఢఆచారాల్ని విసర్జించేలా శ్రమించాడు. "ఈ ప్రపంచం మరో అత్యున్నత స్థాయికి మెట్టుమాత్రమే.

భగవంతుడి కృపతో, మంచిగురువు సాన్నిధ్యంలో ప్రతివ్యక్తి కర్మ, జ్ఞాన, ధ్యాన, భక్తియోగ సాధనలో అనంతశక్తివంతుడై ఆ పరమేశ్వరునిలో ఐక్యం కాగలడు" అన్నది ఆయన బోధ. ఓ శిష్యుడు చెప్పినట్టు "నాస్తికత్వాన్ని, మతరాహిత్యాన్ని, భౌతిక వాదాన్ని అదుపులో పెట్టి నిర్మూలించిన మహాత్ముడాయన."

## నిర్మాణాత్మక కార్యక్రమాలే!

... ఆ రోజుల్లో సాంఘిక కార్యకర్తలు, సంఘసంస్కర్తలు కులాంతర వివాహాన్ని, పంక్తి భోజనాన్ని ఉపదేశించేవారు. స్వామిజీ వీటితోతప్ప మరోరకంగా మార్పుతేలేమని అనుకోలేదు. ఆయన వాటిని వ్యతిరేకించలేదు. వాటినే అత్యవసర పద్ధతులుగా తీవ్రంగా బోధించలేదు. మధ్యే మార్గాన్ని అనుసరించాడు. ఆనాటి పరిస్థితినే అనుసరిస్తే కుటిలతను సమర్థించటమే. వ్యతిరేక భావంతో వున్న సమాజంమీద బలవంతంగా వీటిని రుద్దితే పునాదులే కదలొచ్చు. రెంటి విషయాల్లో తీవ్రతను తప్పించారు. మార్పులకిష్టంలేక పూర్వాచార పరాయణులు, ఆయనతో ఏకీభవించనివారు కొందరు సమాజానికి పట్టిన ఈ జబ్బుకు శస్త్రచికిత్సను ఆమోదించలేదు. శ్రీ గురు వాక్కుతో ఏకీభవించనూ లేదు. ఆ పేరుతో ఛిద్రం చేసి జబ్బును, రోగినీ కూడా అంతమొందించే పద్ధతీ చెప్పలేదు.

ఆయన మేధావితనం నిర్మాణాత్మక మార్గాన్నే అనుసరించింది. ఆయన ఎప్పుడూ ఎవరినీ తెగనాడలేదు. కనీసం నిరసించనైనా నిరసించలేదు. ఆయన మాటలుగాని, చేతలుగాని ఎప్పుడూ, ఎవరినీ రెచ్చగొట్టలేదు. ఎవరూ వ్యతిరేకించే అవకాశమే లేనట్టువంటి సుదీర్ఘ యోజనాబద్ధమైన సామాజిక మార్పుల్ని తీసుకువచ్చాడాయన.

"ఆయన ఒక విప్లవాన్ని సృష్టించాడు. ఆయన చేసే మార్పుల విషయాలు, వాటి స్వరూప స్వభావాలు అందరూ గ్రహించేటుండే ఫలితాలు కనిపించేవి. ఆయన ఎవరినీ నొప్పించేవాడు కాదు. ఆయన తీసుకవచ్చే మార్పులు ఏ సిద్ధాంతాలకూ ఏ వ్యక్తులకూ వ్యతిరేకంగా వుండేవి కావు. ఏ వర్గాన్నీ ఏ కులాన్నీ అవమానించేవి కాదు" అన్నాడు శ్రీ గురు శిష్యు డొకాయన.

## సనాతన ధర్మాన్ని విడిచిపెట్టొద్దు

ఉత్తర తిరువాన్కూరులో వైకోమ్ అనే చోట దేవాలయ ప్రవేశానికి చారిత్రాత్మక సత్యాగ్రహం జరుగుతోంది. శ్రీ నారాయణ గురు స్వామి శిష్యులంతా తర్వాతి కార్యక్రమం గురించి చర్చించటానికి పరక్కాల అనే చోట సమావేశమయ్యారు. శ్రీ సి. వి. కుంజి రామన్, డా॥ పల్పు హిందూ సమాజంలోని వికృతులను తీవ్రంగా ఖండిస్తూ, నిమ్న వర్గాలవారికి క్రైస్తవంలోకో, బౌద్ధ మతంలోకో మారిపోవటమే మార్గం అని ఆవేశంగా అన్నారు.

"తమ అభిప్రాయాన్ని తెలియచెయ్యండి!" అని శ్రీ నారాయణ గురును అడిగారు. "ఆత్మజ్ఞాన సాధనకు స్వధర్మాన్ని విడవాల్సిన అవసరం లేదు. మతం మార్పు అనే ఆలోచనకు మూలం ఈర్ష్యాద్వేషాలు. ఈర్ష్యకు మూల కారణాలు అహంకారం, పొగరు అని గ్రహించిన్నాడు మతం మార్పు అనే ఊహ దానంతట అదే సమసిపోతుంది.

సనాతన ధర్మమే సర్వ ప్రధానం" అన్నాడాయన.

ముప్పై లక్షల ఎఝువలు హిందూ ధర్మంలో నిలవటానికి శ్రీ గురు ఆదేశాలే కారణం,

## హిందూ జాతీయత వివరణే అతి స్పష్టం

శ్రీ గురు క్రీ.శ. 1928 లో వర్కల అనేచోట స్వర్గస్థులయ్యారు. మలయాళ లెక్క ప్రకారం 1102, మేష మాసంలో, ఆయన మహా ప్రయాణానికి రెండేళ్ళ ముందు తుది బోధ జరిగింది. ఆయన హిందూ ధర్మంపట్ల తనకున్న అద్వితీయ ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించాడీ బోధలో.

"ఈ సనాతన ధర్మంలో విశ్వాసం వున్నవాళ్ళము కలపండి. నేను ఓ సంఘటిత సమాజాన్ని ఈ ఐక్యతలో చూడగలుగుతున్నాను" అన్నది ఆయన బోధలో సారాంశం.

మొదట హిందూ ధర్మ సంస్కారం కోసం మొదలై క్రమంగా క్షీణించి, ఛిన్నాభిన్నమై ఆఖరుకు హిందూత్వం ఛాయలే కోల్పోయిన ఎన్నో సంస్థల్లా కాక శ్రీ గురు ఉద్యమం ఈ నాటికీ ఓ మహత్తర శక్తిగా నిలబడివుంది.

"ఆయన ఉద్యమం హిందూ జాతీయతకు అసలైన వివరణగా, నిజమైన అర్థంగా నిలిచివుంది. ఇప్పటివరకూ జరిగిన వాటికంటే సాహస వంతమైనది, ఉపనిషత్తుల కాలంనుంచి, బుద్ధ, శంకరాచార్య, స్వామి దయానందుల కాలంవరకు ఓ స్పష్టమైన ఆకారాన్ని దాల్చిన హిందూ సంస్కృతీ ధర్మాలతో తాదాత్మ్యం చెందుతూ నిల్చివుంది" అన్నాడు సన్యాసం స్వీకరించిన ఆయన శిష్యుడు.

ఆయన సౌగంధ భరిత బోధలు ఆగి దశాబ్దాలు దాటిపోయినా కేరళకు వెళ్ళిన వాళ్ళకు ఆ సుగంధాల అనుభవానికి ఢోకాలేదు.

ఆయన తాను సజీవుడుగావున్నప్పుడు కేరళ హిందువులకు నిమ్న వర్గాల వారి విమోచనా మార్గాన్ని చూపాడు. ఆయన ఆత్మ భారతదేశాన్ని, హిందూ జాతిని అంతిమ ధ్యేయమైన ఐక్య సుసంఘటిత సమాజ జీవనం వైపు నడిపించగలదు. సాంఘిక, సామాజిక, మత, ధార్మిక రంగాల్లో దేశ వ్యాప్తంగా అందరూ అంటూవున్న "అయితే మనం ఏం చెయ్యాలి?" అనే ప్రశ్నకు ఆయన సమగ్ర, సంపూర్ణ జీవనమే జవాబు.

"మాకు వెలుగు చూపి నడిపించు స్వామి!" అని దేశభక్తిగల ప్రతి పౌరుడు ఆయన పవిత్రాత్మను ప్రార్థించవలసినవాడు.

## స్వామి గురించి శ్రీ గురూజీ

శ్రీ నారాయణ గురు ఉద్యమాన్ని నడిపే కార్యకర్తల విషయంలో అందరు దేశభక్తులు ఆర్.యస్.యస్. నాయకుడు శ్రీ గురూజీతో ఆయన ప్రార్థనలో ముక్త కంఠంతో గొంతులు కలుపుతారు.

"శ్రీ గురు ఉద్యమ కార్యకర్తలను ఆ పరమేశ్వరుడు ఆశీర్వదించు గాక! శ్రీ నారాయణ గురు మహోదార శక్తిపూరితంగా చేసిన ఐక్యతా బోధలు విశ్వవ్యాప్తం అగుగాక! విభేదాంతో భిన్నాభిన్నమవుతున్న ఈ భూమితో మహోన్నత శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనుగాక! భక్తి భావంతో, సమర్పణ భావంతో అందరూ ఈ ధ్యేయానికి అంకితమగుదురు గాక!"

# 13. మన రెండో శత్రువు

మానవ జాతిని పశుత్వం నుంచి విముక్తం చేసి దైవత్వం వైపు నడిపించే పవిత్ర ఆశయం చేబట్టిన భారత జాతికి పట్టిన గ్రహణాలు: అతి ఛండాల శత్రువులు అన తగ్గవి అస్థిర ఆలోచనలు, ఆత్మ విస్మృతి.

## వర్గ శత్రుత్వం దేశాన్ని అడ్డంగా చీలుస్తోంది

మన నాయక వర్గం కూడా ఈ గందరగోళ ఆలోచనలతో సతమతమవుతోంది. ఓ వైపు వర్గ పోరాట సిద్ధాంతాన్ని పోషిస్తూ జాతీయ వాదులుగా కొనసాగవచ్చని ఆలోచన. అదెలా సాధ్యం? వర్గశత్రుత్వానికి, జాతీయతకు పొసగదన్న విషయాన్ని అవగాహన చేసుకోరు. వర్గ శత్రుత్వం దేశాన్ని అడ్డంగా చీలుస్తుంది. ఏ దేశభక్తుడూ ఇలా దేశాన్ని అడ్డంగా, నిలువుగా చీల్చే వాడిని సహించడు.

నెపోలియన్ తన కొడుక్కి ఓ ఉత్తరం వ్రాశాడు. అది అతని రాజకీయ శాసనం అనవచ్చు.

“జాతి ప్రయోజనాలను విభజించేది ఏదైనా అంతర్యుద్ధానికి దారి తీస్తుంది. విభజించటానికి వీలులేని దాన్ని ముక్కలు చెయ్యలేం. అది ఛిద్రం అవుతుంది”.

అయినా హిందూత్వానికి, సోషలిజానికి వారధి కట్టాలనే హిందూ నాయకుల్ని చూస్తున్నాం మనం. వీళ్ళు తమను తాము ‘హిందూ సోష

లిస్టులం' అని వర్ణించుకుంటున్నారు. అలాటి కలయికలో తప్పులేదని వాళ్ళ ఉద్దేశ్యం.

విదేశీ ఆలోచనలతో పాటుగా, వాళ్ళ ఆచారాలకు తోడుగా మానసిక వాతావరణం ఆలంబనంగా కొన్ని వికృతాలుకూడా దిగుమతి అవుతాయన్న విషయాన్ని చాలా అమాయకంగా మర్చిపోతారు.

ఉదాహరణకు, ఉభయ పక్షాల్లో మరణాల్ని తెచ్చిపెట్టే యుద్ధానికి బీజాలు వెయ్యకుండా 'మే డే' ఎలా జరుపుకుంటూ వుండగలం? 'మే డే' దేనికి గుర్తు ?

ఈ మౌలిక మానసిక స్థితిని గుర్తించరు. మార్క్సు సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఏజంట్లు కొందరు అమాయక జాతీయవాదుల్ని తప్పుదోవ పట్టించటంలో కృతకృత్యులు కాగలిగారు.

విసమతి చేస్తున్న ప్రచార చాతుర్యంతో తమ కార్యసాధనకు చాలా ప్రముఖంగా చొచ్చుకుపోతున్నారు కమ్యూనిస్టులు. ఈ కమ్యూనిజం మన దేశానికి రాక ముందు అడుగుపడ్డ సమాజాన్ని, ముఖ్యంగా గ్రామీణుల్ని ఉద్ధరించటానికి ఎలాటి కార్యక్రమమూ లేదనే భావాన్ని సృష్టించటానికి శత విధాల ప్రయత్నం చేస్తున్నారు - భారతీయ సంస్కృతిలోని మానవత్వ విస్తరణకు చాలదన్నట్లు!

## భారతీయ కార్మికోద్యమ నాయకులు మార్క్సిస్టులా?

పాశ్చాత్య 'ఇజాలు' తెలియకముందే భారత్‌లో కార్మికుల్ని ఏకత్రితం చేసి వాళ్ళ కోరికలను తీర్చటానికి ఉద్యమాలు నడిపిన మహాత్మా జ్యోతిబా ఫులేను వీళ్ళు జ్ఞాపకం ఉంచుకోవాలి. వాసుదేవ బల్వంత్ ఫడ్కే-

నిర్వహించిన కర్షక తిరుగుబాటు భారతీయ ధ్యేయాల పరిధిలోనే జరిగింది. మన దేశంలో మొట్ట మొదటి కార్మిక నాయకుడు అనదగ్గ శ్రీ యన్. యం. లోఖాండే మానవతా వాదం స్వదేశ సాంప్రదాయాల్లోంచే పుట్టింది.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నిర్వహించబడ్డ కార్మిక ఉద్యమాలకు దారి చూపిన మహాశయులంతా భారతీయ సంస్కృతిని ఆమోదించినవాళ్ళే. సాధించబడ్డ అద్భుత ఫలితాలకు ఏ పాశ్చాత్య 'ఇజమూ' తమ గొప్పతనమని చెప్పుకోనక్కర్లేదు.

మహాత్మా గాంధీ భారతీయ పునాదులమీదే కార్మిక ఉద్యమ నిర్మాణానికి కృషి చేశాడు.

గాంధీ ఆర్థిక తత్వం ఈశావాస్య సూత్రం 'తేన త్యక్తేన భుంజీతాః' అనేదాని విస్తృత వ్యాఖ్యానమే' వివరణే!

సుఖాలను కోరని కఠోర నియమం; సరళ స్వభావం; కోరికలను అదుపులో వుంచుకుని స్వయంగా నియమాలకు కట్టుబడి వుండటం; నిర్జీవ యంత్రాల్లా గాక సజీవత్వం; పరిశ్రమపట్ల విశ్వాసం, గౌరవం, పవిత్ర భావం; ఐతిహాసిక సాంప్రదాయాలను పక్కకునెట్టే పాశ్చాత్య ఆర్థిక సూత్రాల నిరాకరణ; హింసకు దారితీసే ఐహిక పద్ధతుల, ఆర్థిక సూత్రాల బదులు అహింసను ప్రోత్సహించే మానవతా సూత్రాలు, ఐతిహాసిక సాంప్రదాయాలు ఇవన్నీ గాంధీ చెప్పిన తత్వాలు. ఆధారం ఈశావాస్య సిద్ధాంతమే!

భారత్‌లోని కార్మిక ఉద్యమానికి చెప్పుకోతగ్గ సేవ చేసిన డాక్టర్ అంబేద్కర్ కమ్యూనిజాన్ని పట్టికారత్తో క్షూద్ర శాకభేద్యు!

"నేను కమ్యూనిస్టులతో చేరే అవకాశమే లేదు" అన్నాడు అంబేద్కర్ నాసూర్‌లో, సెప్టెంబర్ 1937 లో జరిగిన జిల్లా బడుగు వర్గాల మహా సభలో.

"తమ రాజకీయ ప్రయోజనాలకోసం కార్మికులను పీడించే కమ్యూనిస్టులకు పచ్చితమైన శత్రువును నేను" అని కూడా తేల్చి చెప్పాడు.

ఓ స్థాయిగల కార్మికనాయకుడు, మేధావి శ్రీ యం. యన్. రాయ్ కమ్యూనిజంనుంచి మానవతావాదం వైపుకు మారటం కమ్యూనిస్టుల మాటల్లోని బడాయితనాన్ని, వాదాల్లోని శూన్యతను తెల్పుతోంది.

సనాతన భారత్‌లో ఎవరూ ప్రదర్శనల్ని నిర్వహించలేదు. స్ట్రైకులు చేయించలేదు. "మా కోరికల్ని తీర్చాలి!" అని నినాదాలిప్పించలేదు. ఏమిటీ ! అది ఆర్థిక వ్యవస్థలో లోపాన్ని చూపదు. సర్వ సంతృప్తి కరమైన ఆర్థిక సమాజాన్ని, ఓ స్థిరమైన సమాజ ఉనికిని తెలియచెప్తోంది. కోరికల తోరణాలు పెరగటం, డిమాండ్లు ప్రగతిని కాదు చూపేది ఆర్థికంగా వెనుకబడి వుండటాన్ని, అజ్ఞానాన్ని తెల్పుతుంది.

## నాలుగు అవసరాలు

ఈనాడు మౌలిక కోరికలు (డిమాండ్లు) అని మనం వర్ణించేవాటిని మన పూర్వీకులు కనీస అవసరాలుగా ఏనాడో గుర్తించారు. "ఆహారనిద్రా భయమైథునాలు" అనే నాలుగు మానవాళి సహజ అవసరాలు అన్నారు ఋషులు.

తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని తెల్పటం భారతీయ సంప్రదాయం. ప్రతి మాటకు విలువుంది,

'ఆహారం' అన్నమాటకు ఈనాటి అధునాతన మాటల్లో చెప్పాలంటే బ్రతికేహక్కు, అంటే పనిహక్కు, ప్రతిఫలంహక్కు అంటే జీతం, భత్యం, ఇంక్రిమెంట్లు, బోనస్, మిగతా అలవెన్సులు అన్నీ ఆహారం అన్న దాన్లో అంతర్గత భావాలు.

'నిద్ర' అన్నది విశ్రాంతికి సంకేతం. పని, వేళలు, సెలవులు, అవసరానికి సెలవు పెట్టుకునే హక్కు అన్నీ నిద్రలో అంతర్గతంగా వున్న విషయాలు.

'భయం' అంటే దేనిని శంకించి భయపడటం. పరిశ్రమల విషయం తీసుకుంటే నిరుద్యోగ శంక, పని ఆగిపోతుందనే భయం, జబ్బు ప్రమాదాలు, వార్ధక్యం, అకస్మాత్ మరణం ఇలాంటి భయాలు. నిరుద్యోగం అంటే పని రక్షణ, నిరాటంకంగా ఉద్యోగం కొనసాగే ఏర్పాటు జబ్బు వాళ్ళకు పరిహారం, (ప్రావిడెంట్ ఫండు) భవిష్యనిధి, జీవిత బీమా, వార్ధక్య పెన్షన్, గ్రాట్యుయిటీ (Gratuity), ఉద్యోగంలోంచి తీసేస్తే పరిహారం, విధవా ప్రతిఫలం, ఇలాంటి అన్నిరకాల సాంఘిక సంరక్షణ పథకాలు ఈ భయంక్రింద వచ్చేస్తాయి.

ఆఖరుది జీవితంలో వ్యక్తికి దొరికే అల్పాల్ప సుఖం. ఎన్నో కార్మిక సంక్షేమ పథకాలు, పారిశ్రామికవాడల నిర్మాణ పథకాలు, ఇలాంటివన్నీ మనం ఆలోచించవచ్చు.

కార్మిక సంస్థలు దబాయించి అడిగే అన్ని రకాల కోరికలకు ఈ నాలుగు పదాలు ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. ఇవేవో డిమాండ్లని, ఆందోళనలు చెయ్యాలని, రచ్చ చేస్తేగాని లభించవని చెప్పి కార్మికుల మనస్సులు కలుషితం కాకుండా మన పూర్వీకులు వీటిని అతి సాధారణంగా సామాన్య అవసరాలుగా గుర్తించారు.

వీటి సంతృప్తి ప్రకృతి, తీరకపోవటంగాని అతిగా స్వేచ్ఛా విహారం గాని వికృతి అన్నారు. ఈ ప్రకృతి కోరికలు తీరకపోతే సాధారణ మానవులు సహజంగా ఆలోచించరు. ఈ సాధారణ కోరికల పట్ల ఆఖరయ్యే దగ్గర్నుంచే సంస్కృతి ప్రారంభం అవుతుంది. ప్రపంచంలోని అందరు కమ్యూనిస్టులు తమ 'ఇజం' మాత్రమే ఆర్థిక పరంగా ఆలోచిస్తోందని చెప్పుకుంటారు. కారల్ మార్క్స్ కు ముందు ఈ ప్రపంచంలో మరెవ్వరూ ఆర్థిక సమస్యల గురించి ఆలోచించలేదనటం తప్పు. అది కేవలం అజ్ఞానాన్నే సూచిస్తుంది. గొప్ప గొప్ప ఆధ్యాత్మిక చింతకులు వ్యక్తిగత సౌఖ్యం గురించిగాని, సామాజిక జీవన సమస్యల గురించిగాని పట్టించుకోలేదనటం, విస్మరించే వారనటం పెద్ద పొరపాటు. వాళ్ళు అర్థ శాస్త్రాన్ని విస్మరించనూ లేదు. ఈ ఒక్క విషయమే మానవ జీవితంలోని అన్ని పంథాలనూ ఆక్రమించి కూర్చోవటానికి అవకాశమూ ఇవ్వలేదు. జీవితంలో దాని స్థానాన్ని దానికిచ్చారు. పదార్థం భౌతికమైందని, భూతికమైందని భావించారు. కాని అదే సర్వస్వం కాదు. మనం భారతీయ ఆలోచనల ప్రకారం ఆర్థిక-సామాజిక రంగాన్ని విశ్వ సిద్ధాంతానికి అనుగుణంగా మలుచుకున్నాం. ప్రతి వ్యక్తి తన చతుర్విధ పురుషార్థ సాధనకు దోహదం చేసే రీతిలో వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. భారతీయ యోచనలో అర్థ కామాలను తులనాత్మకంగా ధర్మ మోక్షాలతో పరిశుద్ధి చేసుకుంటూ ముందుకు సాగటమే ఉత్తమ జీవనం.

## భౌతిక తత్వంకంటే మత ప్రాధాన్యతే అభివృద్ధిని సాధించగలదు

అన్ని మతాల సూత్రాలు సమాజానికి భౌతిక సౌఖ్యాలను కలుగచేసే ఆలోచనలను కలిగివున్నాయి గాని అవే తమ అంతిమ ధ్యేయంగా ఎప్పుడూ చెప్పలేదు. భౌతిక ఆనందాలే ధ్యేయంగా వుండటాన్ని అన్ని

మతాలూ వ్యతిరేకించాయి. వేదకాల ఋషుల యోచన ప్రకారం సామాజిక అభివృద్ధి యోజనల సాఫల్యం సముత్కర్ష, నిశ్రేయ సాధనలే; అంటే భౌతిక ఆనంద అభివృద్ధితోబాటుగా శాశ్వత ఆత్మానంద సాధనే! వేద కాలం తర్వాతి హిందూ ధార్మిక పంథాకూడా ఇదే.

అన్ని ధ్యేయాలకంటే పరిత్యాగాన్నే ఉన్నతమైందిగా ఒప్పుకునే బౌద్ధం సంపదను భగవదాశీర్వాదంగా స్వీకరించింది. కాని వినయం ఆధిపత్యం క్రిందనే అది వుంటుంది. తనకు అందించిన దానిని మించి ఆశగా బాధుకోపనం అత్యంత నిషిద్ధం. ఆరాధనలోని ఆరు భాగాల్లో సేవకులు, పనివాళ్ళు కూడా ఓ భాగంగా వర్ణించబడ్డారు.

సిగలోవాద సుత్తాంతలో బుద్ధుడే నిర్వచించాడు.

"కేంద్ర బిందువుగా ఆర్యమంత్రి, యజమాని అయిదు విధాలుగా వర్తించాలి. వారి వారి శక్తినిబట్టి పని ఇవ్వాలి. తగిన కూలి, ఆహారం ఇవ్వాలి. జబ్బుపడితే పోషించాలి. వైద్యం చేయించాలి. ప్రత్యేక వంటకా లను వారితో సహా సేవించి ఆనదించాలి. అప్పుడప్పుడూ విశ్రాంతినివ్వాలి."

ఇలా యజమాన్లు సేవకులను ఆదరించినప్పుడు వాళ్లు అయిదు విధాలుగా అభిమానిస్తారు. "యజమానికన్నా ముందే లేస్తారు. ఆయన పడుకున్నాకే వీళ్లు పడకలు చేర్తారు. వాళ్ళకిచ్చేదాంతో సంతృప్తి చెందుతారు. పని తృప్తికరంగా చేస్తారు. యజమానిని పొగుడుతూ ఆయన ఖ్యాతిని నలు వైపులా పెంచుతారు."

అన్యాయాన్ని, అసమానతను ఎదుర్కొనే విషయంలో ఏ విధం గానూ మార్క్సిజం జోరాస్ట్రియన్ సూత్రాలకంటే భిన్నంగా లేదు.

'హుమాత, హుఖాత, హువెర్షత' అన్నవి మూడు ముఖ్యమైనవి జొరాస్ట్రియన్లల్లో. ఆలోచనలు పవిత్రంగా వుండాలి. మాట మంచిదనం వుండాలి. క్రియ సక్రమంగా, చక్కగా వుండాలి. ఆ పరమాత్ముని దగ్గరకు చేరటానికి తన అనుయాయులకు కొన్ని ఆదేశాలను ఇవ్వటం జరిగింది.

* ఆలోచనల్లో, క్రియలో పవిత్రత
* పేదలపట్ల ధర్మగుణం
* మనకు పనికివచ్చే పశువులపట్ల దయ
* భూమి సాగులో తగిన కృషి
* వృక్ష సంపద పెంపు
* పశు పోషణగాని మరేదయినా ఇతర ఉపయోగకరమైన వ్యాపకం.

జైన మతం ఆత్మమీద సర్వాధిపత్యాన్ని సాధించే మతం. సర్వత్రా పరిత్యాగాన్ని బోధించే మతం, పశువులను, పక్షులను క్రిమి కీటకాదులను గూడా సేవించమనే మతం ఆర్థిక పరమైన పీడనను వ్యతిరేకిస్తుంది అని చెప్పటం అనవసరం.

ఆయా కాలమాన పరిస్థితుల ప్రకారం ఇతర గొప్ప మతాలన్నీ ఆయా సమాజ ఆర్థిక ప్రగతిని గురించి చక్కగానే ఆలోచించాయి.

"మంచి జీవితాన్ని ఏ వ్యక్తైనా సామాజికంగానే గడప గలడు. మనిషి తనతోటివారి గురించి సదా ఆలోచించాలి. ఎవరేపని చేసినా 'ఇతరులకు ఇది ఏ విధంగానైనా ఇబ్బంది కలుగజేస్తుందా?' అని ఆలోచించి చెయ్యాలి." అన్నవి జూడాయిజం సూత్రాలు.

యెహోవా మోసెస్ ద్వారా ఇజ్రాయేలీలకు పంపిన పది ఆజ్ఞల్లో ఇతరుల ఆస్తిని దొంగిలించవద్దని, ఆక్రమించుకోవద్దని, వారానికోరోజు శెలవు పాటించి విశ్రాంతి తీసుకొమన్న ముఖ్య నిబంధనలూ వున్నాయి.

## ఇస్లాం గురించి ఓ మాట

పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం అరేబియా ఆర్థిక జీవితాన్ని సక్రమ పద్ధతిలో నడపటానికి మహమ్మద్ కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టాడు. 'జకాత్' చెల్లించాల్సిన నిబంధన, 'సదాకత్' ప్రోత్సాహం, వారసత్వ చట్టం, వడ్డీల నిషేధం, కొన్ని రకాల సంపాదనలు, ఖర్చులు చట్టవిరుద్ధమని నిర్ణయించడం, ఇలాంటివే మరి కొన్నింటిని ప్రవేశపెట్టి విశృంఖల ఆర్థిక వ్యవస్థను అదుపులోకి తేవటం జరిగింది. కాని అదే ఊపుతో భౌతిక తత్వాన్ని వ్యతిరేకించాడు. మహమ్మద్ తన ఆఖరు బోధలో అన్న విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవచ్చు. "అల్లా తన సేవకుడిని (మహమ్మద్‌ను) ఈ భౌతిక ప్రపంచ ఆనందాలు కావాలా లేక తనకు సంబంధించినవి కావాలా అని అడిగాడు. నేను అల్లాను చేరటానికే నిర్ణయించుకున్నాను" అన్నాడు. శారీరక సౌఖ్యాలను వ్యతిరేకించాడని ఖచ్చితంగా చెప్పొచ్చు.

పనివాళ్ల విషయంలో మహమ్మద్ అభిప్రాయం.

"మీ సేవకులు మీకు భ్రాతృసమానులు. దేవుడు వాళ్లను మీ అధీనంలో వుంచాడు. తను తినేదే అతనికీ పెట్టాలి. తనలాంటి బట్టలు వేసుకునేలా చూడాలి. వాళ్ల శక్తిని మించి పని ఇవ్వొద్దు."

క్రీస్తు శిఖరాగ్ర బోధన అంతరార్థం పరస్పర ప్రేమ. దీని తర్వాతే క్రైస్తవులు 'మంచి సమాజం'గా ఏకత్రితం కాగలిగారు. స్వంత ఆస్తులన్నీ సమాజపరమైనాయి. కాని ఇది స్వప్రేరణగానే జరగాలి. ప్రార్థనలో

'ఈ రోజు ఈ మారొట్టె' అన్నప్పుడూ "మనిషి కేవలం ఆహారంతోనే బ్రతకడు" అన్న విషయం మర్చిపోలేదు. ప్రపంచ అన్ని రాజ్యాలమీద ఆధిపత్యాన్ని శారీరక సుఖాలకోసం ప్రాకులాడే వాడెవడైనా వదులుకో గలడా?

ఇలా ఆలోచించి చూస్తే అన్ని మతాలూ, వాటి ప్రవక్తలు గాని నాయకులు అసత్గ్గ వాళ్ళుగాని భౌతిక అవసరాల విషయంతో దృష్టి వుంచినా మార్క్సిజానికి అనుగుణంగాలేరు.

—ఏమతమూ దిగంబర భౌతికవాదాన్ని సమర్థించదు.

—ఎవరూ వ్యక్తిని కేవలం ఆర్థిక జీవిగా అనుకోలేదు.

—ఎవరూ వ్యక్తులనుగాని పరిస్థితులనుగాని బాగుచేయటానికి బాహిర బలాత్కార పద్ధతుల్ని, గోలలు అల్లర్లను ప్రోత్సహించలేదు. ఆ పద్ధతులమీద ఆధారపడలేదు.

## దైవత్వం - రాక్షసం

మతాల్లో పైకి కనిపించే విభేదాలు కృత్రిమమైనవి. అన్నీ ఈనాడు మార్క్సిజాన్ని పట్టుకు ఊగిసలాడే రాక్షసకూటాలకు భిన్నంగా వున్న దైవకూటాలే! మౌలికంగా మతాలన్నీ ఒకటే. స్వామి వివేకానంద అన్నట్లుగా అనంతకాలం నుంచి ఒకే నిరంతర ధర్మం నెలకొని వుంటుంటుంది. ఒక్కోవేళంలో ఒక్కోరీతిగా ఈ ధర్మం వ్యక్తమవుతోంది."

అన్ని మతాల ఆధ్యాత్మిక చింతనలు తుదకు అద్వైత సిద్ధాంత సాక్షాత్కారానికే దారితీస్తాయి. వారి వారి ప్రజల స్థాయికి తగినట్లుగా భిన్న భిన్న దేశాల్లో సాధుసంతులు, ప్రవక్తలు ఈ విషయాన్నే వివరించారు. ఇదే సహజ పరిణామం కాగలదు. అంతేగాదు, అన్ని మతాలూ అద్వైతంతో అంగీకారాన్ని కలిగేవున్నాయి. నిజానికి అన్నీ అద్వైతంలోంచి పుట్టి తిరిగి అద్వైత దర్శనంతోనే పరాకాష్ఠ నందుకుంటాయి. అద్వైతం సత్యం కాబట్టే అన్ని మతాలూ సత్యాలు. ఈ ఆత్మైక వేదాంతసారమే అన్ని వాదాల్లోని దైవంయొక్క అధిష్ఠానసారం. ఒకటి మహాకవాణి నైమిత్తతకు ఆధారం.

మార్క్సిజం ఈ దైవత్వం అనే భావంమీదిరే దండయాత్ర చేసింది. ఈ ఆత్మజ్ఞానానికి, భావసంపదకు పోషణకు హిందువులకంటే మరెవరు సమర్థులు? భారతమాత అనంతకాలం నుంచి విశ్వసంస్కృతి సముద్ధరణకే నడుంకట్టివుంది. సర్వ మానవ శ్రేయో జీవనానికి మనదేశం ఎప్పుడూ కృషిచేస్తూ విశ్వధర్మాన్ని అన్నిదిక్కులా వ్యాపింపచేస్తోంది మన పవిత్ర భూమిలో హిందూ జాతీయత విజయంతోనే విశ్వవ్యాప్తంగా ఆత్మజ్ఞానం వ్యాప్తికాగలదు. దైవత్వం నిలబడగలదు.

హిందూదేశస్థులు వారి చారిత్రాత్మక బాధ్యతను గుర్తించాలి. ఆత్మ విస్మృతి అనే ప్రథమ శత్రువును నిర్జించి ఆలోచనలను వక్రీకరించే ఈ రెండో శత్రువును నిర్జించటానికి నడుంకట్టాలి.

# 14. చైనాలో కన్ఫ్యూషియనిజం, కమ్యూనిజం

(చైనా దండయాత్రకు పూర్వం వ్రాసిన వ్యాసం.)

డా॥ జెకిల్, హైడ్ అనేవి ఓ వ్యక్తి రెండు రూపాలు. మొదటిది మంచిదైతే రెండవది అతి క్రూరమైంది. చైనా జెకిల్ రూపం కన్ఫ్యూషియనిజం అయితే కమ్యూనిజం హైడ్ రూపం. చైనావారి జాతీయమనస్సుమీద ఈ హైడ్ డా॥ జెకిల్‌ను అణగద్రొక్కి స్థిరనివాసం ఏర్పరుచుకున్నాడు. జాతీయస్థాయిలో చైనావారివి భిన్న రూపాలు, భిన్నమనస్తత్వాలు. ఆనాటి మన ప్రధాని నెహ్రూ చైనా భారత్‌ల మధ్య అనంతకాలం నుంచి నిరంతరంగా వున్న స్నేహం గురించి చాలాసార్లు చెప్తుండేవాడు. 'ప్రపంచచరిత్ర దర్శనం' గ్రంథకర్త చెంగిజ్‌ఖాన్ నాయకత్వంలో కుప్పలకొద్దీ వచ్చిపడ్డ దండయాత్ర కారుల్ని మర్చిపోయ్యాడు పాపం. నెహ్రూ ఈ పొరుగుదేశం మీద ఎంతో ప్రేమ కురిపించేవాడు. అక్కడ కొన్నేళ్ల కన్ఫ్యూషియన్ శక్తులకు, కోమిన్‌ఫారమ్ శక్తులకు బాహాబాహీ ఘర్షణ జరుగుతూ వచ్చింది. ఆఖరుకు కన్ఫ్యూషియన్ శక్తులు తలొగ్గి సమసిపోయ్యాయి. మన దేశశ్రేయస్సును బలిపెట్టి నెహ్రూ ఈ శక్తుల్లో దేన్ని మెచ్చుకునేవాడో! (తరతరాల బాంధవ్యం, మిత్రత్వం వుండేది అని తలుచుకునేట్లయితే మనం కన్ఫ్యూషియన్ ఆలోచనా పంథాలో నడిచే ప్రజానీకంతోనే స్నేహంగా వుండేవాళ్లం అనుకోవాలి.)

## కమ్యూనిజం - సంస్కృతి

చైనా ప్రజల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవటం పాశ్చాత్యులకు కష్టం. గత 25 శతాబ్దాలుగా చైనాను అనేక రాజవంశాలు పాలించాయి. కాని వాళ్లల్లో ఎవరూ చైనీయుల మనస్సుల్లో సంఘటితంగా సైనిక ఘోర ణిని తీసుకరాలేదు. ఈ సుదీర్ఘ కాలంలో చైనాజాతికి అనేకరకాల ప్రభు త్వాలుండేవి. మంచివి, దుర్మార్గంగా వున్నవి, అసలేమీ పట్టించుకోనివి ఇలా అనేకం. కాని సాంస్కృతికంగా వాళ్ల మనస్సులు, హృదయాలు కుంగ్-ఫూ-జె-కుంగ్ (కన్ఫ్యూషియస్). ఆయన 'మున్న' అనేచోట క్రీ.పూ. 551లో పుట్టాడు. టావోయిజాన్ని ప్రవేశపెట్టిన లావో-జెకు 50 సంవత్స రాల తర్వాత, ఈనాటి వరకూ ఆమోదించిన లెక్కల ప్రకారం బుద్ధునికి 9 సంవత్సరాల తర్వాత. ప్రభుత్వాల్లో, పాలనలో ఎన్ని మార్పులు వచ్చినా ఆయన ప్రభావం మాత్రం శాశ్వతంగా నిల్చిపోయింది. తన ప్రజల సాంస్కృతికవిలువల, ధ్యేయాల, ఆదర్శాల విషయంలో అతి స్పష్టమైన దృక్కోణాన్నిచ్చి వాళ్లను నడిపించింది కన్ఫ్యూషియస్సే. లోతైన మహా సాగర హృదయాన్ని ఎన్నితరంగాలైనా కదిలించలేనట్లే ప్రభుత్వాల్లో మార్పులు, హెచ్చుతగ్గులు చైనీయులపై ఆయన ప్రభావాన్ని కదిలించ లేకపోయ్యాయి.

కాని కోమిన్ ఫారమ్ చైనాను ఒక్క రాజకీయంగానే కాకుండా చైనీయుల వ్యక్తిగత జీవితాల మీద, సామాజిక జీవనం మీదకూడ ఆధి పత్యం పొంది పాలించాలనుకున్నది. చైనీయుల మేధ మీద, జీవితాలమీద, మనస్సుల మీద సంపూర్ణ ఆధిపత్యంకోసం చేసిన ఈ ప్రయత్నమే జాతీయ సంస్కృతితో పోరాటాన్ని సృష్టించింది.

కోట్లాది చైనీయులు స్వచ్ఛందంగా కమ్యూనిజాన్ని ఆహ్వానించి కౌగిలించుకున్నారనుకోవటం పొరపాటు. ఈ వాదికి చెలరేగే ఘర్షణలు,

బహిష్కరణలు ఎర్ర నియంతృత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజానీకం కన్ఫ్యూషియస్‌ను పూర్తిగా మర్చిపోలేదన్న విషయాన్నే తెల్పుతాయి. రాజర్షి పాలించిన చైనాలో కమ్యూనిజం శాశ్వతంగా వుండిపోతుందా లేదా అన్న విషయం కాలమే నిర్ణయించాలి. ఒకటి మాత్రం నిజం. కమ్యూనిజం, కన్ఫ్యూషియస్ నిజాలమధ్య మౌలిక విభేదాలున్నాయి. పొంతన కుదిరే ప్రశ్నలేదు. కొన్ని ముఖ్య విషయాలు తీసుకుని ఆలోచిస్తే చాలు ఈ విషయాన్ని వివరించటానికి.

## కుటుంబాలు - కమ్యూన్లు

మానవ సమాజానికి కేంద్రం ఏమిటి ? ఈ విషయము కన్ఫ్యూషియస్ కుటుంబాన్ని కేంద్ర బిందువుగా గుర్తించాడు. ఓ మంచి కుటుంబంలో సుశిక్షితుడైన వ్యక్తి సమాజానికి పునాదిరాయి అన్నాడు కన్ఫ్యూషియస్. కుటుంబం తర్వాత రాష్ట్రం. కుటుంబంలో సహజంగా అలవడే ప్రేమభావం రాష్ట్రం విషయంలో బాధ్యత రూపాన్ని దాలుస్తుంది. నిర్మాణక్రమంలో తర్వాతిది మానవాళి.

కామ్రేడ్ మావో సిద్ధాంతం ప్రకారం కుటుంబ వ్యవస్థ సమాధుల మీద నిర్మాణమైన 'ప్రజాకమ్యూన్లు' పురోభివృద్ధికి మూల కేంద్రాలు. కమ్యూన్లు తప్పుదారిపట్టాయి. నాశనం చెయ్యబడ్డ కుటుంబ వ్యవస్థ సహజ పద్ధతిలో తిరిగి పునఃప్రతిష్ఠితం చెయ్యబడుతుందో లేదో అనుమానం. అన్ని కష్టానష్టాల సమయాల్లో కుటుంబ వ్యవస్థ ప్రతి వ్యక్తికి ఓ అండగా ఒక రకమైన భీమా వ్యవస్థగా వుండేది. ప్రేమభావంతో వున్న ఈ భీమా కొత్త వరవడిలో కొట్టుకపోయింది. కార్మిక భీమా పద్ధతిలో 1958 లెక్కల ప్రకారం, 65 కోట్లల్లో 1.4 కోట్ల మందికి మాత్రం ఆధారం వుంది!

'వందల పూలు వికసించాలి - వందల ఆలోచనలు పెంపొందాలి' (Let hundred flowers bloom and a hundred schools of thought contend) పేరు కింద పెద్ద సంఖ్యలో ఎదురు తిరిగినవాళ్ళను అంతమొందించటం మర్చిపోలేని విషయం. వ్యూహం అతి సామాన్యంగా కనిపిస్తుంది. దాగివున్న పిచ్చి మొక్కల్ని బయటపడెయ్యటం. మావోను వ్యతిరేకించిన లక్షలాది ప్రజలకు రక్తాభిషేకం జరిగింది. మార్క్సిజం సాంప్రదాయాలను నిలబెట్టటమేననుకోండి !

ఓసారి కన్ఫ్యూషియస్‌ను "ధర్మంకోసం అధర్మీయులను అంత మొందించాలిగదా" అని అడిగారట.

"ప్రభుత్వాన్ని నడపటానికి అసలు చంపటాలు ఎందుకు? మీరు మంచి కోరికలు, ఆలోచనలు కలిగివుండండి. ప్రజలూ మంచివారవుతారు. గొప్పవాళ్ళు, అల్పులు అనేవాళ్ళ మధ్య బంధుత్వం గాలికి, గడ్డికి గల బంధుత్వం లాంటిది. గాలి ఎటు వీస్తే గడ్డి ఆ వైపుకే వాలుతుంది. సద్గుణాలతో ప్రభుత్వాన్ని నడిపేవాడు ధ్రువనక్షత్రం లాంటివాడే ! తను స్థిరంగా వుంటాడు. అన్ని నక్షత్రాలు ధ్రువ నక్షత్రంచుట్టూ తిరిగినట్లే మిగతా అందరూ అతని చుట్టూ పరిభ్రమిస్తారు'' అని జవాబిచ్చాడు.

## బలవంతాలు - మానసిక మార్పులు

బహిష్కరణలు; అంతమొందించడాలు; రక్త తర్పణాలూ, అభిషేకాలు; బ్రెయిన్ వాషింగులు; సామూహిక హత్యాకాండలతో నిండిన కార్మిక నియంతృత్వం కన్ఫ్యూషియస్ ఆలోచించి, కోరిన ప్రభుత్వధోరణి మాత్రం కాదు. మార్క్సిస్టులు భౌతికవాదులు. పదార్థవాదం. "అవసరాలు మనస్సులను మారుస్తాయి. నిర్దయభరితమైన నియంతృత్వం తప్ప మరేదీ

కొత్త సామాజిక వ్యవస్థను సాధించలేరు. సర్వసంకలనవాదం ఇలానే సాధించాలి" అన్నది వారి వాదం.

కన్ఫ్యూషియస్ సిద్ధాంతం ఈ మార్క్సిజానికి వ్యతిరేకం.

"తమ రాజ్యంలో సుగుణభరిత, సువ్యవస్థిత పాలనను సాధించాలని ఆశించిన మన పూర్వీకులు మొదట ప్రాంతాల్ని పటిష్టం చేశారు. ప్రాంతాల్ని సువ్యవస్థితంచేసేదానికి మొదట కుటుంబాల్ని క్రమబద్ధం చేశారు. అంతకుముందు తమను తాము సంస్కరించుకున్నారు, తమను తాము సంస్కరించుకునేముందు తమ హృదయాల్ని సరిదిద్దుకున్నారు. హృదయాల్ని సరిదిద్దుకోవాలంటే ముందుగా ఆలోచనల్లో నిష్కల్మషంగా వుండాలనుకున్నారు. ఆలోచనలు సరిగా వుండాలంటే జ్ఞాన సమృద్ధిని సాధించాలనుకున్నారు. జ్ఞానాభివృద్ధికి విషయ పరిజ్ఞానం పెంపొందించుకునే సాధన చేశారు.

తీర్పులు, నిర్ణయాలతో నడిపించాలనుకున్నా శిక్షలతో మాత్రమే క్రమబద్ధం చెయ్యాలి అనుకున్నా ప్రజలు చట్టాల్ని అతిక్రమించచూస్తారు. మనస్సాక్షిని కోల్పోతారు. నైతికంగా, సచ్చరిత్రులైన నేతల నేతృత్వంలో ప్రజలు మంచివారుగా, ఆత్మసాక్షితో మెలుగుతారు. సామ్రాజ్యాన్ని శాంతియుతంగా, సంతోషభరితంగా వుంచటానికి ఇదే మార్గం" అన్నది కన్ఫ్యూషియస్ అభిప్రాయం.

ఈ పద్ధతి అంతర్గత అభివృద్ధిని కాంక్షిస్తుంది, వ్యక్తి వికాసం సాంఘిక పురోభివృద్ధికి తోడ్పడుతుంది. భక్తి, వినయం, దీక్షలతో అందరు అభివృద్ధి చెందాలని నిర్బంధించాలి'' అన్నారు కన్ఫ్యూషియస్.

మార్క్స్ సూత్రం ప్రకారం మనిషి ఆర్థిక జీవి. కన్ఫ్యూషియస్ నమ్మకం ప్రకారం మనిషి నైతిక జీవి. ప్రతివ్యక్తి తన గుండెల లోతుల్లోంచి విశ్వ మానవత్వంలో సంయోగం పొందాలని కాంక్షించాడు కన్ఫ్యూషియస్.

ఆయన అయిదు సూత్రాలకు కట్టుబడి వున్నారు. జెన్ - మానవత; ఇ - పవిత్రత; లి - మర్యాద క్రమం; చి - జ్ఞానం; జిన్ - నమ్మకం- ఇవీ అయిదు గుణాలు. ఆర్థిక, సాంఘిక, రాజకీయ, ధార్మిక జీవనం అవి భాజ్యం. అన్నీ నీతి తత్పరతతోనే శాసించబడతాయి. ఈ విశ్వ నైతిక సూత్రానుగుణంగా జీవించటం ప్రతివారి ధర్మం. నైతిక జ్ఞానం మానవుడి సహజ గుణం; నైతిక సూత్రమే ప్రకృతి చట్టం. నైతిక సూత్రాల ఉపయోగం వివిధ సామాజిక బాంధవ్యాల మధ్య ఐకమత్యాన్ని సాధించటమే. మార్క్సిస్టులు సమాజానికి ప్రతిఘాతమైనట్టి బూర్జువా గుణం నీతి అనేదాన్ని దాని బంధాల్ని దగ్గరకు రానివ్వరు. కన్ఫ్యూషియస్ పాపం అంత అభివృద్ధి చెందినవాడు కాదు. ఆయనకు భగవంతుడి మీద చాలా గట్టి నమ్మకం వుండేది. ఒట్టి చర్చలతో కాలక్షేపం చెయ్యకుండా అనుసరణ ద్వారా గుణవికాసం గురించి నొక్కిచెప్పేవాడు. ఆయన నిరంతరం తన ఆరాధ్య దైవంతో తాదాత్మ్యం చెంది వుండేవాడు. ఆఖరుకి పదార్థం మాత్రమే నిజం అనే మార్క్స్‌కు, కన్ఫ్యూషియస్‌కు ధృవాలంత దూరం.

## ఉదారత - మౌఢ్యం

మార్క్సిజం విప్లవం కోరుతుంది. పాత పద్ధతులను ఉగ్రరూపంతో విధ్వంసం చేసి మార్క్సిజాన్ని బలవంతంగా రుద్దటం పద్ధతి. గతంతో విడాకులే! సాంప్రదాయాలపట్ల విశ్వాసమే లేదు. "నిబంధనలు, గుణగణాలు, నైతిక విలువలే ప్రపంచాన్ని శాసిస్తాయి, ఆర్థిక సూత్రాలు కావు. తరం నుంచి తరానికి అందించటం ఏదో సాధారణ విషయం

కాదు. అది సకల మానవ జీవులు తమ ప్రవర్తనను క్రమబద్ధం చేసుకోవటానికి వినియోగపడే సజీవ సూత్రాలు" అంటాడు కన్ఫ్యూషియస్. ఇదంతా తనేదో కనుక్కున్నానని ఆయనెప్పుడూ అనలేదు. చాలా వినమ్రతతో "నేను సృష్టికర్తను కాను, కేవలం వున్న సంప్రదాయాన్ని అందిస్తున్నాను" అనేవాడు. ఆయన బోధలు వర్గవిభేదాల్ని సూచించేవి కావు. ప్రజలకు కొత్త మతాన్ని ఇవ్వాలని, ఇస్తున్నానని అనుకోలేదాయన. ఆయనది ఓ మతం కాదు. ఓ ఇజం కాదు. సాంస్కృతికంగా టావోయిజాన్ని, భారతీయ బౌద్ధాన్ని అనుసరిస్తున్నా కన్ఫ్యూషియస్ సిద్ధాంతం కూడా అందరూ చైనీయులకూ ఆమోదయోగ్యం అయింది. కన్ఫ్యూషియస్ ప్రదర్శించిన ఈ దృక్పథం మార్క్సిజం లాగా వర్గశత్రుత్వ మౌఢ్యం కాదు. మొదటిది అందరినీ కలిపే ప్రేమభావం మీద ఆధారపడితే, మార్క్సిజం విద్వేషం, శత్రుత్వాల మీద ఆధారపడ్డది.

## మార్క్సు విప్లవం - అత్యున్నత మానవుడు

కన్ఫ్యూషియస్ శ్రేష్ఠమానవుడిని ఊహించాడు. వ్యక్తి కుటుంబానికి రాష్ట్రానికి, ఆధిపత్యం వహించాలని ఆశించాడు. భగవద్గీతలో వర్ణించిన స్థితప్రజ్ఞుడిని పోలిన గుణాలతో భాసించే మానవుడిని కన్ఫ్యూషియస్ కోరుకోవటం గ్రహించి ప్రతి హిందువూ ఉప్పొంగాలి. మార్క్సిజం - లెనినిజంలలో చెప్పబడ్డ ఉగ్రవాదికి సరిగ్గా విరుద్ధంగావుండే మానవుడితడు.

కన్ఫ్యూషియస్ సిద్ధాంతాలు హిందూధర్మమూల ఉద్దేశ్యాలతో సరిపోలేవున్నాయి. కమ్యూనిజం, మిగిలిన ఏక సూత్ర మతాల్లా మిగతా అన్నింటినీ బహిష్కరించేదికాదు. కన్ఫ్యూషియస్ సిద్ధాంతం. ఇతను కట్టిన భవంతిని కూలకొట్టటమే ధ్యేయంగా సాగిపోయాడు మావో. ఇదే చైనీయుల్లో అంతర్గతంగా చెలరేగుతున్న అలజడి రెండు చైనాల మధ్య

వివాదం ఇన్నాళ్ళూ నెహ్రూ (వ్యాసం వ్రాసిన నాటి ప్రధాని) సమర్థించేది చైనీయుల నాగరికతను అధర్మంగా అణిచే చైనా ఏజంట్లను బ్రిటిష్ పాలకవర్గం క్రింద తయారైన భారతీయ అధికారవర్గం మన సంస్కృతికి ఎంతవరకు చిహ్నాలుగా వుండగలరో అలాటివారే మావో అనుచరులు. ఇలా చేయడంవల్ల కన్ఫ్యూషియస్ పట్ల నెహ్రూ చాలా అన్యాయంగా ప్రవర్తించి పాపం మూట కట్టుకున్నట్లే!

మరి జెకిల్ చైనాలో పునరుద్ధరించబడగలడా? కాలమే తీర్పు చెబుతుంది.

# 15. మార్క్సిజం – రైతాంగం

వ్యవసాయాభివృద్ధికి, సోషలిజానికి పొంతన తక్కువ. కమ్యూనిస్టు దేశాలన్నీ ఆహారాభివృద్ధి రంగంలో విఫలమయ్యాయి. ఏ కొంత విజయం లభించినా అవి కొద్ది రోజులకు మాత్రమే పరిమితమై వుంది. అదీ, చెల్లించిన ఖరీదెంత! వ్యవసాయ రంగంలో ఆ అభివృద్ధి కూడా మార్క్సిజం అనండి, సోషలిజం అనండి, దీనికి భిన్నంగా పోతేనే లభించింది.

కమ్యూనిస్టు వ్యవసాయ యోజన విఫలం కాక తప్పదు అన్నది ఆర్థిక, మానసిక, చారిత్రక సత్యాలిచ్చిన ఏకైక తీర్పు. ఈ భూమి నుంచి ఆఖరుకు కమ్యూనిజం అంతమయ్యే దానికి గల అనేక కారణాల్లో ఇది అతి ముఖ్యమైనది. అసలా కమ్యూనిస్టు సిద్ధాంతాల్లో వున్న అతి ముఖ్యమైన బలహీనత యిది,

ప్రపంచంలో అతి పెద్ద సంఖ్యలో వున్న వ్యవసాయదార్ల సాంఘిక, ఆర్థిక సమస్యల నిజ స్వరూపం ఈ ప్రపంచ విఖ్యాత ప్రవక్త మార్క్సుకు అసలు తెలిదనాలి. ఈ కర్షకుల్ని చేతి పనివాళ్ళ తోటి, చిన్న వ్యాపారుల తోటి చేర్చారు కమ్యూనిస్టు పార్టీ ముసాయిదాలో. రాజకీయంగా వ్యక్తుల సమూహాలుగా తప్ప రైతులు సామూహికంగా పెద్ద ఐక్యత వున్న వర్గం కాదు. మార్క్స్ వీళ్లను సంచిలోని ఆలుగడ్డలు అని తేల్చేశాడు. గ్రామీణ మూర్ఖ జీవితాన్నించి చాలా మందిని రక్షించినందుకు పెట్టుబడిదారులను పొగిడాడు కూడా. రైతుల పట్ల తనకున్న నిరసన భావాన్ని అతనేం దాచిపెట్టలేదు. రైతుల ఆస్తుల మీది హక్కును స్వాహా చెయ్యటమే ఆర్థిక స్థిరత్వానికి మార్గమన్నదే ఆయన సిద్ధాంతం యొక్క అంతిమ తర్కం. రైతుల సేద్యం నాశనం. "బూర్జువాల గురించి మాట్లాడుతున్నారా? చిన్న రైతుల ఆస్తుల బూర్జువాతత్వం గురించి మనం బాధ పడక్కర్లేదు. పెరిగే కర్మాగారాలే ప్రతి రోజూ మనకు కావలసిన పని చేసి పెడుతున్నాయి. ఈ బూర్జువాలు ఎలాగూ ఈ ధాటికి అంతమవుతున్నారు."

## రైతుల సమస్యలపట్ల మార్క్స్ దృక్పథం

మిక్కుటమైన ఉత్పత్తుల ఆధిక్యతనే నమ్మాడు మార్క్స్. అది ఉత్తమమైంది కాబట్టి తప్పనిసరి అన్నాడు. వ్యవసాయ క్షేత్రంలోకూడా అధికోత్పత్తి చేసేవాడు క్రమంగా చిన్న రైతులకు స్థాన భ్రంశాన్ని కలిగిస్తాడు. వ్యవసాయం కూడా ఓ కర్మాగార పద్ధతిలో ఏదో ఒకనాడు నడపాల్సి రావచ్చు. వ్యవసాయ క్షేత్రంలో కూడా ఐశ్వర్యం కేంద్రీకృతం కాక తప్పదు. వ్యవసాయం, పరిశ్రమలు రెంటికీ సామ్యం వుందనటం శాస్త్రీయమే,

పురోభివృద్ధి సాధిస్తామనే శక్తులకు గ్రామీణ క్షేత్రాల్లో ఎదురయ్యే సమస్య భూమి సమస్య, రైతుల సమస్య కాదు. ఉత్పత్తి సమస్యే గాని సాంఘిక వ్యవస్థ గాదు. రైతు సాంఘిక, ఆర్థిక రంగాల్లో ఏనాడో నాశన మయ్యాడు. ఎందుకంటే-అతను రైతు కాబట్టి. రైతుల ఉనికే తిరోగమన లక్షణం, పురోభివృద్ధి ఆపలేనిది కాబట్టి ఆగలేనిది కూడా రైతుల సంపూర్ణ వినాశనం. ఇదీ మార్క్స్ నిర్వచనం.

## రైతాంగ విప్లవం

'అనివార్యం' అని మార్క్స్ చెప్పిందానిమీద ఆధారపడ్డం గర్వం, అహంకారం తప్ప అదే నిజమని కాదు. మార్క్స్ సిద్ధాంతాల్లో విశేషం, శాస్త్రీయ దృక్పథం ప్రతిదాన్నీ అనివార్యం అని దబాయించెయ్యటమే!

మార్క్స్ యోజనల్లో రైతుల పాత్రేమిటి? అతను పెట్టుబడిదారీ కాదు, కార్మికుడూ కాదు. కర్షకుడు. మార్క్స్ ఆలోచన ప్రకారం యావత్ మానవజాతీ పెట్టుబడిదారీలు, సామాన్య మానవులు అనే రెండు వ్యతిరేక వర్గాలుగా విభజించబడివుంది. అతను, అంటే రైతు, ఈ రెండు వర్గాలకూ చెందడు కాబట్టి అతను ఉండీలేనట్టే లెక్క. కాని అది అశాస్త్రీయంగదా! మార్క్స్ అన్నా అనకున్నా అతను మన కళ్లెదురుగా వుంటూనే వున్నాడుగా! అందులో అతిపెద్ద సంఖ్యలో!

మార్క్స్ నిర్దయగా రైతులకు క్షయాన్ని, చావును శాసించాడు. ఓ వర్గంగా వాళ్లుండవీల్లేదు, తుడిచిపెట్టుక పోవాలని కోరుకున్నాడు. ఈ ప్రవక్త మాటలకు కట్టుబడివుండే ధోరణిలో లేడు రైతుమరి! చదువులేని వాడుగాబట్టి ఈ గ్రాంధిక గతి తర్కాన్ని పెద్దగా మెచ్చుకుంటున్నట్లు లేడు రైతు. అందుకనే పాపం ఆత్మహత్య చేసుకోవటానికి అంగీకరించటం లేదు, మరి ఇదతని విప్లవ ధోరణి కాదా! ప్రతిఘాతకులు రైతులు,

# మోసం చెయ్యటానికి వ్యూహాలు

ఇంతేకాదు. విప్లవకారుల కమ్యూనిష్టుల చరిత్ర పుటల్లో రైతుకు సరియైన స్థానం ఇవ్వకపోయినా రైతులు పాల్గొనని విప్లవమే లేదు. 'ఈ తెగే నశించి పోవాలి' అని ఎవరిమీద తీర్పు ఇవ్వబడ్డదో ప్రతిసారీ వాళ్ళ విషయంలో "రణానికి ఎలాగోలా వారిని మనవైపు త్రిప్పండి" అని కూడా చెప్పటం జరిగింది. అంటే వ్యూహంలో మార్పు. కమ్యూనిస్టు స్వర్గంలో దేవతలు తాము శాపనార్థాలు పెట్టే రాక్షస గణాలతో అవసరాన్ని బట్టి ఇలా ఘనాలు రాసుకుంటూ తిరుగుతూనే వుంటారన్నమాట.

"సామూహిక అవసరాలు ఒక్కోసారి కార్మికులు, కర్షకులు ఒకే చోట చేరి పని చెయ్యాల్సివస్తుంది. అంటే వీళ్ళపట్ల వ్యతిరేకత కంటే అనుకూలత లాభం కావచ్చు" అంటారు కాట్స్కీ. ఇంకా వివరణనిస్తూ, "ఎన్నిసార్లు, ఎన్నిరోజులు ఇలా యుద్ధం కలిసి సాగించినా ఆఖరుకు ఇద్దరూ విడిపోక తప్పదు. ఈనాటి మిత్రులు రేపటి శత్రువులే" అనికూడా చెప్పాడు స్పష్టంగా.

"విజయం తర్వాత రైతుల కార్మికుల ఐక్యత గురించి మాట్లాడటం హాస్యాస్పదం. అందులో పాలన విషయంలో మనం సోషలిస్టు గురించే ఆలోచించాలి. కార్మిక నియంతృత్వమే!" అని వ్రాశాడు లెనిన్. విజయం తర్వాత తమతోబాటు ఆయుధాలు ధరించి ప్రాణాలర్పించే రైతులు ఇలా మోసగించబడతారన్నమాట. "విద్రోహం లేని పురోగమనం ఊహించ రానిదే" - నట.

# కాని రైతు మార్క్సును యుక్తిలో మించిపోయాడు

మార్క్సిజం రైతుల్ని ఆత్మవినాశనానికి తీసుకవెళ్తే మరుండే రైతాంగం మార్క్సిస్టు శ్రేణుల్లో ఆదర్శం గురించే గందరగోళాన్ని సృష్టించింది. మార్క్స స్వయానా చెప్పింది ఎలా తప్పు కాగలదు? కాని కళ్ల ముందు కనిపించే పరిస్థితి మరోలాఉన్నప్పుడు అది నిజం ఎలా కాగలదు? తూర్పు యూరోపా దేశాల్లోని మార్క్సిస్టులు వాస్తవానికి మార్క్సిజానికి వారధి కట్టి సరిపుచ్చాలని శతవిధాలా ప్రయత్నించారు. కాని పూర్తిగా విఫలులయ్యారు. ప్రతి కొత్త వ్యాఖ్యానం ధ్యేయం విషయంలో మరో కొత్త గందరగోళాన్ని సృష్టించింది. వాస్తవాలు ఊహాలోకంలో విహరించే అవాస్తవాలకు సవాళ్లై నిల్చాయి.

ఆఖరుకు మార్క్సును ఓడించారు రైతులు. మార్క్సుగాని ఇప్పుడు బ్రతికుంటే కమ్యూనిస్టు పాలనలోనే రైతులు శుభ్రంగా బ్రతికుండి పైపెచ్చు కమ్యూనిజం పీఠం మీద ఎగిసితన్నటం చూచి విభ్రాంతుడై పొయ్యేవాడే!

పరిస్థితి చెయ్యి దాటకముందే ఈ వామపక్షరంగులు పూసుకున్న రకాలంతా తమ బద్ధశత్రువులని వెంటనే గ్రహించకపోతే భారతీయ రైతాంగం తెలిసి తెలిసి సముద్రంలో దూకినట్టే.

# 16. కార్మిక విజయం కమ్యూనిస్టుల వైఫల్యం

కార్మికరంగంలో నాయకత్వానికుండాల్సిన లక్షణాలేమిటి?

కార్మిక సమస్యల్ని హిందువులు సమర్థవంతంగా పరిష్కరించ గలరా?

కలకత్తా ట్రాం సమ్మెలో డా॥ శ్యాంప్రకాశ్ ముఖర్జీ వహించిన ప్రముఖపాత్రను చాలా కొద్ది మంది మాత్రమే గ్రహించివుంటారు.

సమ్మె వివరాలు తెలిసినవే. కలకత్తాలో వున్న కార్మిక సంస్థలన్నీ యునైటెడ్ ఫ్రంటుగా ఏర్పడ్డాయి. కాని వాళ్లలో ఎవ్వరికీ నాయకత్వాన్ని ఇవ్వటానికి వీల్లేకపోయింది. ఆ పోరాటానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. కమ్యూనిస్టు సంఘాలు కూడా విజయం ఆ సమ్మె ధ్యేయంగా పెట్టుకోవాల్సి వచ్చిన తమాషా పరిస్థితి అది. ప్రతిసారీ మామూలుగా వాళ్లు కార్మికుల ఆందోళనలు విఫలమవ్వాలనే కోరుతుంటారు. ఎందుకంటే కార్మికులు గెలుపొందితే కమ్యూనిస్టులు విఫలులౌతారు. కార్మికుల పురోగమనం కమ్యూనిస్టుల తిరోగమనం. ప్రజలంతా ఆరోగ్యంగా హాయిగావుంటే డాక్టర్లంతా ఇక్కట్లపాలౌతారు! కమ్యూనిస్టు భవనానికి కార్మిక వైఫల్యాలు ఆధారమైన మూల స్తంభాలు.

ట్రేడ్ యూనియన్ నాయకులకు అందుకనే కార్మికుల వైఫల్యాన్ని సృష్టించటంలో తరిఫీదునిస్తారు. కాని కలకత్తా సమ్మెలో సత్వర ఆశయం విజయమే! సనాతన కమ్యూనిస్టు చమత్కారానికి భిన్నం. వాళ్ల విజయాన్ని సాధించే కార్మిక ఆందోళన పద్ధతిలో తరిఫీదును పొందలేదు కాబట్టి వామ పక్ష యూనియన్‌కు చెందనివారికి నాయకత్వం కట్టబెట్టవలసిన అవసరం ఏర్పడ్డది. ఆ క్షణంలో అందరి కళ్లూ పడ్డది డా॥ శ్యాంప్రసాద్ ముఖర్జీ మీదే! ఆయనలో వున్న హిందూ గుణవికాసం అందరినీ ఆకట్టుకున్నది. ఓ హిందువుగా ఆయన నిర్మాణాత్మకమైనట్టి ఆలోచనలే కాక విజయానికి కావలసిన వినూత్న పోకడలకలయిక కూడా సాధించాడు. అందువల్లే వామ పక్ష నాయకులు ఈ రైటిస్టును నాయకత్వం వహించి అందర్నీ నడిపించమని కోరుకున్నారు.

డా॥ ముఖర్జీ ఆంతరంగిక సమైక్యతనేగాక మిగతా అన్నిరకాల ఉపాయాల విషయంలో అద్వితీయంగా నిలబడ్డాడు. అనుచరుల ఆత్మ విశ్వాసాన్ని చూరగొన్నాడు, ఆయన నాయకత్వంలో ముందుకు నడచిన కార్మికులు విజయాన్ని సాధించారు.

రాబొయ్యే రోజుల్లో కార్మిక రంగంలో జరగబొయ్యే దానికి ఈ సంఘటన సూచనప్రాయం మాత్రమే!

# 17. మార్క్సిజం-హిందూత్వం

భౌతికతకు మంచి భక్తుడు దొరికాడు, అతనే కార్ల్ మార్క్స్. మార్క్స్‌కి పదార్థం ఒక్కటే సత్యమైనది, నిత్యమైనది. దాన్ని స్పృశించ వచ్చు, చూడవచ్చు. అన్ని వస్తువుల ఉనికి ఇంద్రియాలద్వారా గాని శాస్త్రీయంగా గాని ధృవపరచాలి. ఓ పరీక్షా నాళిక ద్వారాగాని, దూర దర్శినితో గాని ధృవపరచని దేదీ ఉన్నట్లు ఊహించే అవకాశంలేదు. ప్రయోగశాలల్లో నిరూపణకు అందని భగవంతుడిని ఓ మిథ్యగానే భావించాలి. విశ్వరహస్యాల్ని ఛేదించగలిగేది శాస్త్రజ్ఞానమే అని ఊహించబడ్డది. సర్వజ్ఞానానికి నమ్మకమైన సాధనం ఇదే. శాస్త్ర నిరూపణకు అందని మతం, సాంప్రదాయం లాంటి వాటిని చెత్తకుండీలో పారెయ్యాలి. మనస్సనే దానికి ప్రత్యేక ఉనికిలేదు. విభిన్న అణువుల సంయోగజనిత పదార్థ స్వరూపమే మనస్సు. పదార్థం మనస్సును నిర్ణయిస్తుంది. నిర్దేశిస్తుంది, బాహ్యపరిస్థితులు ప్రాపంచిక స్వరూపాన్ని నిశ్చయిస్తాయి. ఇది మార్క్స్ సిద్ధాంతం.

## మార్క్స్‌మీద డార్విన్, హెగెల్‌ల ప్రభావం

పోయిన శతాబ్దంలోని ఉత్తరార్థం డార్విన్ సూత్రంతో హోరెత్తి పోయింది. ఆయన పరిణామ సిద్ధాంతం అతి ప్రాబల్యాన్ని పొందింది. సహజ ఎంపిక ద్వారా ఏర్పడే బలవంతులే మిగులుతారు. (Survival of-fittest) అనే సూత్రం మిగతా ఎన్నో విభిన్నవాదాలకు ప్రాణంపోసింది. బ్రిటిష్ రాజసంయొక్క తెల్లవాడి బాధ్యత, నాజీల ఆర్యజాతి సిద్ధాంతం,

మార్క్సిస్టుల వర్గపోరాటం ఇవన్నీ దాని విలువలే, అప్పుడప్పుడూ ఏర్పడే ప్రతిబంధకాలు, వైపరీత్యాలు కొట్టిపారేయ్యటానికి వీలులేకపోయినా పరిణామ సిద్ధాంతాన్ని మాత్రం యథాతథంగా అంగీకరించటం జరిగింది. దీని ప్రకారం సహజంగానే అదో నిబంధనలాగా తర్వాత వచ్చే ఆలోచనలు, జాతులు, నాగరికతలు తప్పకుండా పాతవాటికంటే చాలా గొప్పవే కావాలి. మానవుడు సృష్టికి శిరోమాణిక్యలాంటివాడు. అతనిలోంచి సూపర్ మాన్ పుట్టుక తప్పనిసరి అని జోస్యం చెప్పబడ్డది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అంతకుముందున్న అన్నిరకాల సాంఘిక వ్యవస్థలకంటే మిన్నది అన్న విషయం నిర్వివాదాంశం. కాని అది కూడా మరో ఉత్కృష్ట పద్ధతికి స్థానమిచ్చి తొలగిపోకతప్పదు. పందొమ్మిదో శతాబ్దంలో ఐరోపాలోవున్న నాగరికతకంటే అన్ని సనాతన నాగరికతలూ కచ్చితంగా అల్పమైనవే. శాస్త్రజ్ఞానం అత్యున్నత దైవాన్ని నమ్మిన దాని స్థాయి మధ్యయుగం మతాల బానిస సంకెళ్ళ నుంచి మానవుడిని విముక్తం చేసే మేధను ప్రజ్వరిల్లచేసింది. అత్యున్నత స్థాయిలో వికసించిన మానవ మేధస్సు నమ్మకంతో అపనమ్మకాన్ని, అపనమ్మకంతో నమ్మకాన్ని చూసే గుణవికాసం పొందింది. డార్వినిజం సరికొత్త సత్యవాక్కు. మానవ విజ్ఞాన సర్వస్వంలో దీన్ని అన్వయించాలి. మానవ శాస్త్రంలో కూడా. ఈ సాంఘిక శాస్త్రంలో డార్విన్‌లాటివాడు మార్క్స్!

పరిణామం విశ్వసూత్రం. కాపిటలిస్టు ఏర్పాటు మరో సాంఘిక పరమైన స్థితికి మారటం ఖాయం. మరి ఈ సాంఘిక పరిణామానికి మార్గమేమిటి? స్వభావసిద్ధ ఎంపిక సూత్రాన్ని అన్వయించుకున్నాడు మార్క్స్. మార్క్స్ మనస్సులో ఈ పరిణామ మార్గానికి సూత్రం లభించింది. హెగెల్స్ గతితర్కం ఇతని వాదానికి మరెంత బలం చేకూర్చింది. వేదాంతంలో హెగెల్స్ గతితర్క పద్ధతి సాంఘిక పరిధిలో అమలులోకి తేవాలి. ఈ

పూర్వరంగంతో మార్క్స్ తన గతితర్క భౌతిక వాదాన్ని రూపొందించాడు. ఇది డార్విన్ ఆలోచన 'ఉనికికై పోరాటం' అనే దానికి సరిగ్గా సరిపోయింది. వ్యతిరేక శక్తుల పరస్పర పోరాటంతోనే పురోభివృద్ధి సాధ్యం అవుతుంది. "జీవన సూత్రం ఒక్కటే. భిన్నత్వం వైరుధ్యంవల్ల రూపొందే పెరుగుదలే." ఉన్న అన్ని సమాజాల చరిత్రా వర్గపోరాటాల కథలే. ఒక వర్గంవారు మరో వర్గం వారిని పీడించే కథే. గతితర్క భౌతిక వాదం అంటే శ్రామికుల తిరుగుబాటుతో ఏర్పడే శ్రామిక నియంతృత్వం, దాని పరిణామంగా రాష్ట్రీయతల విచ్ఛిన్నం, తత్ఫలితంగా పుట్టుక వచ్చే రాజ్యం, వర్గాలులేని ఓ వినూత్న సమాజం. అక్కడ సామూహిక యాజమాన్యమే వుంటుంది. ఇదీ కథ!

## కమ్యూనిజం మరో ఏకమార్గ మతం

ఈ సిద్ధాంతం పుట్టటంతో మార్క్సిజం ఓ సంపూర్ణమైన మతం అయింది. మార్క్స్ దాని ప్రవక్త, దాస్ కాపిటల్ మత గ్రంథం. కమ్యూనిస్టు పార్టీ కేంద్ర పాలకవర్గం పౌరోహితబృందం, విశ్వాన్ని అందులోని అన్ని ప్రక్రియలను శాసించే అల్లాయే గతితర్క భౌతికవాదం. కమ్యూనిజం అంతిమ స్థాయి అయిన స్వర్గంలో "అందరికీ అన్నీ" లభ్యం కాగలవు. ఎదురు సవాలు లేకుండా చెప్పటం కష్టమే అయినా, మహమ్మద్ ఎలా ఆఖరి ప్రవక్తో మార్క్స్ అంతే! అన్ని ఏకమార్గ మతాల్లాగే ఈ వినూత్న మతం కూడ తీవ్రతలో, మౌఢ్యంలో సంపూర్ణత్వాన్ని సాధించింది.

మార్క్స్ తన సిద్ధాంతాన్ని రూపొందించటానికి చాలా శ్రమ తీసుకున్నాడన్నది నిర్వివాదాంశం. ఆయన అనుసరించిన మార్గం కేవలం ఊహాగాని శాస్త్రీయం కాదు అన్నది కూడా అంతే స్థాయిలో నిర్వివా

దాంశం. ఆయన ఆలోచనా తీరు ఆ కాలంలో ఊహించిన దురభిమానాలు, పక్షపాతాలవల్ల ప్రభావితం అయింది. అందువల్ల అది అసలైన ఆలోచన గాదు, అనుకరణే. అటు తర్వాతి కాలంలో జరిగిన సంఘటనలు మార్క్స్ అతి సూక్ష్మం చేసి చెప్పిన సూత్రాన్ని అసంబద్ధం అని నిరూపించాయి. ఆ సంఘటనలు అతను ఆధారపడ్డ వివరాలు అసంపూర్ణమని, అతని సమాచారం తప్పుల తడికనీ, ఆయన తీరు అశాస్త్రీయమని, ఆయన అభిప్రాయాలు అసంగతాలని, ఆయన జోస్యాలు అబద్ధాలని, ఆయన సిద్ధాంతాలు అంగీకరించలేనివనీ నిరూపించాయి.

మార్క్సిజం దార్శనికం కాదు. ఓ సగౌరవ స్థానాన్ని పొందలేదు. న్యూటన్ సిద్ధాంతాలమీద, డార్విన్ పరిణామ సిద్ధాంతంమీద, హెగెల్స్ గతి తర్కంమీద ఆధారపడిన పరాన్న జీవిలాంటి ఆలోచన. సాంఘిక శాస్త్రాన్ని అభివృద్ధిపరిచే క్రియల్లో పుట్టుకొచ్చిన అనేక సిద్ధాంతాల్లో ఇదొకటి. మార్క్సిజాన్ని హిందూత్వంతో పోల్చాలని ప్రయత్నించేవాళ్లు రెంటిలోకూడా తమ అజ్ఞానాన్ని ప్రదర్శించుకున్న వాళ్ళౌతారు,

## హిందూత్వం కమ్యూనిజాలు పోల్చలేనివి

హిందూత్వం విశ్వ విజ్ఞానం. పాశ్చాత్యులకు అర్థమైన పరిభాషలో శాస్త్రజ్ఞానం, వేదాంతాల పరిధులనుదాటి అతిసమగ్రంగా, అతి పరిపూర్ణంగా వున్న ఓ సువ్యవస్థ. హిందూ ధర్మమే జగత్సూత్రం. దాన్ని హిందువులు కనిపెట్టలేదు. కేవలం గుర్తించి, గ్రహించి ఆ జ్ఞాన సమృద్ధిని సమాజ వికాసానికి వినియోగించుకున్నారు. ఏ సాంఘిక వ్యవస్థయినా శాస్త్రీయంగా వుండాలంటే ఈ జగన్నాటక సూత్రపరిధిలో పెంపొందాల్సిందే! వారి ఈ విశ్వాంతర జ్ఞాన దృష్టితో వర్ణాశ్రమ ధర్మాలు అతి సహజమైనవని, తప్పనిసరియైనవని గ్రహించారు హిందువులు. ఋషులు తమ తపో

బలంతో ఈ విశ్వాంతర ప్రకృతి విధుల రహస్యాలను ఛేదించి మానవాళికి అందించిన మహాపురుషులు. పాశ్చాత్య దేశాల్లో ఇజాలను ప్రవేశపెట్టిన ఆలోచనాపరులు వేదాంతంలో ఓ మెట్టు ఎక్కి వుండొచ్చుగాని వాళ్ళను ఏ విధంగానూ ఈ ఋషులతో పోల్చలేం. హిందూ మంత్రాలు విశ్వాంతర జగత్ కంపనశీలైన వర్ణాలు, శబ్దాలు. ఈ అత్యున్నతస్థాయిని పాశ్చాత్యుల ఏ నినాదాలు, ఊతపదాలు, వాగ్రీతి అందుకోలేవు.

ఆశ్చర్యకర విషయమేమంటే-మార్క్సిజం ఈ పుణ్యభూమిలో కొందరు అనుయాయుల్ని సంపాదించటమే. ఇంతవరకు దాని సమర్థతను ఒప్పుకోవాలి. కమ్యూనిజం 1848లో పుట్టినా ఈ హిందువేతర, హిందు వ్యతిరేక ఆలోచనను 1917 తర్వాతే భారత్‌లో కొందర్ని ఆవేశించగలి గిందంటే దాన్లో వుండే అతి రమణీయ గుణాలు గాని, మనస్సుకు సమా ధానపరచి ఒప్పించటంగాని కాదు. విసిగివేసారిన హిందువును రష్యా విప్లవం పరిబింబించి వుండాలి. భౌతికవాదం మన దేశంలో కొత్త విషయ మేమీ కానప్పటికీ కొంతమందిని ఈ కొత్తవాదం ఆకర్షించటమూ దాని విజయంగానే అంగీకరించాలి.యూరప్ ఇంకా ఆటవిక స్థాయిలో వున్నప్పుడే హిందువులు భౌతికవాదాన్ని అనుసరించారు. కాని మానవాళి పురోభివృద్ధికి హానికరంగా వున్నందువల్ల వాన్ని క్రమేణా నిరాకరించారు.

## హిందూత్వం వదిలించుకున్న భౌతికవాదం

పాశ్చాత్య దేశాల్లో భౌతికవాదాన్ని ప్రవేశపెట్టిన డెమొక్రిటోస్ పుట్టేదానికి శతాబ్దాల ముందే హిందువులు అతి సమర్థవంతంగా భౌతికవాద వ్యవస్థను రూపొందించారు. విచిత్రమేమంటే-ఈ భౌతికవాదాన్ని కనిపెట్టిన వాడు దేవగురువు బృహస్పతి! బార్హస్పత్య విధానం జ్ఞానాన్ని, ఊహింప దగిన ప్రతివాన్ని, అన్ని ప్రత్యక్ష విషయాలను కూడా సవాళ్లు చేసింది.

అన్నింటి ఆధిపత్యాన్నీ నిరాకరించింది. స్వభావవాద ప్రవేశంతో బార్హస్పత్యం 'లోకాయతం' అనే ఓ కొత్త సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టింది. బార్హస్పత్యులు ఈ లోకాయత సిద్ధాంతం ఒక్కటే శాస్త్రీయం అని దబాయించేశారు. మనం చూచేదే ఆధారం. గోచరం కానిది ప్రతిదీ వస్తు పదార్థంగా తీసుకునే వీలులేదు. చైతన్యం పదార్థంనుంచి పుట్టిందే. పదార్థమే అంతిమ సత్యం. మనస్సుకు స్వతస్సిద్ధమైన వాస్తవికత లేదు. మెదడులోని అణువుల కంపనాలవల్లే మనోస్థితిలో మార్పులు కలుగుతాయి. క్రియ, తత్ఫలితంగా రూపొందే ప్రతిక్రియ అనేవేవీ లేవు. విధి, పునర్జన్మ, కర్మ ఫలం, స్వర్గం ఇలాటివన్నీ అసందర్భాలు. స్వభావంవల్ల, ప్రకృతివల్ల మాత్రమే బాధ, సుఖం కలుగుతాయి. తెలివిగల ఆచార్యులు సృష్టించినవే శ్రుతులు. నిజమైన జ్ఞానం రాబట్టుకోవాలి. మానవ జీవితంలో మంచి ఏమైనా ఉంటే అంటే, అది భౌతిక పురోభివృద్ధి, శారీరక సుఖాలు మాత్రమే. ఇవీ బార్హస్పత్య సూత్రాలు!

భారత్‌లో భౌతికవాదం అభివృద్ధి చెందటానికి సంపూర్ణ అవకాశాలు ఇవ్వబడ్డవి. హిందూ సామాజిక జీవనంలో ఆలోచనా స్వేచ్ఛ ఎలాను వుందిగా! హిందూ ధర్మం మానవధర్మం. వేదాంత ధర్మాన్ని గురించి ఆలోచిస్తే అది సర్వమానవ సమ్మతాల సమ్మేళనమే. అన్ని సిద్ధాంతాల కలయిక ఒక్క హిందూధర్మంతోనే సాధ్యం. అన్ని వర్గాలను, పూజా పద్ధతులను తనలో విలీనం చేసుకుంది హిందూధర్మం. అలానే బార్హస్పత్య భౌతిక వాదానికీ సర్వస్వేచ్ఛ ఇవ్వబడ్డది. కాని సర్వతోముఖంగా విఫలం అయ్యాక దాన్ని వదిలించుకోవటం జరిగింది. మనము మరో విషయాన్ని ఇక్కడ స్పష్టంగా చెప్పుకోవాలి. ఆనందమే జన్మ సాఫల్యతకు ముఖ్య సాధనమనే తుచ్ఛ సిద్ధాంతం భౌతిక వాదంలోంచి అంతిమస్థాయిగా ఉద్భవించి మదపిచ్చిగాళ్ల ప్రబలిపోయ్యేసరికి వేద విహిత హిందూ జీవనాన్ని అనుసరించేవాళ్ళేగాక బౌద్ధ, జైన హిందువులు కూడా దీన్ని అతి తీవ్రంగా

వ్యతిరేకించారు. సిద్ధాంతాల పోరాటంలో భౌతికవాదాన్ని అనికి అవకాశాలు ఇవ్వబడ్డాకే, అది పీగిపోయి సమసిపోయింది. ఈ భౌతికవాదం భారతీయ సంప్రదాయంలో కొత్తదని, ఇదేదో పాశ్చాత్య ప్రసాదమని మన ఎర్ర సోదరులు ఊహించుకోవటం అతి పొరపాటు. క్రైస్తవంలో నమ్మకం నమ్మి అయ్యాక మనం ఏనాడో అనుసరించి, పరీక్షించి, చేదు అనుభవాలతో వదిలించుకున్న ఈ దౌర్భాగ్యాన్ని ఇదే తమకు నిష్కృతి మార్గంగా ఈనాడు పట్టుకూర్చుంది పశ్చిమం.

## సృష్టి, స్థితి, లయకారకులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు

మన పూర్వీకులైన ఋషి పుంగవులు "బంగారం ఒక్కటే అయినా నగలు వివిధ రూపాల్లో ఎలా వుంటాయో అలానే సర్వం ఒక్కటే అయినా బాహిర రూపాలుమాత్రం వేరు" అన్నారు. సత్యమే సంపూర్ణమైనది. దానికి ద్విగుణాత్మకమైనదేదీలేదు. బహిరంగా మనకు కనిపించే వివిధ స్వరూపాలు దానికి సహజంగావున్న స్వగుణాత్మక ఫలితాలే.

క్రైస్తవం సృష్టి సిద్ధాంతం మీద ఆధారపడింది. మొత్తం పరిణామానికి ఎక్కడో మొదలు వుండాలన్న ఊహలేకుండా డార్విన్ సిద్ధాంతమూ అర్థ సహితం కాదు. మూల కారకం ఏదీ లేకుండా సృష్టిగాని మరేదిగాని మొదలెలా కాగ్గలదు! శూన్యంలోని దేని ఉనికీ ఉద్భవం కాదు. అలానే ఉన్నదేదీ శూన్యంలోకిపోదు. హిందూ ఋషులు ఓ సత్యాన్ని కనుక్కున్నారు. అదే ఆద్యంతాలులేని నిరంతర సృష్టి, స్థితి, లయాలు. ఏదీ నాశనం చెయ్యబడదు. లయం ఓ నిద్ర లాంటిది. దాన్ని చావుతో పోల్చలేం. కాబట్టి తర్వాతి సృష్టికి ఆధారం వుంది. శూన్యం నుంచి జరగదు. నిద్రలో వ్యక్తి జాగృదావస్థను కోల్పోతాడు. మేల్కొన్నాక మళ్ళీ తన

జాగృదావస్థలో అన్ని మెట్లను క్రమంగా ఎక్కే అవసరం లేదు, మొదట్నుంచీ అ - ఆలతో ప్రారంభం చెయ్యనక్కర్లేదు. ఆలోచనలు, భావాలు, ఆవేశాలు, ఉద్దేశ్యాలు, జ్ఞానం అన్నీ నిద్రకు ముందు ఎలా వున్నాయో అన్నీ అలానే అతనిలో వెంటనే ప్రతిబింబిస్తాయి. వృక్ష సంపద పరిణామానికి లక్షల సంవత్సరాలు పట్టి వుండవచ్చు. ఓ విత్తనం మొలకెత్తి చెట్టవటానికి అన్ని లక్షల సంవత్సరాలు అక్కర్లే. చెట్టు కావటానికి డార్విన్ ప్రతిపాదించిన అన్ని స్థితులనూ అది దాటక్కర్లేదు. దాని ప్రయాణం విత్తన జీవితాన్నుంచి మొదలౌతుంది. లయస్థితిలో గుణాలు చావవు, నాశనంకావు. సుషుప్తిలో వుంటాయి. సృష్టి మొదలుకాగానే వెంటనే అన్నీ సజీవమైపోతాయి. ఈ లయస్థితినే మహావిష్ణువు యోగనిద్రతో గుర్తించాం. ఈ నిరంతరసృష్టి, స్థితి, లయాల కార్యాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపాలతో మనం గుర్తించాం. మళ్లీ వాళ్ల కొన్ని గుణాలతో గుర్తింపబడతారు. తమోగుణంతో రుద్రుడు, రజోగుణంతో బ్రహ్మ, సత్వగుణంతో విష్ణువు. భౌతికతలంలో తమస్సు, జీవతలంతో రజస్సు, మానసిక తలంతో సత్వగుణం గుర్తించబడ్డాయి. సత్యం ఈ అన్ని తలాలలో వుంటుంది కాని అన్నింటికీ అతీతమైందికూడా!

## పాశ్చాత్య శాస్త్ర జ్ఞానం హిందూ సిద్ధాంతానికే చేరుతుంది

సంపూర్ణత్వంనుంచి మన పూర్వ హిందువులు భిన్నత్వంవైపు సాగి పోయ్యారు. తనకు తెలీకుండానే పాశ్చాత్య అధునాతన శాస్త్రజ్ఞుడు భిన్నత్వాన్నుంచి సంపూర్ణత్వానికి చేరుకుంటున్నాడు. అతనింకా చాలా ప్రయాణం చెయ్యాల్సివున్నా మొత్తంమీద ఆ వైపుకే సాగుతున్నాడని నమ్మకంగా చెప్పొచ్చు. పాశ్చాత్యులకున్నటువంటి పరిశోధనాశాలలు, ఇన్ని అనుకూలాలు మన హిందూ ఋషులకుండేవో లేదో తెలీదు. కాని వాళ్లు ఈనాడు, ఇరవై

శతాబ్దంలో పాశ్చాత్యులు తయారుచేసిన శక్తివంతమైన పరికరాన్ని మించిన సూక్ష్మమైన, అతి నేర్పుగల సమగ్రమైన పరికరాలనే తయారు చేసుకున్నారు. దీనిద్వారా వారు అంతిమస్థాయితో సంబంధం పెట్టుకోగలిగారు. దానితోనే తమకు తాము గుర్తింపు సాధించగలిగారు. అధునాతన శాస్త్రజ్ఞానం అంతిమ సత్యసాధన తనకు అతీతమని ఒప్పుకుంది.

ఈ దృష్టితో చూస్తే శాస్త్రజ్ఞాన పురోభివృద్ధి గత శతాబ్దంలో చాలా ఎక్కువగానే వుందని చెప్పుకోవాలి. మొదట శాస్త్రజ్ఞులు దాదాపు ఓ యాభై లక్షల విశుద్ధ పదార్థాలు వున్నాయని కనుక్కున్నారు. వీటిలో మరేటువంటి పదార్థమూ కలిసి వుండదు. ఇలాటి ప్రతి పదార్థంలో కోట్లాది అణువులు వుంటాయని తేలింది. ఈ అణువులు ఒకేరకంగా వుంటాయి. కాని ఒక పదార్థంలోని అణువులు మరో పదార్థంలోని అణువుల్లా వుండవు. వేటికవే! ఈ అణువులు తిరిగి 92 రసాయన మూలకాలల్లో రెంటిమూటి సంయోగ ఫలితం. ఈ అణువులు మళ్లీ పరమాణువుల కలయిక. పరమాణువులు పాజిట్రాన్ యొక్క కేంద్రం, ప్రోటాన్, న్యూట్రానులను కలిగి వుంటాయి. ఎలక్ట్రాన్లు వీటిచుట్టూ అత్యంత వేగంతో అండాకార మార్గంలో పరిభ్రమిస్తుంటాయి. అంటే శాస్త్రజ్ఞాన జగత్తు పదార్థంతో, బరువు కలిగి శక్తిపుంజ భరితమైన పదార్థాన్ని చలనభరితం చేస్తున్నది. పదార్థం తమ వ్యాసం కంటే దూర మున్నప్పుడు పరస్పరం ఆకర్షించుకుంటూ దగ్గరయ్యే కొద్దీ వికర్షించుకునే అణువుల సముదాయం. ఈ అణువులు చలనం కలిగి శక్తి స్వరూపాలుగా వున్నాయి. ఆ చలన జనితశక్తిని వేడి అనడం జరిగింది. రకరకాలుగా కనిపించే వేడి, పని, విద్యుత్, కాంతి శక్తులన్నీ ఎటువంటి నష్టమూ లేకుండా ఒక దానిలోంచి మరొక రూపాంతరం చెందుతుంటాయి. శాస్త్రజ్ఞాన మూలాలు పొడవు, కాలం, పదార్థం యొక్క ద్రవ్యరాశి- వీటి కలయికతో మరెన్నో

గుణాలు బయల్పడతాయి. వేగం అనేది అలానే ఏర్పడ్డది. విశ్వంలోని అన్ని శక్తుల్ని మూడు గుణాత్మకాలుగా విభజించవచ్చు. ఆకర్షణ శక్తి విద్యుత్తు, అయస్కాంత శక్తి. ఈ మూటి ప్రమేయం లేకుండా ఏదీ వుండదు. గుర్తించిన మూడు కొలతలు ఎత్తు, పొడవు, వెడల్పు. విశ్వం అనంత ఆకాశంలో విస్తరిస్తూనే వుంది.

50 లక్షల శుద్ధ పదార్థాల భిన్నత్వం నుంచి శాస్త్రజ్ఞానం క్రమంగా పదార్థం, శక్తుల ద్వంద్వం వైపు పయనించింది. జ్ఞానం పెరిగే కొద్దీ ఇంతకు ముందు స్థిర పరచిన సిద్ధాంతాలనే తుడిచి పెట్టటం మొదలైంది. ఈ ప్రక్రియ ఇంకా ముగింపుకు రాలేదు. 19 వ శతాబ్దంలో అతి గొప్ప శాస్త్రజ్ఞుడిని కూడా ఇటీవలి కొన్ని విషయాలు దిగ్భ్రాంతుణ్ని చెయ్యక మానవు. ఈనాడు మానవుడు మేధ వుండబట్టి ఆలోచిస్తున్నా ఆలోచించా లనే కోరిక వల్లే ఈ మెదడు పెరిగిందని అంటే ఆనాటి శాస్త్రజ్ఞులు ఎవరైనా నమ్మగలరా? ఆకాశం వంకరగా వుంది కాబట్టి అద్దంలాలు కలని అని అంటే నమ్మనే నమ్మడు. రెండు బిందువుల మధ్య అత్యల్ప దూరం సరళరేఖ కాదు వంపు గీత అన్నా, సమాంతర రేఖలు ఎక్కడో కలుసు కుంటాయి అన్నా, కాంతి రేఖలు వంకరగా ప్రయాణిస్తాయన్నా, సర్వ చలనాలూ సాపేక్షమైనవి మాత్రమే అన్నా, వీటిని ఇతర వస్తువుల పోలికతో అర్థం చేసుకోవాలన్నా, పొడవు వేగంతో మారుతుంటే గాని సంపూర్ణమైనది కాదన్నా, కాలం నాలుగో కొలపరిమాణమన్నా నమ్మ శక్యం కాని విషయలవుతాయి.

మన ఋషులు చైతన్యం గురించి వివరించిన విషయాలను శాస్త్ర జ్ఞులు సంపూర్ణంగా ఒప్పుకోవటంలేదు. కాని ఈ చైతన్యం కేవలం పదార్థం నుంచి పుట్టింది కాదని నమ్మటం జరుగుతోంది. దీని స్వేచ్ఛా యుతమైన ఉనికిని గ్రహించారు. కాని దీని లోతుల్ని తరచి చూట్టం

మాత్రం భౌతిక శాస్త్ర పరిధిలో లేదు. మానసిక శాస్త్రంలోని ఒక భాగం మాత్రం E. S. P. గురించి అంటే ఇంద్రియాల అనుభూతికి అతీతమైన జ్ఞానం ఒకటుందని ఒప్పుకుంది. దీన్ని గురించి పరీక్షలు జరుగుతున్నాయి. (ఆరవ ఇంద్రియానుభూతి **Sixth sense**). అతీంద్రియ జ్ఞానం అన్న మాట ప్రస్తుతం అందరికీ తెలుస్తోంది. మార్క్సిజానికి పునాదులైన సిద్ధాంతాలు. ఊహలు పేలిపోతున్నాయి.

# 18. ఇస్లాం, కమ్యూనిజం రెండు భిన్న ధ్రువాలు

కేరళకు చెందిన ముస్లింలీగ్ పార్లమెంటు మెంబర్ పార్లమెంటులో ఘంటాపథంగా అన్నాడు:

"ప్రపంచం రెండు విరోధి వర్గాలుగా చీలటం తథ్యం. కాని అది వున్నవాళ్లు, లేనివాళ్లు అనికాదు. అది కమ్యూనిస్టుల కల. జరగబొయ్యేది నమ్మేవాళ్లు, నమ్మనివాళ్ళు అన్న రెండు వర్గాల చీలిక".

ఇంకా సాగదీస్తూ "ఆఖరుకు అన్ని మతాలు అనుసరించే వాళ్ళూ ఈ మౌలిక సత్యాన్ని గ్రహించాల్సివుంటుంది" అనికూడా తేల్చేశాడు.

కేరళలో ఆ మధ్య రాజకీయ పార్టీలవాళ్ళు తమ మధ్య కుదుర్చుకున్న వప్పందాల దృష్ట్యా ఈయన ధీమాను తీవ్రంగానే తీసుకోవాలి.

ఇస్లాం, కమ్యూనిజాల మధ్య దాంపత్యపు తీరేమిటి? ఏదో అప్పు డప్పుడూ రాజకీయాల్లో జరిగే పడగ్గది సమ్బంధాలు వదిలేస్తే అసలు కమ్యూనిజం, ఇస్లాం కలిసేదెక్కడ?

## రాష్ట్రం - ఇస్లాం

ఇస్లాం సిద్ధాంతం ప్రకారం రాజ్యాధిపత్యం అల్లాదే! ఆ అత్యున్నత స్థాయిని మానవ మాత్రుడెవ్వడూ ఆశించలేడు.

"అల్లా తప్ప మరో ఆరాధనా యోగ్య వస్తువు లేదు". "స్వర్గంలో, భూమి మీద సర్వ సామ్రాజ్యాధికారాలూ అల్లాకే. ఈ రెండిటిలోవున్న సర్వస్వానికీ ఆయనే అధిపతి" (ఖురాన్: V-120)

"ఓ అల్లా! సర్వాధికారీ! నీవు ఎవరికైనా అధికారం ఇవ్వ సమర్థుడవు. ఎవరినుంచైనా అధికారాల్ని తీసేసుకోవటానికి, ఎవరినైనా పద భ్రష్టుల్ని చేయటానికి కూడా సమర్థుడవు!" (III-26).

ఈ సంపూర్ణ సత్తాధిపత్యాన్ని చేజిక్కించుకున్న కమ్యూనిస్టు దేశాలు దైవ సామ్రాజ్యాధిపత్యాధికారాన్ని ధిక్కరించి పొగరుబోతున్నవి. రాష్ట్ర సమాధికారాన్ని ఓ నియంత ఇలా వర్ణించాడు.

"సర్వం రాష్ట్రానికే. ఏదీ రాష్ట్ర వ్యతిరేకం కాదు. ఏదీ రాష్ట్ర పరిధిలోంచి బయట వుండదు."

ఈ ఆలోచన దైవాధికారాల మీదికి నియంతలు చేసే దండయాత్రను స్పష్టం చేస్తున్నది.

ఈ కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వం అల్లాను పదవీభ్రష్టుణ్ని చేస్తున్నది. ఏ వ్యక్తితోగాని, సంస్థతోగాని, ఆఖరుకు కమ్యూనిస్టు పార్టీ

సెక్రటరీ జనరల్‌గాని తన ఆధిపత్యంలో భాగస్వామ్యాన్ని సహించని అల్లా అత్యున్నత స్థితిని పెక్కింస్తున్నారు వీళ్ళు. కమ్యూనిస్టు దేశాల్లో పొలిట్ బ్యూరో సభ్యులు 'ఇలాలు', రాబ్‌లు. మానవుడిమీద మనిషి ఆధిపత్యం, అధికారం (రబూబియ్యత్, ఇలాహియ్యత్) కమ్యూనిస్టు నియంతృత్వంలో ప్రత్యేకతేగాని ఇది ఇస్లాం మూల సిద్ధాంతానికే అతి వ్యతిరేకం. పవిత్ర కురాన్ ఓపైపు అతి స్పష్టంగా "ఆయనకు భాగస్వాములను మేము సహించం - అల్లా ప్రక్కం మరొకరిని ప్రభువులుగా నిలబెట్టటాన్ని అంగీకరించం" అని చెప్తోంటే, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు రష్యా, చైనాల్లోని ఎర్ర నియంతలకు పట్టంగట్టి రాచరికాన్ని అప్పచెప్పి ఆఖరుకు అల్లాతో భాగస్వామ్యానికూడా ఒప్పుకోవటం లేదే!

వ్యక్తిగత, సామాజిక జీవనాలనన్నింటినీ తనలో ఇముడ్చుకున్న ఇస్లాం సర్వసంపూర్ణం. ఆ సంపూర్ణ ఆధిపత్యానికి మూలం విశ్వవ్యాప్తం అన్న దైవ చట్టాలే. రాష్ట్రం విషయంలోనూ ఇది తప్పనిసరి. యావత్ మానవాళిమీద రాష్ట్ర ఆధిపత్యం ఇలా సర్వవ్యాప్తంగా వుండవీల్లేదు. మానవులు "మాకూ ఏమైనా అధికారాలున్నాయా?" అంటారు. "సర్వాధికారాలూ అల్లావే! (III.)

పాశ్చాత్య ప్రజాస్వామ్యం కూడా ఇస్లాం సూత్రాలకు అనుగుణంగా లేదు. ఇస్లాం ప్రకారం పాశ్చాత్య ప్రజాస్వామ్యాల్లో అదుపాజ్ఞలు లేని కోరికల విలయ తాండవంతో నైతిక పతనం తప్పదు. దైవంయొక్క కోరికల స్థాయికి జ్ఞానంతో, దూరదృష్టితో, సమభావంతో ఎదగని వ్యక్తుల చేతికి అధికారాన్ని కట్టబెట్టటం ప్రమాదకరం. అందువల్లే అందరు ముస్లింలు కట్టకట్టుకు ఏదైనా చట్టాన్ని ప్రవేశపెట్టినా అది పవిత్ర కురాన్ ఛాయల్లో లేకుంటే ఇస్లాం దృష్టిలో ఆమోదం పొందదు.

ఈ దృష్టితోచూస్తే ఇస్లాం రాజ్యాలు దైవదత్తాలు. ఆ వరకే అల్లాది కాని, ప్రవక్తదికాని నిర్ణయాలు లేని విషయంలో ముస్లిం ఏకగ్రీవ అంగీకారం అమలులోకి రావచ్చునేమోగాని ఖురాన్, హదీస్, షరియత్‌లకు వ్యతిరేకంగా మాత్రం ఒక్కపొల్లూ సహించవు ఇస్లాం రాష్ట్రాలు. షరియత్ ఆదేశాలకు వ్యతిరేకమైతే దేశ పార్లమెంటు యొక్క ఏకగ్రీవ నిర్ణయాలను కూడా చెత్త బుట్టలో పారెయ్యాల్సిందే! దైవ సామ్రాజ్యాధికారంలో ముస్లింల అధికారాలు అతిస్వల్పం.

పాలనాధికారం మొత్తం ముస్లింవర్గంకే కట్టబెట్టటం జరిగింది గాని ఏ ఒక్క వ్యక్తికో, సంస్థకోకాదు. ఇస్లాం సమాజంలో పార్టీ పద్ధతికి స్థానంలేదు. నమ్మేవాళ్ళంతా కలీఫా రాజ ప్రతినిధి క్రింద పాలితులు. "మీలో ప్రతి వారూ పాలకులే. పాలితులపట్ల బాధ్యత వుంది. ఒక కలీఫా మరొకరికి తీసిపోడు." దైవచట్టాల పరిధిలో ప్రతివ్యక్తి అభివృద్ధి చెందటానికి అవకాశంవుంది. వ్యక్తి తన స్వభావాన్ననుసరించి ఏ రంగంలో నైనా వికాసం పొందవచ్చు. సకల స్వేచ్ఛా 'అదైవచట్టాల పరిధి'లో వుంది.

సర్వాధికార యోజనకోసం వ్యక్తికిగల ఈ స్వేచ్ఛను పరిపాలనా యంత్రాంగం కూడా అరికట్టలేదు. సైనికపటాలాలపాలనకు అనుమతిలేదు. ప్రతివారూ కలీఫాలుకాబట్టి నియంతృత్వానికి అవకాశంలేదు. పాలనా సౌలభ్యం కోసం అందరు కలీఫాలు అధికారాల్ని ఒకకలీఫా చేతిలో పెట్టారు. ఆ కలీఫా భగవంతుడికి, మిగతా కలీఫాలకు జవాబుదారీ అవుతాడు. ఇలాంటి జనసమ్మతమైన రాజ ప్రాతినిధ్యంలో నియంతృత్వం అనేది అసందర్భం. అమీరు చేతుల్లో ఇస్లాం నియంతృత్వ అధికారాల్ని వుంచదు. పొలిట్ బ్యూరోలో సభ్యత్వంగాని, పాలనా యంత్రాంగంలో ముఖ్యపదవి

గాని లోటుబాటుమీద గుత్తాధిపత్యాన్ని కట్టిపెట్టదు. "సమ్మకం, పవిత్రత విషయాల్లో తప్పు ఒకరు మరొకరికంటే గొప్పకాదు."

పార్టీ నియంతృత్వం ముస్లింల కలీఫాపద్ధతికి సమూలంగా మంగళం పాడేస్తుంది. ఇస్లాం దృష్టిలోని జనసామాన్య రాజ ప్రాతినిధ్యానికి విహాదం లాటిది. ప్రవక్త మనిషి మీద మనిషి అధిపత్యాన్ని అంతం చెయ్యాలని చూచాడు. ఇస్లాం రాష్ట్రానికి ఆధారమైన అల్లా సూత్రాల్ని అమలుపరచినన్నాళ్ళే పాలకులకు విధేయులై వుండాలి. పవిత్ర కురాన్‌లో అల్లా చెప్పినట్లుగా, ప్రవక్త అనుసరించిన రీతిలో (సున్నా) ప్రగాఢ విశ్వాసంతో మాత్రమే పాలన సవ్యంగా వుంటుంది. కాఫిర్లకు, అంటే నమ్మనివాళ్లకు పాలనలోగాని, రాజకీయాల్లోగాని వంతులేదు.

కమ్యూనిస్టు పార్టీలో, పాలనలో నిరంతర అంతర్యుద్ధాల విషయం మనకు తెలిసిందే, రాక్షసత్వంతో రక్తపు మడుగుల్లోంచి అడుగులేస్తూ పదవీలాలసులు కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యాన్ని చేజిక్కించుకోవటం చరిత్రలో కనిపించే స్పష్టమైన దృశ్యాలు.

"మీలో గౌరవనీయుడే పవిత్రుడు" అని అమీరు ఎన్నికకు దారి చూపింది ఇస్లాం. కమ్యూనిజంలో పవిత్రతల ప్రశ్నేలేదు. పద్ధతి ఏదైనా అంతిమ విజయం దృష్ట్యా సమంజసమే. ఇస్లాంలో మరో మెలిక వుంది. పదవీ కాంక్షతో అల్లాడేవాడిని నాయకుడిగా ఎన్నుకోరాదు అని, "తనుగా కోరిన పదవిని ఎవరికీ ఇవ్వొద్దు" అని ప్రవక్తే స్వయంగా చెప్పాడు. ప్రపంచ కమ్యూనిస్టు నాయకుల్లో ఎంతమందికి అధికారంమీద కోరికలు వుండవు?

కమ్యూనిస్టు పాలనలో న్యాయాధికారులు రాష్ట్రపాలనకు విధేయులు. ఇస్లాంలో ఇది స్వతంత్రంగా వుంటుంది. న్యాయాధిపత్యం రాష్ట్రపాలనకు చిహ్నం కాదు, అల్లాకు.

## సమాజ వ్యవస్థ

కమ్యూనిజం కుటుంబ వ్యవస్థను నిర్మూలించి దాని స్థానంలో కమ్యూన్లను సమాజంలో తొలి వ్యవస్థగా స్థాపించాలని ధ్యేయంగా పెట్టుకుంది. కాని ప్రవక్త కుటుంబ వ్యవస్థకు ప్రాతినిధ్యం ఇచ్చి దాన్ని గట్టిపరచాలని ప్రయత్నించాడు. దీనికోసం ఆయన స్త్రీలరక్షణ పురుషులకు అప్పజెప్పాడు. భర్త, భార్య, పిల్లల బాధ్యతల్ని, హక్కుల్ని స్పష్టంగా నిర్వచించాడు. విడాకుల చట్టాల్ని, విడిపోయే పద్ధతిని, బహుభార్యాత్వానికి నియమావళిని తయారు చేశాడు. వ్యభిచారానికి, జారత్వానికి, నిందారోపణలకు శిక్షలను నియమించాడు.

ముస్లింలలో వర్గాల్ని ఇస్లాం అంగీకరించదు. విశ్వభ్రాతృత్వం నియమించటం జరిగింది. ముస్లిమేతరుల నుంచి విడిగా ఓ స్పష్టమైన వర్గంగా వున్నా ముస్లింలలోనే వర్గాలు గాని, వర్గపోరాటాలు గాని వుండవీల్లేదని ప్రవక్త నిబంధన.

## ఇస్లాం - ఆర్థిక సూత్రాలు

విడివిడిగా ఆలోచించటాన్ని ఇస్లాం ప్రకారం ఆర్థిక సమస్యలు మానవాళికున్న పెద్ద సమస్యల్లో ఓ భాగం. దాన్ని విడదీసి అదేదో ప్రత్యేకమైందనే దృష్టితో చూడరాదు. జీవితాల్లో ఆర్థిక సమస్యల్ని విడిగా ప్రస్తావించటం పొరపాటు. జీవితాల సంపూర్ణత్వంనుంచి డబ్బు సమస్యల్ని వివిధ ఆర్థిక ప్రయోజనాల్ని తొలగించి ప్రస్తావించటం తప్పు. మనిషి నైతిక, ఆధ్యాత్మిక చింతనలేని ఆర్థికపరమైన పశువు కాదు.

దైవ ప్రేరిత నిబంధనలు సూత్రాలు, నియమాలు ఆర్థిక సూత్రాల విషయంలో కూడా అన్వయించాలి. ఇస్లాంలో వ్యక్తి ఆస్తి వుండొచ్చు. కాని దైవ నిబంధనల పరిధిలో వుండొచ్చు. రాష్ట్రానికి. పాలనకు ఏం సంబంధం లేదు. ప్రతి వ్యక్తి తన శక్తికొద్దీ, తన స్వభావ సదుపాయాల ననుసరించి సంపాయించుకునే హక్కుంది.

వ్యక్తుల సామర్థ్యాన్నిబట్టి సంపాదనలో కూడా హెచ్చు తగ్గులుండ వచ్చు. దీన్ని ఆర్థిక అసామనత అని, అవేదో అస్వభావిం అని అనుకో రాదు. కొన్ని పరిధుల్లో దీన్ని అంగీకరించవచ్చు. కాని ఎవ్వరయా సమాజానికి నష్టం చేకూరుస్తూ గాని, వ్యక్తిగతంగా నైతిక పతనంతో గాని ఐశ్వర్యాన్ని సమకూర్చుకోరాదు. అందుకనే ఆస్తి సంపాదనలో న్యాయ (హలాల్), అన్యాయ (హరాం) అని రెండు రకాలు గుర్తించట జరిగింది. హరాం నిషిద్ధం.

అలానే సమాజానికి హాని కలిగించేటటువంటివి నైతిక పతనం కలిగించేవి అయిన ఖర్చుల్ని కూడా నిషేధించటం జరిగింది. డబ్బు దాచటం గాని, వడ్డీకి అప్పు లివ్వటం గాని తప్పు. వ్యాపారం చెయ్యటం, పెట్టుబడి పెట్టటం, భాగస్వామ్యంతో చేసే లాభనష్టాల వ్యాపారాలు ఇలాటివి న్యాయ సమ్మతమే.

ఇస్లాంలో వున్న మరికొన్ని సూత్రాలు, ఎగుమతి దిగుమతి పన్నులు తీసెయ్యటం; పన్నులు, సుంకాలు, వర్తకపు పన్ను లాంటివి తొలగించటం; పాలనా యంత్రాంగం మీద, సైన్యం మీద కర్చును పరిమితం చెయ్యటం; స్టాంపు డ్యూటీని, కోర్టుల్ని పూర్తిగా తొలగించటం; అన్ని తగాదాల్ని ఇస్లాం పరిధిలో పరిష్కరించుకోవటం కొన్ని ముఖ్యంగా చెప్పుకోదగ్గవి

వారసత్వ హక్కుల్ని నిర్ణయించటం, ఆస్తి పంపకాలు చెప్పుకోతగ్గది. జకాత్‌తో జబ్బుపడ్డవారికి, అసహాయులకు, వృద్ధాప్యంలో, బీదరికానికి, నిరుద్యోగులకు ఓ మార్గం చూపే వ్యవస్థను ఏర్పరచటం గమనించతగ్గ ఆర్థిక వ్యవస్థ.

దైవ చట్టాల నిబంధనల పరిధిలో ఇస్లాం ఆర్థిక వ్యవస్థ కొన్ని ఇబ్బందులకు గురవుతుంది. రాష్ట్ర పాలనా వ్యవస్థ తన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోలేకపోయింది. సమాజంలో ఆర్థికపరమైన లావాదేవీలు వ్యక్తుల మనస్సుల మీద, ప్రవర్తన మీద ఆధారపడివున్నాయే గాని, పాలనా యంత్రాంగం ఏ మాత్రం కల్పించుకోలేకపోయింది. 'వాక్ఫ్' గాని, చట్టపరమైన 'జకాత్' గాని, స్వేచ్ఛగా ఇవ్వాల్సిన 'సదాకత్' గాని వ్యక్తి అనుశాసనం మీద ఆధారపడే వుంటిగాని పాలన యంత్రంగా బలపంతం ఏమీలేదు.

ప్రవక్త తన అనుయాయుల్ని రెంటికి దూరంగా వుండమన్నాడు. ఒకటి పిసినారితనం, మరోటి పెద్ద ఖర్చులు. "పక్కవాడు పస్తులుంటే పొట్ట నింపుకునేవాడు మోమిన్ కానేకాడు" అన్నాడు ప్రవక్త. మరోసారి "బీద విధవలకు, బీదవారికి సహాయపడేవాడు. వారి పురోభివృద్ధికి కృషి చేసేవాడు దైవం కోసం పాటు పడే వాడే. దినమంతా ఉపవాసం వుండి, రాత్రంతా దైవ ప్రార్థనతో నిలిచి వుండేవాడిలాంటి వాడే!" అన్నాడు.

"అనాథను చేరదీసి ఇంత అన్నం పెట్టేవాడికి దేవుడు స్వర్గంలో తప్పక స్థానం ఇస్తాడు".

"అనాథను కసిసంగా చూచేవాడ్ని, బీదవాళ్ళకింత పెట్టాలనే తపన లేనివాడ్ని ఇస్లాంలో నమ్మకంవున్నవాడిలా భావిస్తున్నారా ?"

ఆర్థిక విషయాల్లో ప్రసక్త హృదయాలకు, మనస్సులకు విన్నపాలు చేసుకున్నాడు. ఖలిపంతం మీద అతనికి నమ్మకం వున్నట్లనిపించదు. అతని కాలంలో అరేబియాలోవున్న పరిస్థితుల్లో ఉద్యోగి, యజమానుల మధ్య వుండవలసిన బాంధవ్యాల్ని గురించి ఆలోచించే అవకాశంలేదు. కాని నౌకర్ల విషయంతో కొన్ని సూచనలిచ్చాడు.

"మీ నౌకర్లు మీ భ్రాతృ సమానులు. మీ ఇంటి పనులు నిర్వహించే వారు. దేముడు వాళ్ళను మీ పోషణతో వదిలాడు. ఇలాటి అన్నదమ్ముల్ని ఇంట్లో కలిగినవాళ్లు వాళ్ళకు మీతోబాటే మీరు తినేదాన్నే పెట్టండి. మీరు ధరించేలాటి బట్టలే వారికి ఇవ్వండి. వాళ్ళకు శక్తిని మించిన పనివ్వకండి. అలాటి కఠినమైన పనివుంటే మీరు కూడా స్వయంగా వాళ్ళకు సహాయం చెయ్యండి. మీకు భోజనం వడ్డించటానికి వచ్చినప్పుడు మీతో సమంగా కూర్చోబెట్టుకోకున్నా అతనిక కడుపు నిండా తినటానికి విడిగా పెట్టండి. పాపం అతనా వంటకాలు తయారు చెయ్యటంలో ఎంతో శ్రమపడతాడు. వేడిలో మ్రగ్గుతాడు".

ఏదేమైనా ఆర్థిక వ్యవహారాలపట్ల ఇస్లాం ధోరణి కమ్యూనిజం ధోరణికి పూర్తిగా భిన్నం. ఈ భేదం, సమస్యల పరిష్కారాల పద్ధతి ఏదో అలవోకగావున్నవిగాదు. ప్రగాఢంగావున్న మౌలికభేదాలవల్లనే కమ్యూనిజం ఇస్లాం పద్ధతుల్లో ఎంతో తేడావుంది.

## దృక్పథాలు వేరు, ఆశయాలు వేరు

కమ్యూనిజం పూర్తిగా భౌతికవాదమని అందరికీ తెలిసిందే. ఇస్లాం దేవుణ్ని నమ్మటమేగాదు, అతనికి సర్వసార్వభౌమత్వాన్ని కట్టబెట్టింది. దేముడు విశ్వం సృష్టికర్తేకాదు, పోషకుడు, చట్టాల్ని ఏర్పరచేవాడు,

భరించేవాడు, మార్గదర్శకుడు, ఈ సృష్టిని అంతం చేసేవాడు కూడా. "ఆతను ఆది, అంతం అంతర్గతం, బాహిరం" (LVII-3).

కమ్యూనిజం ఈ పరమాత్మడి సింహాసనాన్ని ఆక్రమిస్తుంది.

ఓ అరేబియన్ కవి వ్రాసినట్లు "అల్లా, ప్రవక్తకు ఈ పృథ్వి ఐశ్వర్యపు తాళాలిచ్చాడు. కాని ఆయన నిరాకరించాడు". అంటే నమ్మకంగా చెప్పొచ్చేదేమంటే ప్రవక్త భౌతికవాదికాదు.

కమ్యూనిస్టుల వాదం ప్రకారం మానవుల అంతిమ ఆశాయం భౌతిక, ఆర్థిక పురోభివృద్ధి, ఇస్లాం ప్రకారం దైవపాలన.

ఇప్పుడు మనం అనుకున్న వన్నీ ఉదాహరణకే! నిజం ఏమిటంటే అన్ని మతాల్లాగానే ఇస్లాం కూడా కమ్యూనిజానికి శుద్ధ వ్యతిరేకి. ఈ రెంటికీ అసలు పొసగదు. ఈ నమ్మేవాళ్లు నమ్మనివాళ్ల (మోమిన్లు-కాఫిర్లు) అనే రెండు వర్గాల మధ్య జగడం భౌగోళికంగా చాలా రోజుల్నుంచి సాగి పోతూనేవుంది. నమ్మనివాళ్లు కొంతవరకు చక్కగా సంఘటితంగావున్నారు.

# 19. భారతీయ దృష్టిలో ఆర్థిక సూత్రాలు.

కొందరు నమ్మించేలా నాగరికత అనేది అస్పష్టంగా గాని, సందేహాస్పదంగాగాని లేదు. మానవ జీవితంలోని సర్వస్వాన్ని అది తెలియజేస్తుంది. నాగరికత అనే పదం ఒక సమాజం మనస్సులో వున్న అభిప్రాయాలను స్పష్టంచేస్తుంది. దానికే ప్రత్యేకమైనవి, పరిమితమైనవి; కోరికల, ఆవేశాల, ఆలోచనల, మాటల, చేతల జీవన విధానాలను ప్రతి

బింబించే వాటి సమగ్రభావం నాగరికత. మన నాగరికత ప్రత్యేకత ప్రపంచ నాగరికతతో గుర్తింపు. అందే భారతీయులు చెప్తూవున్న, ఆచరించి చూపిస్తున్న నాగరికత ప్రపంచ నాగరికత తప్ప మరోటికాదు.

మానవళి పురోగమనానికి నాగరికతకు ప్రాధాన్యతవుంది. ఓ స్పష్టమైన మార్గమూవుంది. చాలాసార్లు ప్రపంచంలో మనం చూస్తే నాగరికతకు వ్యతిరేకంగా, భిన్నమార్గంలో నడుస్తూ సామాజిక పురోగతికి ఆటంకం కలిగిస్తూ మానవాళి మనుగడకే ప్రమాదాన్ని కలిగించే కొన్ని శక్తులు మనకు కనిపిస్తాయి. మానవాళి సుఖశాంతులతో వుండాలన్నా, పురోగమించాలన్నా ఈ అసురసంపత్తిని నాశనం చెయ్యకతప్పదు. అనంతకాలం నుంచి ఈ అసుర సంపత్తిని ఎదుర్కొని నిరంతరంగా పోరాడుతుండే వ్యక్తులు, సంస్థలు భిన్నకాలాల్లో మనకు కనిపిస్తాయి.

పారిశ్రామిక విప్లవం ఐరోపాలో దోపిడీ వర్గాన్ని ప్రవేశపెట్టింది. చేతిపనులు తెరవెనక్కి జారుకున్నాయి. యంత్రాలు ఉత్పత్తికి కేంద్రాలై వాటి యజమానుల చేతుల్లో విస్తృత ఆర్థిక శక్తిని కేంద్రీకృతం చేశాయి. తత్ఫలితంగా యజమానులు పాలనా వర్గాలమీద ఆధిపత్యం సంపాదించారు. వాళ్లు పరిపాలనా యంత్రాంగాన్ని యజమానుల ఆన్ని ఆటలకూ వత్తాసు పలకటానికి వినియోగించటం మొదలెట్టారు. న్యాయం, అన్యాయం, నీతి, అవినీతి అన్నీ అడుక్కుపోయి లాభార్జనే ధ్యేయంగా మిగిలింది. పెట్టుబడిదారీ వ్యవస్థ చేతిలో రాష్ట్రం కీలుబొమ్మైంది!

పారిశ్రామిక జగత్తులో మానవుల ఆనందాలకంటే లాభార్జనే ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. అదే సర్వస్వం అయింది. యంత్రాల మీద పనిచేసే మనుష్యుల స్థితి ఆ యంత్రాల చక్రాలకంటే ఏమాత్రం భిన్నంగా లేదు. యాజమాన్యం చేతిలో నలిగిపోయే కార్మికవర్గం రాష్ట్రి

సహాయంలేక; పీడించబడటం ఎక్కువయ్యేసరికి విసిగి, వేసారి, నిస్పృహా యులై ఉడికే అగ్నిపర్వతాల్లా వున్నారు. ఈ పరిస్థితిలో తనచుట్టూ వున్న నిస్పృష్ట పరిస్థితుల ప్రభావంతో ఒ వేదాంతి మేధలో ప్రతీకార వాంఛతో పుట్టింది ఓ వాదం! ఆనాటి పరిస్థితుల్లో సరియైన పంథాయే అని అనిపించిన ఉగ్రవాదం!

పాశ్చాత్య భౌతిక వాదిగా మార్క్స్ ఆర్థిక సూత్రాలు పునాది అని సమాజంలో మిగతావయిన న్యాయ, రాజకీయ, సాంఘిక వ్యవస్థలు పై కట్టడాలుగా మాత్రమే వుంటాయని నమ్మాడు. "ఏ సాంఘిక వ్యవస్థ కైనా ఆర్థిక సూత్రాలే మూలం" అంటారు మార్క్సిస్టులు. వాళ్ళ సిద్ధాంతం ప్రకారం "సమాజంలో మార్పులు, రాజకీయ విప్లవాలు ఇవన్నీ మనుషుల మెదళ్ళల్లో పుట్టవు. శాశ్వత సత్యాలమీద, న్యాయం మీద మానవుడి సత్య దృక్పథం వల్లా కాదు. కేవలం ఉత్పత్తి పంపిణీల్లోని తేడాలు, మార్పులవల్లే ఇవన్నీ ఉద్భవిస్తాయి, ప్రతి కాలంలో వున్న ప్రత్యేక ఆర్థిక పరిణామాల ద్వారానేగాని మరే జీవన విధానాలవల్లా నిష్కృతం లభించదు."

వాళ్ళ సిద్ధాంతం ప్రకారం సమాజాల్లో మార్పు అంటే ఆర్థిక వ్యవస్థలో మార్పు మాత్రమే!

సామాజిక మార్పు కేవలం ఆర్థిక సూత్రాలవల్ల వీలవుతుందా, అదేనా అంతిమ కారణం అని ప్రశ్నిస్తుంది నాగరికత. రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ కూడా కారణాలు కావచ్చుగానీ మౌలిక మార్పు మరెన్నో కారణాలవల్ల మాత్రమే సాధ్యం. ఆర్థిక వాదం సమాజంలో మార్పు సాధించలేదు' అంటుంది నాగరికత,

## భౌతిక విప్లవం-మానసిక విప్లవం

మానసిక మార్పుల తర్వాతే రాజకీయ, ఆర్థిక మార్పులు సాధ్యం కాగలవని చరిత్ర చెబుతోంది. అంతర్గతంగా మానసిక విప్లవం ముందు సమగ్రంగా సాధించబడ్డాక భౌతిక వాతావరణంలో బాహ్య విప్లవం సాధించటం తేలిక, అంటే మనస్తత్వం వల్ల నిర్ణయాలు ఆర్థిక సూత్రాల వల్ల కావు. ఏ సమాజంలోనైనా సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ లన్నీ ఆ సమాజంలోని ఆత్మ విచార వ్యవహార సరళి ఆధారంతోనే రూపొందుతాయి.

మానసిక చైతన్యం జీవమైతే ఆర్థిక చైతన్యం ఒకరూపం. రూపంలో మార్పు జీవ చైతన్యంలో మార్పు తర్వాతనే సాధ్యం. సహజ పద్ధతిలో మానసిక మార్పు ఆధారంగా కాక ఓ కొత్త సాంఘిక వ్యవస్థ బలవంతంగా ఏ సమాజం మీదనైనా రుద్దితే అది దండ ప్రయోగ భయం వల్ల కొనసాగాల్సిందే గాని మామూలు పరిస్థితుల్లో ఎక్కువ రోజులు కొనసాగదు. దౌర్జన్యం ద్వారా ఎక్కడైనా సామాజిక మార్పులు తీసుక వస్తే దాన్ని అసాధారణ భయోత్పాతాలవల్ల అణగద్రొక్కే నియంతృత్వాల వల్ల మాత్రమే నిలుపుకోగలమని చరిత్ర చెబుతోంది. అలా కాక సామాజిక మనస్తత్వంలో మార్పు సాధించి ఆ మార్పు సాంఘిక ఆచారాన్ని ఆమోదించేటంతగా శక్తివంతం చెయ్యగలిగితే ఎటువంటి కష్టాలనైనా స్వయంగా ఆ సమాజమే ఎదుర్కొని మార్పును నిలబెట్టు కుంటుంది. బలవంత మాఘస్నానాలవల్ల విప్లవం - వ్యతిరేక విప్లవం ఈ గొలుసుకట్టు సాగిపోతుంటుంది. వ్యవస్థలో మార్పువల్ల మనస్సులు మారిపోతాయనేది కేవలం వితండ వాదమే. ఈ పరిస్థితే రష్యాలో నియంతృత్వానికి సరియైన వివరణ నిస్తుంది, నియంతృత్వం సడలిస్తే ఏమవుతుందో !

## మనస్సు విస్మరించాడు మార్క్సు

చుట్టూ వున్న పరిస్థితుల ప్రభావం మనస్సు మీద వుంటుందన్న విషయం కొంతవరకూ నిజమే. కాని మానవ మనస్సు కారణం, పదార్థ భరిత వాతావరణం ప్రతి ఫలం. మనస్సు యొక్క ప్రభావం వాతావరణం మీద, వాతావరణ ప్రభావం మనస్సు మీద పని చేస్తూ వున్నా మనస్సనేది నిస్సందేహంగా మౌలికమైంది.

రాణా ప్రతాప్, మాన్ సింగ్‌లు ఇద్దరూ ఒకే పరిసరాల ప్రభావంలో వున్నారు. కాని వారి ప్రతిక్రియలు విభిన్నం. ఖండోబల్లాల్, గానోజీ షర్కేలు ఇద్దరూ ఒకే పరిస్థితుల్లో నిలబడాల్సి వచ్చింది. కాని ఒకే పరిస్థితుల్లో భిన్న దృక్పథాలతో ఎందుకు సాగిపోయ్యారు? వందలాది సంవత్సరాల బహిష్కారాలు, నేర విచారణలు, కష్టాలు, దుఃఖాలు యూదులు తమ మాతృ భూమి కోసం పడ్డ తపనను తగ్గించలేకపోయ్యాయి. మరెవరైనా అయితే ఆశలు వదలుకొని ఇదే మనకు తప్పనిసరి భవిష్యత్తు అని పరిస్థితులతో రాజీ పడే వారేనేమో! ఒక జాతి యొక్క ఈ పట్టుదలకు, తీవ్ర వాంఛకు, అన్ని విపత్కర పరిస్థితులకు ఎదురు నిల్చి పోరాడటానికి కారణమేటి?

మానవ మేధ ఫలమే పరిసరాలు. ఆర్థిక వ్యవస్థను మాత్రం సమాజానికి మూలంగా అంగీకరించిన మార్క్సిజం ఫలాన్ని కారణంగా పొరబడ్డది. ఈనాటి శాస్త్ర పరిజ్ఞానం మార్క్సిజం సమ్మకాలను వమ్ము చేసింది. విశ్వంలో ప్రతిదాన్నీ పదార్థంతో వివరించవచ్చని, పదార్థం మనస్సును శాసిస్తుందని, అదే మనస్సుసు పని చేయించ గలదని, మానవుల ఆలోచనలు, వ్యవస్థలు, సంస్థలు అన్నీ పదార్థ బాహిర స్వరూపాలనీ అన్న పిడి వాదానికి శాస్త్ర జ్ఞానం హారతి పట్టేసింది. ఈనాడు భధా

ర్థాన్ని మౌలిక సంపూర్ణ తత్వంగా అంగీకరించటం లేదు. "చూచేవాడి మానసిక స్థితి ఆకారమే పదార్థం" అంటున్నారు. "పదార్థం శక్తి భావ ప్రకటనే" అంటున్నారు. నాగరికత అనేది మొదట మానవ మనస్సుల్లో నిండి వాటి ద్వారా సామాజిక వ్యవస్థను చేరుతుంది. ఈ మూల విషయ మైన మనస్సును మర్చిపోయింది మార్క్సిజం.

రష్యాలో కమ్యూనిస్టు పాలన మొదలై 5 దశాబ్దాలు దాటి పోయ్యాయి. కానీ ఈనాటికీ కమ్యూనిజం చెప్పిన "పాలించే వారులేని రాష్ట్రం, ప్రభుత్వ భావనా నిర్మూలనం కనుచూపు మేరలో కూడా కనిపించటం లేదు. నియంతృత్వాన్ని విదేశీ దండయాత్రలను ఎదుర్కోవ టానికి కాదు అంతర్గత విప్లవాల్ని విరుద్ధ విప్లవాన్ని అణచటానికి కొన సాగిస్తున్నారు. రష్యాలో విప్లవం తర్వాత ఇంకా ట్రాట్స్కీలు, బెరియాలు కాన్సన్‌ట్రేషన్ క్యాంపులకు వెళ్తున్నారంటే స్టాలిన్లు, కృశ్చేవులు బ్రెజ్నే వులు; విపరీతమైన స్వార్థపరులైనా వుండాలి బెరియాలాంటివారు ద్రోహు లైనా అయి వుండాలి. ఏది నిజమైనా కార్మిక నియంతృత్వానికి ఇది గర్వకారణం మాత్రం కాదు. ఈ విపరీత వేధింపు చర్యలు, హింసలు సాంఘిక వ్యవస్థ సామాజిక మనస్సును మార్చటంలో ఎంత ప్రయోజన కారిగా వుండగలదో తేటతెల్లం చేస్తున్నాయి.

పోనీ ప్రజాసమూహాల మానసిక స్థితిని అలా వదిలేద్దాం. మరి మార్క్సిజంలోని ఏ సిద్ధాంతాలవల్ల, ఏ ఆచరణలవల్ల పాలకులు నియంత లుగా దిగజారిపోతున్నారు? రాజ్యవ్యవస్థ ఏనాటికైనా క్షీణించి మార్క్సిజం సూత్రాన్ని రష్యా నిలబెట్టి నిరూపిస్తుందని ఊహించటానికి ఏ ఆధారాలూ లేవు.

## నిజమైన రాజ్య విహీన స్థితి వున్నది పురాతన భారత్‌లో మాత్రమే!

సనాతన భారతదేశం రాష్ట్ర విహీన సమాజం.
నరాజ్యం నైవ రాజాసీత్ - రాజు లేడు రాజ్యం లేదు.
నదండ్యో నైవ దాండికః - నేరస్థులులేరు, దండించేవారులేరు.
ధర్మేణైవ ప్రజాఃసర్వా రక్షంతి స్మ పరస్పరం-
ధర్మానుసరణతో ప్రజలు పరస్పరం రక్షించుకునే వారు.
సామాజిక జీవనాన్ని క్రమబద్ధం చెయ్యటానికి నియంతృత్వం

అవసరం లేకపోయింది మనకి! మానవమేధను ధర్మానుసరణ అనే ఉన్నత స్థాయికి తీసుకవెళ్ళినందువల్లనే ఇది సాధ్యమైంది. సమాజం తనను తానే పాలించుకున్నది. అనుశాసనం స్వప్రేరితం. చట్టాలు, రాజ్యాంగాలు లేవు. శిక్షలు లేవు.

'తేషాం నాసీత్ విధాతవ్యం ప్రాయశ్చిత్తం కథంచన' - శారీరకంగా బాధించే శిక్షలుగాని, ఉరిశిక్షలుగాని లేవు.

ప్రాయశ్చిత్తమే శిక్ష. వెలివేయటంతో మరోశిక్ష.
'పురా ధిగ్దండ ఇవాసీద వధాదండోద్య వర్తతే.

అటువంటి చక్కటి స్థాయినుంచి కాలక్రమేణా సమాజం దిగజారిపోయింది. చెడుకే మౌలికమార్పులొచ్చాయి. అదీ, ఈ మార్పు అతి త్వరగా వచ్చిపడ్డది. కారణమేమిటో? మనస్సు అనే అంతర్గత వ్యవస్థలో మార్పు వల్లనే, భీష్ముడి ఆలోచన ప్రకారం సమాజంలోని వ్యక్తులు తదిపైపై చెడుమార్గాన్ని అవలంబించారు. వారి మొదటి మానసిక స్థితి చెదిరిపోయింది. ధర్మసూత్రాల పట్ల తీవ్రత తగ్గి అలక్ష్యం పెరిగింది. అన్నాటి

వరకు స్వపాలన పద్ధతిలో వున్న భారతీయ సమాజానికి అంతర్గత వైపరీత్యాలు చెలరేగాయి. ఆటు తర్వాత, భీష్ముని మాటల ప్రకారం, కొందరు శ్రీమహావిష్ణువు దగ్గరకెళ్ళి ఈ గందరగోళస్థితిని నివేదించు కున్నారు. సామాజిక మనస్సుల అసత్వం వల్లనే సమాజస్థితి దిగజారిం దని విన్నవించుకున్నారు.

"భగవాన్! నరలోకస్తం నష్టం బ్రహ్మసనాతనమ్
లోభమోహాదభిర్ భావైః తన్నో భయ ముపానిషత్"

"ఓ భగవాన్! లోభమోహాది గుణాలు పెరగటం వల్ల ఈ మానవ సమాజం ఛిద్రమైపోతోంది. అందుకేం భయపడుతున్నాము"

శ్రీమహావిష్ణువు వాళ్ళను రాష్ట్రపాలనా విధానాన్ని అవలంభించ మని సలహా ఇచ్చాడు." అన్నాడు భీష్ముడు.

మానవాళి ప్రతినిధుల విశ్లేషణ చరిత్రను భౌతిక వాదంతో అర్థం చేసుకోవటానికి సరిగ్గా వ్యతిరేకంగా వుంది. రాజవిహీన స్థితినుంచి వైపరీత్యాల వల్ల రాష్ట్రపాలన స్థాయికి దిగజారటం మనస్సులస్థాయి దిగజారి మోహ లోభాలకు తల ఒగ్గటం వల్లనే. రాజ్యవిహీనస్థితి సరియైన మానసిక వాతావరణాన్ని నిలపలేక పోయింది. మానసిక విలక్షణాలు ఏ మాత్రం అనుమానంలేకుండా సమాజంలో విపరీతమైన మార్పుల్ని కలుగజేశాయి.

సంక్షిప్తంగా చెప్పాలంటె మానసిక స్థితి అనే పునాది మీదే సాంఘిక, ఆర్థిక, రాజకీయ భవన నిర్మాణం సాధ్యం. చరిత్ర శోధన అంటే నిజంగా ప్రజల మనోభావాల శోధనే. భౌతిక చరిత్ర బాహిర రూప ప్రదర్శనే. గతి తార్కికంలో చెప్పబడే వివాదం కూడా మొదట అంతర్గతంగా ధ్యేయ స్థాయిలో మొదలై బాహిరంగా భౌతిక స్థాయిలో ప్రత్యక్షమవుతుంది.

## వర్గపోరాటం ద్వారా వర్గరాహిత్యం ?

మార్క్సువాదుల "వర్గాల నిర్మూలనకు వర్గపోరాటాన్ని తీవ్రతరం చెయ్యాలి అనే సిద్ధాంతం ఆంగ్లో - సాక్సన్ల 'యుద్ధాన్ని అంతం చెయ్యటానికే యుద్ధం' అన్న నినాదాన్ని జ్ఞప్తికి తెస్తుంది. రెండూ రెండే! హాస్యాస్పదాలు. వర్గపోరాటాన్ని తీవ్రతరం చెయ్యాలంటే ద్వేషాగ్నిని ప్రజ్వరిల్ల చెయ్యాలి. అంటే వర్గరహిత సమాజాన్ని సాధించాలంటే ప్రేమ అనేదాన్ని నిర్మూలించాలి. ఓసారి ప్రస్తుతంవున్న సామాజిక వ్యవస్థను నిర్మూలించటానికి తీవ్రమైన ద్వేషాన్ని ప్రజల మనస్సుల్లో పెంపొందించితే, దాని ద్వారా వర్గశత్రుత్వాన్ని సృష్టించితే తుదకు మిగిలేదేమిటయ్యా అంటే ద్వేషభరిత సమాజం. ప్రస్తుత వ్యవస్థనేకాదు భవిష్యత్తులో వర్గరహిత సమాజాన్ని కాని మరే ఇతర రకమైన సమాజం కాని అన్నింటినీ ఇదే ధోరణిలో నాశనం చేసే ధోరణి సమాజంలో పెరిగిపోతుంది. వర్గ శత్రుత్వానికి ముందు స్వార్థం పెరుగుతుంది. వ్యక్తితనే ప్రాముఖ్యతను సంతరించుకుంటాడు. వర్గరహితసమాజంగానీ, ఆ మాటకొస్తే మరే యితర సమాజంగాని ఆధారపడేదివ్యక్తినిస్వార్థ ప్రకృతి మీద మరి ఈ విద్వేషం, పరమస్వార్థం తర్వాత ప్రేమ, త్యాగ ప్రవృత్తిలోకి ఎలా మారగలవో ఊహించటం కష్టమే.

## నమ్మశక్యం కాని మాటలు

గతితర్క భౌతికవాదంద్వారా అనివార్యమైన వర్గ శత్రుత్వాన్ని తీసుకురావటం మార్క్సు ఆశయం. ఆయన పదసందోహం సర్వేళ్లా వుంటుందే గాని నమ్మదగ్గదిగాలేదు. ఓ సమాజంలో ఒక సాంఘిక వాదం వుంటుంది. దాంట్లోంచి ప్రతివాదం పుట్టుకొస్తుంది, ఈ రెంటి పోరాటంలోంచి సంవాదం ఉద్భవిస్తుంది. మళ్ళీ దీన్లోంచి వాదం అటుతర్వాత ప్రతివాదం,

మళ్ళీ మళ్ళీ కథ సూపరూతే. బాగానే వుంది. ఈ సమాజంలో వివాదం ద్వారా వర్గపోరాటాలు చెలరేగి వర్గరహిత సమాజం అనే సంవాదం పుట్టిందని అనుకుందాం. మరి ఇది వాదం గావాలి, దాన్లోంచి వివాదం పుట్టాలి. ఆ వివాద స్వరూపం ఎలావుండగలదు. అదేదో పుట్టుకొచ్చినా సమాజం అధ్వాన్నం అయి నిసజారిపోవటం తప్ప మరోటుండదు.

పోనీ వర్గరహిత సమాజం ఏర్పడ్డాక మరి వాద, వివాదలుండవని అనుకుందాం. ఈ వివాదం అనేది లేకపోతే మార్క్సువారి వాదంప్రకారం సమాజం పురోగమించటం ఆగిపోయినట్లేనే! సామాజిక గతి తర్క సిద్ధాంతం ఓ సారి వర్గరహిత సమాజం ఏర్పడగానే పనికిరాకుండా పోతుందా! అంటే ఆ సిద్ధాంతమే మౌలికంగా తప్పు అయినట్లేగా.

"మానవాళి చరిత్ర వర్గపోరాటాల చరిత్రే!" అని గదా మార్క్సువారి ఉవాచ. మరి చరిత్ర రథచక్రాలు వర్గపోరాటాల్ని వర్గాల్ని ఆపితే ఆగిపోవాలిగా! అంటే వర్గరహిత సమాజం ఏర్పడ్డాక సృష్టన్నా ఆగిపోవాలి లేకుంటే అసలా సిద్ధాంతమే తప్పు అయినా అయివుండాలి. సృష్టెలానూ ఆగదు!!

నిజానికి వర్గస్పృహవున్న వ్యక్తులతో నిండిన సమాజ వర్గరహిత స్థితిని నిలుపుకోలేదు. ఈ వర్గ విభేదాలను చెలరేపే సమాజంలోంచి ఉద్భవించేది వర్గరహిత రాష్ట్రమే. వర్గ రహిత సమాజం కావాలంటే సమాజంలోని ప్రతివ్యక్తి వర్గసహిత స్థితిని ఆకళించుకోవాలి. వర్గ విభేధాలను విస్మరించేలా చెయ్యాలి.మనస్సుల్లో వర్గాలగురించి జపంచేస్తూ కూర్చోరాదు.

ఎప్పుడూ ఎగతాళి పాలయ్యే బ్రాహ్మలు వేదాల్ని స్మరించేదానికంటే మక్కుటంగా మన కార్మిక సంఘాల కార్యకర్తలు మార్క్సును

అమిత ధ్యాసంతో, మాతృ స్థాయిలో నిరంతరం స్మరిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదో రకం క్రొత్త సాంప్రదాయం. ముఖ్య పూర్వాచార పరాయణత్వపు తొలి సూచన. వేదాల, శ్రుతుల పంథానే వీళ్ళూ అనుసరిస్తున్నారు.

## బూజుపట్టిన మార్క్సిజం

ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. మార్క్సిజం పాతబడిపోయింది. మార్క్సిజంలోని ఎన్నో సిద్ధాంతాలు భవిష్యవాణులు తప్పని నిరూపించబడ్డాయి. మార్క్స్ ఊహించినట్టు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఇంగ్లాండులో మొదట సోషలిజం పుట్టలేదు. పారిశ్రామిక దృష్టితో చూస్తే ఐరోపా మొత్తంలో బాగా వెనకబడ్డ రష్యాలో వచ్చింది కార్మిక విప్లవం. ఈనాటికి కూడా అమెరికా, ఇంగ్లాండు లాంటి పారిశ్రామిక దేశాల్లో కాక కమ్యూనిజం వెనుకబడ్డ దేశాల్లోనే ఎక్కువగా వుంది. అంతే కాకుండా ఆర్థిక సమానతకు వ్యక్తిగత స్వంత ఆస్తుల్ని నిర్మూలించటం మార్గం కాదని తేలింది. ఉన్న వర్గాల నిర్మూలనతో వర్గరాహిత్యం సాధించలేమనీ తేలింది. ఎర్ర విప్లవం ద్వారా ప్రస్తుతం వున్న సమాజ వ్యవస్థ కొంత మార్పు చెందవచ్చు కానీ వర్గాలు అలానే కొనసాగుతాయి. ఒక భేదం ఏమిటంటే కమ్యూనిస్టు పాలనలో రాష్ట్ర పాలనా వ్యవస్థ పార్టీ నాయకత్వం గుప్పిట్లో వుండగలదు. పెట్టుబడిదారి వ్యవస్థలో దోపిడీ నిర్దయగా కొందరు పెట్టుబడిదార్లు సాగిస్తుంటారు. ఈ రెండు పరిస్థితుల్లో కొంత భేదం వుంటుంది. పెట్టుబడిదార్లను కమ్యూనిస్టేతర ప్రజాస్వామ్య పాలన అదుపులో వుంచొచ్చు, క్రమబద్ధం చెయ్యొచ్చు, ఆపవచ్చు. కాని పీడించే పాలకవర్గం కమ్యూనిస్టు పార్టీ అధినేతలైనప్పుడు వీళ్ళను ఆపేదెవరు, అడిగేదెవరు?

భారతీయ కమ్యూనిస్టులు సర్వోదయ వారి 'హృదయంలో మార్పు' అనే ఆలోచనను ఎగతాళి చేస్తుండేవారు. టాటాలు, బిర్లాలు స్వతహాగా ఎప్పుడూ తమ ఈనాటి స్థాయిని వదులుకోలేరని వాళ్ళ ఉద్దేశ్యం. నిజమే! కాని వీటన్నిటికంటే, పెట్టుబడిదారీ వాళ్ళకంటే ఇంకా శక్తివంతమైన కార్మిక నియంతృత్వాన్ని మీరింక ఆగండి అంటే ఓ శుభ దినం చూచుకుని తమకుతాము అంతర్థానమైపోతారా వాళ్లు? అదుపులోవున్న అధికారం తాలూకు పెడగొత్తే సంపూర్ణ నిరంకుశాధికారం స్టాలిన్లను, మవోలను సంపూర్ణంగా నిరంకుశుల నెందుకు చెయ్యదు. జరిగిందదేమరి! మార్క్సు సిద్ధాంతానికి వ్యతిరేకంగా రష్యా పాలకులు తమ నియంతృత్వం సోషలిజానికోసోపానం మాత్రం కాకుండా జాగ్రత్తపడ్డారు. రాష్ట్ర విహీనస్థితి మరెక్కడ్నుంచి దిగబడుతుంది. రాష్ట్రం పరిశ్రమల్ని జాతీయంచేయొచ్చు కాని అంతమాత్రంచేత సోషలిజం వచ్చేస్తుందని ఎలా అనగలం? నిజానికి ఆస్తులన్నీ రాష్ట్రం చేతుల్లోవున్నాయి. కాని రాష్ట్రం ప్రజల చేతుల్లోలేదుగా! నిజం చెప్పాలంటే రాష్ట్రానికే రెంటి మీదా ఆధిపత్యంవుంది; ఆస్తులమీద, ప్రజల మీద రష్యా (కాపిటలిజాన్ని) పెట్టుబడిదారీ వ్యవస్థను వదిలించుకుంది, కానీ వర్గరహిత, ప్రజాస్వామ్య, సర్వసమాన స్వేచ్ఛాయుత అంతర్జాతీయ సమాజం ఇంకా పుట్టలేదక్కడ. ఈ స్థితి "పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయం" అన్న మార్క్సు సిద్ధాంతాన్ని నేరుగా మొహం మీద కొట్టినట్టు అబద్ధం చేసేసింది.

## అధ్యక్ష పాలిత సమాజం

జేమ్స్ బరాన్‌హం చెప్పిన అధ్యక్షపాలిత రాష్ట్రాన్ని జ్ఞప్తికి తెస్తోంది రష్యా. అతని నిర్వచనం ప్రకారం మొత్తం అధికారం పాలకుల చేతుల్లో, పరిశ్రమల అధినేతల చేతుల్లో కేంద్రీకృత మవుతుంది. ఈ కొత్త సమాజం అటు సోషలిస్టూ కాదు ఇటూ పెట్టుబడిదారీ వ్యవస్థాకాదు"

అన్నాడు బరన్‌హాం. మార్క్స్ ఈ మూడో రకపు శక్తి ఉద్భవిస్తుందని ఆలోచించలేదు. అలాసే ప్రాముఖ్యత సంతరించుకున్న మరోవర్గం మధ్య తరగతి కుటుంబీక వర్గం. జీతాలు తీసుకునే మరో నడిమివర్గం యిది. ఈ వర్గంలో విభిన్న వృత్తులవాళ్లు, శాస్త్రజ్ఞులు, రసాయనశాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, సాంకేతికనిపుణులు, ఇలాటివారెందరో వున్నారు. వీళ్లు ఉత్పత్తిలో మంచి పద్ధతులతో కార్మికవర్గం కంటె ఎక్కువ ఆధిపత్యాన్ని గుప్పిట్లో పెట్టుకుంటున్నారు.

పైన చెప్పినది కేవలం ఉదాహరణకే! మొత్తం సూచీ మరెంత పెద్దది. చెప్పుకోదగ్గ అతిముఖ్యమైన సత్యం ఏమిటంటే పురోభివృద్ధి చెందుతున్న శాస్త్రజ్ఞాన ఒత్తిడిలో మార్క్స్‌చెప్పిన పదార్థం మనస్సుకు, మేధకు దాసోహం అన్నది.

అలా అని కార్ల్‌మార్క్స్ మానవజాతికి చేసినసేవ అత్యల్పంఅని కాదు. మార్క్స్ గొప్ప మేధావి! రాబొయ్యే కాలాల్లోని అనేకమార్పుల్ని ఊహించలేక పొయ్యాడంటే అదతని తప్పుకాదు. అతని సిద్ధాంతాలు అసంపూర్ణం, తప్పుఅని తప్ప అతనిపట్ల అతిగౌరవ భావమే కలుగుతుంది. అతని అనుయాయులు మాత్రం అతనికి చాలా అన్యాయంచేశారు. మూఢసూత్రాలకు, ఆచారాలకు వ్యతిరేకంగా ఆయన చెప్పిన సిద్ధాంతాల్ని మూఢసూత్రాలుగా మార్చేశారు వీళ్లు. ఆయన సిద్ధాంతాలకే వ్యతిరేకంగా ఆయన్ను ప్రవక్త స్థాయికి పైకెత్తి ప్రచారం మొదలెట్టారు.

## మార్క్సిజం మతం

మార్క్స్ మతాన్ని నిరసించాడు. కాని మార్క్సిజం మతాలను నమ్మని వాళ్లకు మతం అయింది. మతానికుండాల్సిన సర్వలక్షణాలూ

వున్నాయి. ఓ పవిత్ర పుస్తకం, వ్యాఖ్యానాలు, ప్రవక్తలు, నాస్తిక సన్యాసులు, ప్రాణాలర్పించినవాళ్లు, దాని ఉత్సవాలు, పండగలు అన్నిట్నిమించి రీప్రవత, కరడుగట్టిన మౌఢ్యం, సర్వలక్షణ సమన్వితమైనమతం అయింది. వైపరీత్యమేమంటే దేవుడు లేడనేవాళ్లదేవుడు మార్క్స్! ఈ తీవ్రతరమైన మార్క్సువాదుల పిడివాదం మానవ మేధ పురోభివృద్ధికి అవరోధం. శాస్త్రజ్ఞాన కౌశల్యానికి వ్యతిరేకం. మానవ జాతిని అభివృద్ధి మార్గంలో నడిపించేబదులు చరిత్రను వెనక్కి నడిపిస్తుంది. మార్క్స్ శాస్త్రజ్ఞుడని కచ్చితంగా చెప్పేట్లయితే ఈనాటి మార్క్సిజంలో మార్క్స్ సిద్ధాంతాలు లేవనాలి.

సినాదాల తుఫానులో చిక్కుకోనకుండా సమస్య మూలానికి వెళ్ళి ఆలోచిద్దాం. సంపద విభజనం విషయంలో భారతీయ దృక్పథం ఏమిటి? ఆర్థిక సమానతను కాంక్షిస్తుందా?

మన జవాబు అవును, కాదు అని రెండూనూ. ఎలా అంటే అసమానతలను నిరసిస్తాం కాబట్టి 'అవును' 'ఈనాటి సమానతా భావం చాలా అల్పం, మన సమస్యల్ని తృప్తిగా పరిష్కరించలేనిది కాబట్టి 'కాదు.'

## మానవేతరుల మాటేమిటి?

'మనుష్యులంతా సమానులు, ప్రపంచ ఐశ్వర్యానికి సమానాధికారులు వున్నవారు' అంటారు. మంచిదే! ఏమీలేని వాళ్ళకు ఎంతో కొంత ఇవ్వబూనటం మంచిదే. 'ఐశ్వర్యం' అన్నదాన్లో ఇతర జీవుల కెంతవరకు సంబంధం వుంది. ఈ సంపూర్ణ సంపదల్లో వారికే భాగస్వామ్యమూ లేదనాలా? ఉన్నదంతా పంచుకుని మిగతా జీవులకు ఏమీ లేదనే హక్కు

ఈ మానవాళికి ఎవరిచ్చారు? ఇది అహంకారంతో చేసే దోపిడీ కాదా? మానవ జాతికి అనుకూలంగా వుండేట్లయితే పశుపక్ష్యాదులను తుడిచి పెట్టేయ్యాలా? బ్రతికే హక్కు వాటికి నిరాకరించాలా? ఇది కేంద్రీకృతమైన తీవ్ర స్వప్రయోజన ధోరణి కాదా? ఆర్థిక సమానతలను వల్లించే పాశ్చాత్య మేధావులు మిగతా జీవులను పూర్తిగా మర్చిపోయ్యారు. ఈ మరుపు పొరబాటు కాదు. ఇది భౌతికవాదుల మనస్తత్వం యొక్క ప్రత్యేకత. మరో విషయం - సమానతా భావానికి భౌతికవాదంలో స్థానం లేదు. అధిక శక్తియుక్తులు, ప్రజ్ఞ కలిగినవాళ్ళు ఇతరులతో సమానంగా వుండటమేమిటి? భౌతికవాదం దీనికి జవాబివ్వదు. అందువల్లనే సమానత సాధిస్తామని అధికారాన్ని హస్తగతం చేసుకున్నవాళ్ళు తమ దేశాల్లో వున్న అత్యధిక అసమానతలకు బాధ్యులు. సమానతల పేరుమీద జరిగిన విప్లవాలు అనుకున్న ఫలితాలను అందివ్వక విఫలం ఎందుకయ్యాయో ఈ పరిస్థితి వివరిస్తుంది. పాశ్చాత్య సమానతా సూత్రాలు పాశ్చాత్య భౌతికవాదం మీద ఆధారపడి వున్నాయి కాబట్టి నిరాధారమైనవే అనాలి. కొంచెం ముందుకు వెళ్ళి ఆలోచించి చూస్తే సమానత్వం అనేది స్వయంస్ఫూర్తితో కలగాల్సిందే గాని ఎవరో బలవంతంగా నెత్తిన రుద్దేదిగాదు. అది స్వభావం కావాలి. భౌతికవాదానికి మనస్సు మీద నమ్మకమే లేకపోయె!

మానవ మేధలో సమానత్వ భావనను ఏది కలిగిస్తుంది? ఈ చారిత్రాత్మక అవసరాన్ని భౌతికవాదం తీర్చదు. పాశ్చాత్య సాంప్రదాయం 'తీసుకునే' సోషలిజాన్ని అందించింది. 'ఇచ్చే' ఇజాన్ని గుర్తించలేకపోయింది.

భారతీయ చరిత్రలో ఇష్టానుసారంగా స్వప్రేరణతో ఆత్మార్పణ చేసుకునే సంఘటనలు కోకొల్లలు. విశ్వజిత్ యజ్ఞంలో తమ సర్వస్వాన్ని దానం చేసిన విశ్వవిజేతలను భారత్ కడుపార కన్నది. వీటిని వరుసగా

చెప్పుకోవటం అనవసరం. ఈ సంఘటనలు స్వేచ్ఛాయుతంగా వ్యక్తులు స్వభావ సిద్ధంగా జరిపినవే గాని పైవాడెవడో బలవంత పెడితేనో క్రింది వాళ్ళు రచ్చ చేస్తేనో జరిపించినది కాదు.

త్యాగాన్ని ఏది ప్రేరేపిస్తుంది? 'నేను-నాది' అనే దాని పరిధిని దాటి సామాన్య వ్యక్తులు ఇతరుల కోసం తమ సర్వస్వాన్ని ధారపోస్తారని అనుకోవటం పొరపాటు. 'అందరూ తనవాళ్ళే' అనే భావన త్యాగాన్ని తనకు తానే చేసే స్థాయినిస్తుంది. ఈ భావం లేనప్పుడు నిజమైన త్యాగాన్ని ఆశించలేం. పాశ్చాత్యులు దిగ్భ్రమచెందేలా 'నేను - నాది' అన్న పరిధి లోంచి మానవుడు బయటపడ్డప్పుడే రఘు మహారాజులు, శిబి చక్రవర్తులు ఉద్భవిస్తారు.

భారతీయ ఋషులు ఈ సర్వస్వం ఒక్కటే అనుగ్రహించారు. విశ్వం అంతా ఈ సిద్ధాంతంతో నిండి వుంది. వివిధ వస్తువులు, స్థావర జంగమాలు, వివిధ రూపాలతో నామాలతో వున్నవన్నీ మౌలికంగా ఆ పర బ్రహ్మ స్వరూపాలే. "అహం బ్రహ్మాస్మి!" "నీవే అది!" "సర్వం బ్రహ్మ!" అన్నీ ఒకేదాని విభిన్న స్వరూపాలే! ఇది సిద్ధాంతం మాత్రమే కాదు, అనుభవానికి తెచ్చుకున్న విషయం.

## సర్వం ఒక్కటే

స్వప్రేరిత త్యాగానికి స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపేది "సర్వం ఒక్కటే" అన్న ప్రగాఢ భావనే. 'నీవు నీవే, నేను నేనే' అన్నన్నాళ్ళు నీకోసం బాధ పడే ప్రశ్నే లేదు. నీ హక్కులకు పోరాటానికి జవాబు ఇంకా ప్రశ్న ఎక్కువగా నా హక్కుల పోరాటానికి నాంది అవుతుంది. 'అంతా ఒక్కటే' అనే సత్యాన్ని కంటి కొసలతో గమనించినా పరిస్థితి

వెర్రి పోతుంది. అసలైన త్యాగాన్ని బోధించే ఈ తత్వం పాశ్చాత్యుల "మాకే మేం పొందుతాం" అనే సోషలిజానికి భిన్నం. ఇది ఇతరులకు ఇచ్చే 'ఇజం!' ఈ ఏకత్మతా భావ సమ్మృష్టి లోపించిన సమానత్వ సాధన సమస్యల్ని తీర్చే బదులు మరిన్ని సమస్యల్ని తెచ్చిపెట్టింది. ఈ పూర్వ రంగం ఆధారంతో ఆలోచిస్తే సమానత్వం అనే నేటి మాట అసందర్భం గానూ పరిణతి లేక మాట్లాడే స్థితిగానూ తేలక మానదు. ఇదే మానవుల అంతరాత్మ చైతన్యంతో మరో చక్కటి సాంఘిక స్థితికి మంచి పునాది కాగలదు. పాశ్చాత్యులు దుర్భరంగా విఫలులైన చోట భారతీయులు విజయులైన కారణం ఇదే!

పాశ్చాత్య వేదాంతులందరూ ఈ సత్యాన్ని గ్రహించటంలో వెనుక బడి వుండలేదు. "గ్రీకు, రోమను ఆలోచనలతో పెరిగిన యూరోపా వాసులం, యూదుల శాస్త్ర జ్ఞానాన్ని ఆధారం చేసుకున్న మనం ఆత్మాను భూతికి, ఆత్మ జ్ఞాన సంపదకు, విశ్వాంతర జ్ఞానానికి ఏం చెయ్యాలి అని నన్ను నేను ప్రశ్నించుకుంటే భారత్ వైపే చెయ్యి చూపిస్తాను" అన్నాడు మాక్స్‌ముల్లర్.

# 20. జాతీయత—విదేశీ తెగల వాదం

ఇస్లాం అనే అరబ్బు పదానికి అర్థం విధేయత, అధీనత, దైవంపట్ల నమ్రత. ఈ పదానికి 'శాంతి' అనికూడా అర్థం వుంది. ఆయనకు సమర్పించుకోవటంతోనే ఎవరైనా నిజమైన శాంతిని పొందగలరు. ఇస్లాం అనేది సగుణాత్మక విధుడు. ఈ విధిని ఎవరికున్నా, అతని జాతి, వర్ణం, వంశం, దేశం వీటితో ఏమాత్రం సంబంధం లేకుండా 'అతనో ముస్లిం'

అనుకుంటాడు ప్రతి ముస్లిమూ. 'ప్రతి ప్రజలో అన్ని కాలాల్లో ఈ గుణ విశేషాన్ని కలిగిన మంచివాళ్ళుండే వారు' అంటుంది ఇస్లాం పుస్తకం ఖురాన్.

## అరబ్బుల జాతీయమతం ఇస్లాం

జాతీయతపట్ల ఇస్లాం అసలు భావం ఏమిటి? స్పష్టమైన విశిష్టత లున్న జాతుల్ని ఇస్లాం తుడిచిపెట్టే వుద్దేశ్యంతో వుందా? కొందరు ముస్లిం వేదాంతులు మాత్రం కాదంటారు. ఇస్లాం జాతీయతలను; జాతీయ గుణాల్ని నిలిపి వివిధ నాగరికతల మధ్య జాతుల మధ్య సదవగాహన పెంపొందించి అంతర్జాతీయ విభేదాల్ని నిర్మూలించాలని ఆశిస్తున్నది అంటారు పైగా!

ప్రవక్తను అడిగాడొక శిష్యుడు: "దురభిమానం అంటే ఏమిటి? తన జాతిని ప్రేమించటం దురభిమానమా?"

"కాదు. అది తప్పుడు మార్గంలో వున్నా ప్రేమించటం దురభి మానం" అన్నాడు ప్రవక్త (ఇబ్న-ఇ-మజాహ్).

"మానవాళి పురోగతి ప్రతి జాతి పురోగతిమీద ఆధారపడివుంది. అందుకని జాతీయతా సమగ్ర సంక్షేమానికి దైవ శరియత్తులు వ్యతిరేకం కాదు. పైపెచ్చు ప్రోత్సహిస్తాయి" అంటారీ ఇస్లాం వేదాంతులు.

అసలు విషయం ఏమిటంటే నిరంతరం నిత్యపోరాటాలతో గందర గోళంగా వున్న అరబ్బు తెగలకు యూదుల పద్ధతిలో ఒకటిగా చెయ్యాలని ఇస్లాంను ప్రవేశపెట్టాడు మహమ్మద్ ప్రవక్త. ఆ ప్రవక్త అనుకున్న దాన్ని మించి అరబ్బుల జాతీయ మతం అన్న ఇస్లాం మరో రూపాన్ని సంతరించుకున్నది. అదీ సమస్య!

దురదృష్టం ఏమిటంటే-భారత్‌లో వున్న ముస్లింలు ఈ దృక్కోణాన్ని అంగీకరించరు. ఎక్కడైనా ఈ మతాధికారులు అధికారాన్ని స్వంతం చేసుకోవాలనే చూస్తారు. రాజకీయ నాయకులు మాత్రం తక్కువ తిన్నారా? మతాన్ని, నమ్మకాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటారు. ఈ మతం, రాజకీయం తమ స్వప్రయోజనాలకోసం చేతులు కలిపారంటే ఇక సామాన్య ప్రజానీకం వీళ్ళను వదిలించుకోవటం అటుంచి దోపిడీకి గురి గాక తప్పదు. ఇటు ఆధ్యాత్మిక స్థాయిలోనో అటు రాజకీయ చాతుర్యం చేతుల్లోనో బోల్తాపడి లొంగిపోతాడు.

## ఇస్లాం ముందున్న నాయకత్వం మీద ముల్లాల దాడి

కరడుగట్టిన మౌఢ్యంతో ఊగిపోయే ముస్లింలు ఎటువంటి జాతీయతా ఆరాధనలనూ అంగీకరించరు. దైవ చట్టాలకు, అంటే షరియత్‌కు జాతీయతా భావానికి పొంతన కుదరదు. ఇస్లాం, జాతీయత రెండు విభిన్న మనస్తత్వాలకు చెందిన విషయాలు. ఆ రెండు మనస్తత్వాలూ ఒకదానికొకటి శుద్ధ వ్యతిరేకం. మానవులు ఈ రెంటిలో ఒకదాన్నే అంగీకరించక తప్పదు. తమ మనస్సుల్ని, ఆత్మల్ని, శరీరాన్ని ఆ ఒక్కదానికి మాత్రమే అంకితం చెయ్యక తప్పదు. ఎవరైనా ఒకదానికి అంకిత మయ్యాక మరోదాని మాటకూడా ఎత్తకూడదు. మానవ శాస్త్రంలో జాతీయతా దృక్పథం ఇస్లాంకు శుద్ధ వ్యతిరేక దృక్పథం అని వీరి నమ్మకం. "ఏ ముస్లిమైనా ఇస్లాం ధ్యేయాన్ని సమర్థించేటట్లయితే అతను ఎక్కడున్నా, ఏ పరిస్థితుల్లో వున్నా సహజంగానే జాతీయతకు వ్యతిరేకంగా పోరాడాలి" అంటారు వీళ్లు.

ఈ మూఢ దృక్పథంతో ప్రపంచ వ్యాప్తంగా జాతీయవాదులకు సమస్యల్ని సృష్టిస్తున్నది ఇస్లాం. మనం భారత్‌లో ఎదుర్కొనే సమస్య

మనకే ప్రత్యేకం కాదు. 'ముస్లిం దేశాలు' అనబడే దేశాల్లో కూడా జాతీయ వాదులు ఈ దౌష్ట్యాన్ని ఎదుర్కోవటానికి సతమతం అవుతూనే వున్నారు. ముస్లిం దేశాల్లో కూడా పెరిగే జాతీయతా భావ సంపదను నిర్దయగా అణి చెయ్యటానికి ముస్లిం మౌఢ్యం ఏమాత్రం వెనుదియ్యలేదు. ఇస్లాం ముందున్న జాతీయ వీరులను చాలా క్రమబద్ధంగా విస్మృతిలోకి తోసె య్యటం జరిగింది. ఈజిప్టులోని 'ఫారో'లను కాఫిర్ల క్రింద జమకట్టారు! ప్రవక్త పుట్టకముందు ఔన్నత్యాన్ని పొందినవాళ్ళు ఫారోలు. సోహాబ్, రుస్తుంలు కూడా కాఫిర్లేగదా! కాని వాళ్ళకు పవిత్ర కురాన్ ఒకటి రాబో తోందని ఎలా తెలుసు? కలగనలేరు గదా! ఈ దేశాల్లో జాతీయత పునరుద్ధరించబడ్డాక ఈ పాత వీరుల స్మృతులూ పునరుద్ధరించబడ్డాయి. ఇస్లాం ముందు రోజుల బంగారు చరిత్రను అన్ని విధాలా పునర్నిర్మించు కున్నారా ప్రజలు. ఇరాన్, ఈజిప్టు లాంటి దేశాల్లో ప్రజలు ముస్లిం మౌఢ్యంతో తలబడాల్సి వచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమానుల్లా, టర్కీలో ముస్తాఫా ఘాజీ కెమాల్ పాషా ఈ జాతీయశక్తుల దేశభక్తికి ప్రోత్సాహ మిచ్చారు.

## అరబ్ విదేశీ ప్రాబల్యాన్ని విసర్జించిన టర్కీ

దేశభక్తి భావంలో ఉప్పొంగిన టర్కీవారు భాషలో, సాహిత్యంలో-ఆ మాటకొస్తే జాతి జీవనంలో ప్రతి అడుగునుంచి అరబ్బు ప్రభావాన్ని తొలగించారు. ఇస్లాం ఆయుధం ద్వారా టర్కీలో పెరుగుతున్న అరబ్బు ఆధిక్యతను గుర్తించిన మరుక్షణం జాతీయ తురుష్కులు వేరుపడి తెర వెనక్కెళ్ళిపోయారు. 'అంకారా'లోని పబ్లిసిటీ శాఖ డైరక్టర్ జనరల్ వ్రాసిన 'చరిత్రలో టర్కీ స్త్రీలు' అన్న పుస్తకంలో వ్రాసిన వ్యాసంలో ఒక భాగం చదివితే వివరాలు తెలుస్తాయి.

"టర్కీ స్త్రీలకు మన కొత్త ప్రజా ప్రభుత్వంలో ఇవ్వదల్చుకున్న గౌరవ స్థానాన్ని గురించి తెలుసుకునేముందు చరిత్రలో వివిధ కాలాల్లో టర్కీ స్త్రీకున్న స్థానాన్ని సమీక్షించి చూచుకోవాలి. ఈ కొద్ది సమీక్షవల్ల మనకు ఈనాడు స్త్రీ పురుషుల కివ్వదల్చుకున్న సమాన స్థాయి మనకేం కొత్త కాదని తేలుతుంది. మన టర్కీ కుటుంబాలు, సామాజిక సంస్థలు విదేశీ ప్రభావంలో లేని అన్ని సమయాలో టర్కీ స్త్రీకి సాంఘికంగా ప్రతీ విషయంలో భాగస్వామ్యం వుండేది. సాంఘిక సంస్కర్త జియాగోక్ ఆల్ప్ చేసిన పరిశోధన ఫలితంగా మన టర్కీ నాగరికతలో స్త్రీలు ఎలాటి సమాన హక్కులు కలిగి వుండేవారో, ఎటువంటి స్వేచ్ఛను అనుభవించారో సవివరంగా తెలిసివచ్చింది. ఇలాటి కొన్ని నిదర్శనలు మన పూర్వ సమాజంలో స్త్రీ స్థాయికి ఈనాడు అధునాతన స్త్రీకి ఎలాటి పోలిక వుందో తెల్పుతాయి."

## అల్లాకు అరబ్బీ భాష మాత్రమే వచ్చా?!

జాతీయతా భావంవున్న తురుష్కులు విదేశీ ప్రభావం పైనబడ్డ రోజులకుముందున్న పరిస్థితులే ప్రమాణంగా తీసుకున్నారు. అధునాతన టర్కీయోజకుడు జియా గోక్ ఆల్ప్ కన్న కలలు ఎలాటివి మరి!

"తురేనియన్ పూర్వీకులమధ్య ఆట్టోమన్ తురుష్కులమధ్యవున్న అగాధాన్ని పూడుస్తూ ఏర్పడాలి అధునాతన టర్కీ! టర్కీ చరిత్రలో ఇస్లాం రోజులకుముందున్న కాలంలోని నాగరికత, సాంప్రదాయం, రాజకీయ సంస్థలు వీటన్నిటిగురించి పరిశోధించి తెలుసుకున్న వివరాలే పునాదులుగా సరిక్రొత్త నాగరికతను నిర్మాణం చెయ్యాలి. అరబ్బులు స్థాపించిన ఇస్లాం మనకు సరిపోదు. పురాతన రోజులకు తిరిగి పోను ఇష్టపడకున్నా ప్రస్తుత మతం విషయంలో మన స్వభావాలకు అనుగుణంగా చాలా సంస్కారాలు తీసుకరావాలి."

టర్కీలోని జాతీయతావాదులు కురాన్‌ను అరబ్బీ భాషలో చదవడానికి ఇష్టపడలేదు. అల్లాకు అరబ్బీ ప్రార్థనలు మాత్రమే అర్థమవుతాయా? టర్కీభాషలో ప్రార్థిస్తే వినడా? ఇదీ ప్రశ్నలు! టర్కీవాళ్ళ పవిత్ర కురాన్ పఠనం తీవ్ర తగాదాలను, విద్వేషాలను చెలరేపింది. కురాన్‌ను మసీదుల్లో టర్కీ భాషలో చదివిన తొలిరోజు దేశవ్యాప్తంగా నడివీధుల్లో జాతీయతావాదులకు సనాతన మూఢ మతోన్మాదులకు హోరాహోరీ పోరాటాలు జరిగాయి.

హిందూస్తాన్‌లో హిందూనాయకులు ఖిలాఫత్ ఉద్యమాన్ని సమర్థించి హిందూరక్తాన్ని చిందించే రోజుల్లో ఖిలాఫత్ (ఖలీఫా) పుట్టిల్లు టర్కీలో జాతీయవాదులు తిరిగి ఖలీఫా నియామకాన్ని వ్యతిరేకించి ఖిలాఫత్ పద్ధతిని రూపుమాపటానికి కంకణం కట్టుకుని విజయులయ్యారు. వైపరీత్యమేగదా!

జాతీయవాదులు వ్యక్తిగతమైన మతం విషయంలో ఏదో ఊహాలోకంలో విహరిస్తూ 'మత ప్రపంచం, మతవైభవం' అని అంగలార్చుకుంటా జాతి ప్రయోజనాలకే ప్రాముఖ్యత నిచ్చారు. అందువల్లనే విశ్వవ్యాప్త ఇస్లాం నినాదానికి కొట్టుకపోతున్న భారతీయ ముస్లింలు ప్రతిసారీ దేశభక్తులైన విదేశీ ముస్లింలచేతుల్లో భంగపాటు పడుతూంటారు. కందకు లేని దురద కత్తిపీటకొచ్చింది!

## భారతీయ ముస్లింలను దూరంగా వుంచాడు కెమాల్ పాషా

1923, డిసెంబరు నెలలో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలతోపాటుగా అఖిల భారతీయ ఖిలాఫత్ సభలూ జరిగాయి. అందులో తీసుకున్న నిర్ణయాలననుసరించి షియా ముస్లిం అమీర్ అలీ, ఖోజా వర్గ

నాయకుడు ఆగాఖాన్ టర్కీ-వెళ్ళి కమాల్ పాషాను ఖిలాఫత్ ఆందోళన సందర్భంగా కలుసుకున్నారు. ఈ కలయికగురించి కాంట్‌వెల్ స్మిత్ ఇలా వ్రాశాడు: "టర్కీ ఘాజీ అమీర్ ఆలీ, ఆగాఖాన్‌లాటి వాళ్ళను చూచి కుపితుడయ్యాడు. ఇటీవలి కాలంలో జరిగిన ఆటోమెన్ సామ్రాజ్యంమీది బ్రిటిషర్ల యుద్ధం తర్వాతకూడా బ్రిటిష్ సామ్రాజ్యాధినేతలతో సత్సంబంధాలు పెట్టుకున్నవాళ్ళు టర్కీ- ఇస్లామిక్ రాజ్యాంగంగురించి మాట్లాడుతున్నారా! అన్నాడాయన. మళ్ళీ టర్కీ- ముస్లింలకు, ముస్లింలుగా ఎలా వుండాలో అని ఓ షియా, మరో ఖోజా చెప్పొచ్చారా! బ్రిటిష్ పాలనకు భారత్‌లో మూల స్తంభాలుగావున్న వాళ్ళు టర్కీ- జాతీయతగురించి సలహా ఇవ్వటానికి వచ్చారట! అని వీళ్ళను తిరస్కరించాడు టర్కీ-ఘాజీ. 23 మార్చి, 1924న టర్కీ-ప్రజలు అబ్దుల్ మజీద్‌ను దేశ బహిష్కరంచేసి ఖిలాఫత్ పద్ధతిని పూర్తిగా నిషేధించారు." ఇదీ భారతీయ ఖిలాఫత్‌లకు జరిగిన సంభావన.

అంతేగాదు - ఖిలాఫత్ ఆందోళన రోజుల్లో కొందరు భారతీయ ముస్లింలు ఆఫ్ఘనిస్తాన్‌లోని తమ సోదరులతో కలిసి పనిచెయ్యటానికి అక్కడకు వలస వెళ్లారు. వాళ్లకు అక్కడ లభించిన సత్కారం అందరికీ తెలిసిందే, ఆఫ్ఘన్ జాతీయులు తమ భారతీయ ముస్లింసోదరులు తమతో ఆ దేశంలో వుండటానికి నిరాకరించారు! 'మా జాతీయ ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. మీరిక్కడ వుండాల్సిన అవసరంలేదు' అని తరిమేశారు. ఇదే విశ్వ సౌభ్రాతృత్వం!

జెరూసలేంలో 1931, డిశంబర్‌లో ఇస్లాం సమావేశాలు జరిగాయి. మౌలానా శౌకత్ ఆలి ఆ సభలతీరు చూచి పూర్తిగా నిస్పృహ చెందాడు. "ఈ సమావేశాలు అన్నిదేశాల్లో వున్న ముస్లింల సమస్యల గురించి ఆలో

చించే ఇస్లాం ధోరణిపైనా అరబ్బురంగుల్ని పూసుకుంటున్నది" అని వాపోయాడు.

మరి మనవారు ఇస్లాంకు జాతీయతలు, దేశపుఎల్లలు, లేవు, ఏ దేశంలోవున్నా ముస్లింలంతా ఒకేజాతి అంటారు. ఇలాటి విశ్వముస్లిం శౌకత్ అలీకంటే అరబ్ జాతీయులు భిన్నంగా వున్నామంటున్నారు మరి!

## హిందూ-ముస్లిం సమస్యను సరిగా అర్థంచేసుకోవాలి

ఏ సమస్యకైనా పరిష్కారం కావాలంటే ముందా సమస్యను సరిగా అర్థంచేసుకోవాలి. "రోగనిర్ణయంతో సగంజబ్బు తగ్గినట్లే!" అంటారు. దేశస్వాతంత్ర్యంముందు రాజకీయ నాయకులు ఈ హిందూ ముస్లిం సమస్యను సరియైన దృక్పథంతో చూడలేదు. ఈ తప్పుకు వెంటనే దక్కిన ఫలితం దేశవిభజన. తప్పులు చెయ్యటం మానవసహజం. కాని ఆ తప్పులే చేస్తూపోవటాన్ని ఏమనాలి? చేసినతప్పులవల్ల కొత్తపాఠాలు నేర్చుకున్నట్లైతే ప్రతిఫలాలు విజయానికి మూల స్తంభాలౌతాయి. అసలు సమస్య మన అంతర్జాతీయ మేధావులు మనల్ని నమ్మించేట్లుగా మత సమస్యకాదు. ఇది మతం - జాతీయతల సమస్య. ముస్తాఫ కమాల్ పాషాలాటి వారెందరో మార్గాన్ని చూపారు. టర్కీలో టర్కిష్ జాతీయతకు ఇస్లాంకు ఎలాటి సంబంధం వుందో అలాటి సంబంధమే భారత్‌లో ఇస్లాంకు హిందూ జాతీయతకు వుండాలి. సెక్యులరిస్టులు జాతీయుల్ని ఈమాటన్నందుకే మత తత్వవాదులు అని నిందిస్తున్నారు. భారతీయ ముస్లింలు హిందూ జాతీయతను ఆమోదించనంతవరకు ఈ దేశాన్ని ప్రేమిస్తున్నట్లు ఎలా అనుకోవాలి?

# 21. జాతీయతా విచ్ఛిన్నతకు కారకాలు

బొంబాయిలో వుండే శ్రీ యం. ఏ. ఖురేషి అనే ఉర్దూ, పర్షియన్, అరబిక్ పండితుడు 1963 లో డాక్టర్ జాకిర్ హుస్సేన్‌కు ఓ విన్నపం చేశాడు- "భారతీయ ముస్లిలకు భారతీయ జాతీయతను గురించి వివరించి తెలియజెప్పండి" అని. ఇది ఓ సిగ్నల్ లాటిది.

డా॥ జాకిర్ హుసేన్ ఉపాధ్యక్షుడుగా ఎన్నిక కాగానే శ్రీ ఖురేషి ఆయనకు ఓ లేఖ వ్రాశాడు.

"ఓ ముప్పై ఏళ్ళ క్రితం నేను అరబ్బీ గ్రంథాలు చదవటానికి, అరబ్బుల గురించి తెలుసుకోవటానికి అరేబియా వెళ్ళాను. నేను అదృష్ట వశాత్తు క్రైస్తవ పాఠశాలలో చదివినందువల్ల యూదుల, క్రైస్తవుల, ముస్లింల రాజకీయాల విషయంలో హృదయ వైశాల్యంతో వ్యవహరించ గలిగాను. నేను చిన్నప్పట్నుంచీ నాసహోదర ముస్లింలకు ఓర్పు, దేశ భక్తి, సహజీవనం గురించి చెప్తూవుండేవాణ్ని. కాని నేను ఓటమి అంగీక రించక తప్పటంలేదు.

"నేను ఎప్పుడు జాతీయత, దేశభక్తి గురించి మాట్లాడినా ముస్లింలు నాకు ఎదురు బోధచేసేవారు. 'మన మతం ఇస్లాం! మేము దానిపట్ల నిజా యితీగానే వుంటున్నాం మన దైవసంప్రదాయాన్ని మేము మరో మతంతో గాని, దేశంతోగాని, రాజకీయంతో గాని పోల్చలేం. మేము రెండు రాజ్య పాలనా పద్ధతుల పట్లవిధేయులమై వుండలేం'

"నేను మసీదుల్లో జుమ్మా ప్రార్థనల తర్వాత ఎప్పుడు జాతీయత గురించి మాట్లాడినా 'నోరుముయ్! ఈ పవిత్ర ఆవరణలో విగ్రహారాధకుల గురించి మాట్లాడే పనేలేదు' అని మొరటుగా విదిలించి కొట్టేవారు.

"నేను నా ఇతర సభల్లో హెచ్చరికలు ఎన్నో చేశాను. గతంలో ముస్లింల చేతుల్లో తేలిగ్గా ఓడిన జడ్డి హిందువులు కాలగర్భంలో కలిసిపోయ్యారు. ఈ తరంవాళ్లు ముస్లింలు వ్రాసిన చరిత్రని, యూరోపియన్లు అనువదించిన వాటిని తీవ్రంగా తిరస్కరిస్తున్నారు. ఈనాడు పరిస్థితులు మారాయి. ముస్లింలు నిద్రిస్తున్నారు, హిందువులు మేల్కొంటున్నారు. ఈనాటికీ పాకిస్తానీ ముస్లింలు 7 వ శతాబ్దంలో బ్రతుకుతున్నారు.

"తమ ఆధిక్యత ఎక్కువగా వున్నప్పుడు హిందువులు తమ బానిసలుగా వుంటారు అనుకునేవారు ముస్లింలు. ఈ ఉద్దేశ్యంతోనే ఐతిహాసికంగా, రాజకీయంగా కూడా హిందువులను తీవ్రంగా విమర్శిస్తూ, నిరసిస్తూ, ఎద్దేవా చేస్తూ, అవమానిస్తూ చరిత్రలు వ్రాసుకున్నారు. హిందువులను గుండెల లోతుల దాకా అమితంగా అవమానించారు, హింసించారు, పీడించారుకూడా. శతాబ్దాల వరకు వీరు ప్రమాదంలేదని విర్రవీగారు.

"ఈనాడైనా మీరు మసీదుల్లో చేసే ప్రవచనాలు హిందువులు తమ చరిత్రను స్వచ్ఛందంగా స్పష్టమైన పద్ధతిలో తిరిగి వ్రాసుకుని హిందూ జాతీయతను మేల్కొల్పటానికి సహాయపడగలవు. చరిత్రలో తమకు జరిగినదాన్ని ఒక్కసారి చదివి చూచుకుంటే చాలు-హిందువుల గుండెలు అవమానాలకు ప్రతీకారం చెయ్యాలనే కాంక్షతో ఉప్పొంగిపోగలవు. ఆసన్న ఆగ్రహంతో రక్తం ఉడికిపోగలదు. ప్లాటోకు పాఠాలు నేర్పినవారు, పైథాగరస్ సిద్ధాంతాల్ని ప్రపంచానికిచ్చిన హిందువులు తమ దేశచరిత్రను తాము వ్రాసుకోలేదని బుద్ధుండేవాడెవడూ అనుకోరాదు. కాని ఢిల్లీ పాలకులు ఆ పుస్తకాల్ని, వ్రాసిన వాళ్లను కూడా నాశనం చేశారు.

"ఈ విషయంలో మన ఆత్మశుద్ధిని నిరూపించుకోవాలంటే కాశీలో లక్ష్మీదేవాలయం మీదకట్టిన ఔరంగజీబ్ మసీదును మొదట తొలగించాలి. మక్కాలో కాబా మీద హిందూ దేవాలయాన్ని మనం సహించగలమా?....

"నా హిందూమిత్రులు నాతో అంటుంటారు- 'ఈనాటికీ మీరు చేసే గోహత్యలు మాని, ఇతర రెచ్చగొట్టే పనులు ఆపితే గతంలో మీరు మా స్త్రీలపట్ల చేసిన అవమానాల్ని, మా పట్ల, మా దేశంపట్ల, మా దేవీదేవతల పట్ల చేసిన ద్రోహాల్ని క్షమించి మర్చిపోగలం!'

"ముస్లింలకు బహుశా 'రోమ్‌లో వుంటే రోమన్‌లా వుండు' అనే సామెత తెలిదేమో! దేవుడు లక్షలాది ఇతర జీవుల్ని, వస్తువుల్ని పొట్ట నింపుకోవటానికి సృష్టించి ఇచ్చినప్పుడు హిందువులు దేవీ స్వరూపిణిగా గౌరవించే గోవుల్నే ఎందుకు చంపుకుతినాలి? రెచ్చగొట్టేపని తప్పు కాక అనే మాట తప్పుడు మాట. వేలాది ఇతర వస్తువులు దానికంటే చౌకే."

## దేశభక్తిని మహమ్మదూ మెచ్చుకున్నాడు

ఇస్లాం అసలు నిబంధనలు దేశభక్తి భావనతోనే వున్నాయి. ప్రవక్త దేశభక్తితోసహా అన్ని ఉదార సద్గుణాలను ప్రోత్సహించాడు. మతరీత్యా కూడా అతను పూర్వమతాలమీద, అతని కాలంలోని ఇతర మతాలమీద యుద్ధాన్ని ప్రకటించలేదు. పవిత్రకురాన్‌లో పూర్వమతాలల్లోని సత్యాలను వ్యతిరేకించలేదు. భగవంతుడు ప్రతి దేశానికి ప్రవక్తల నిచ్చి ఆశీర్వదించాడు.

"ప్రతి ప్రజకు ఒక మార్గదర్శకుడున్నాడు" (కురాన్:xxiii-3)
"హెచ్చరించేవాడు లేని ప్రత్యేక ప్రజలంటూ ఎవ్వరూ లేరు."
(xxxv : 23)

తత్ఫలితంగా హజరత్ మీర్జా గులాం అహమ్మద్ ఇలా వ్రాశాడు: "ఏ భూభాగానికి చెందినవారైనా ఎవరి బోధలు అక్కడ చిరకాలం గౌరవించబడ్డాయో వాళ్లను దేవదూతలుగా గౌరవించాలి. అల్లా తప్పుడు ప్రవక్తలు గౌరవించబడటాన్ని సహించడు. ప్రజామోదం పొందిన ప్రతి బోధకుడూ వందనీయుడే. బుద్ధుడు, శ్రీకృష్ణుడు, శ్రీరామచంద్రుడు అందరూ నిస్సందేహంగా దైవాంశసంభూతులే. తర్వాతి వాళ్ళ మెరుగు పూతలు వారి తొలి బోధల్ని మరుగుపెట్టి వుండవచ్చు."

తన అనుయాయులు ఆయాదేశాల్ని మోసం చెయ్యాలని మహమ్మద్ ప్రవక్త అని వుంటాడన్నది అసంబద్ధమైన ఆలోచన.

ఈనాడు జాతీయవాదులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయారు. మహమ్మదీయ మతాన్ని పుచ్చుకున్న హిందూ జాతీయుల్ని తిరిగి మన జాతీయ సంస్కృతిలో ఇముడ్చుకోవటం సాధ్యమేనా? అని అనుమానం వస్తోంది.

కాని హిందూ జాతీయ సంస్కృతికి, వ్యక్తిగత ముస్లిం నమ్మకానికి పొసగదనటం సరికాదు. మన సంస్కృతి అన్నిమతాల్ని, అందరు ప్రవక్తల్ని ఆహ్వానిస్తుంది. ఐతిహాసికంగాకూడా భారతీయ ముస్లింలు విదేశీయులుకారు. వాళ్ళవీ మనలాటి రక్తమాంసాలే. మనం విదేశీయులైన హూణుల్ని, శకుల్ని కూడా జీర్ణించుకున్నాం. మన రక్తమే ప్రవహిస్తున్న వీళ్ళను కలుపుకోవటం కష్టం ఎలా అవుతుంది? విదేశీయ విరోధులు కూడా సంస్కరించబడ్డారని చరిత్ర చెబుతోంది.

## భారత్‌లో ఇస్లాం హైందవమైంది!

సాంస్కృతిక విలీనం ఆ వర్గంవారి మేధావులతోనే గదా ప్రారంభం అయ్యేది! ఏ దేశంలోనైనా సాంస్కృతికంగా హీన దశలోవున్న పాలకులు

ఉన్నతమైన సంస్కృతికి లొంగిపోతారు. అక్బరు కాలం నుంచి హిందూతత్వం ముస్లిం మేధావులపైన ప్రభావం చూపుతూనే వుంది. ముస్లింల ప్రయోజనం కోసం అబుల్ ఫజల్ షడ్దర్శనాలను అనువదించాడు. అక్బరు పాలనలో ముస్లింలు సంస్కృత భాషపట్ల హిందూ మతాలపట్ల ఎంతో శ్రద్ధ చూపారు. ఆ రోజుల్లో మహాభారతం, రామాయణం, అధర్వవేదం ముస్లింలకు అందుబాటులో వుండేవి. కేవలం ఇస్లాంతోనే హిందువుల్ని వైజ్ఞానికంగా లోబర్చుకోలేమని గ్రహించాడు అక్బరు. అందువల్లనే కొత్త దేవమతం అని 'దీన్-ఇ-ఇల్లాహి'ని ప్రారంభించాడు. భగవద్గీత, ఉపనిషత్తులు, ప్రబోధ చంద్రోదయ, యోగవాసిష్ఠ, మరెన్నో గ్రంథాలను, శ్రుతులను పర్షియను భాషలోకి అనువదించి దారా ముస్లిం మేధావుల్లో హిందూ ధర్మ భావ సమృద్ధిని ప్రవేశపెట్టాడు. దారాలోని జాతీయ సంస్కృతిని ప్రతిఫలింపచేసే తార్కాణం ఒక్కటి చెప్పుకోవచ్చు.

కాబాలో సోమనాథ మందిరంలో వుండేది నీవే
మఠంలో సత్రంలో కూడా వున్నది నీవే
దీపానివి నీవే కీటకానివీ నీవే
సారాగాని, సానిగాని
ఋషిగాని అవివేకిగాని
మిత్రుడుగాని శత్రువుగాని
అన్నీ నీవే అంతటా నీవే!

దారాలోని ఈ స్ఫూర్తిని అద్వైతవాదులు గుర్తించగలరు. ఔరంగజేబును చీకాకు పరచిన విషయం ముస్లిం మేధావులు జాతీయతా భావాలకు స్పందించటమే. విదేశీయుడైన కార్ల్ మార్క్స్ కూడా ఈ విషయాల్ని స్పష్టంగా గుర్తించాడు. 22, జులై, 1853 న లండన్ నుంచి ఇలా వ్రాశాడు:

"భారత్‌ను ఆక్రమించిన అరబ్బులు, తురుష్కులు, టార్టార్లు, మొగలులు అందరూ హిందూత్వాన్ని పొందారు. ఈ అక్రమ బర్బర ఆక్రమణదార్లు అనంత చారిత్రక సిద్ధాంతాన్ని నిరూపిస్తూ తమ పాలిత ప్రజల అత్యున్నత నాగరికతకు తలవంచారు."

## అరబ్ మాటల్లో సనాతన ధర్మం

కొన్ని చారిత్రక దురదృష్ట సంఘటనల మూలంగాగానీ ముస్లింల సంస్కృతీకరణ అవిచ్ఛిన్నంగా సాగిపోయ్యేదే. పైకి స్పష్టంగా కనిపించ కున్నా అది ఈ నాటికీ జరుగుతూనే వుంది.

1944లోనే డా॥ శౌఖత్ ఉల్లా అన్సారీ ముస్లింలంతా పాకిస్తాన్‌ను ఆహ్వానిస్తారని నమ్మజాలం అన్నాడు.

"పాకిస్తాన్ కోరికకు మతమే ప్రధానకారణం కాబట్టి పాకిస్తాన్ మతతత్వ రాష్ట్రం అవుతుందనాలి. అలాటి మత ప్రాధాన్యదేశంలో వుండాలా వద్దా అని అడగాల్సింది వాయువ్య ప్రాంతంలోవున్న ముస్లింలే! ఇస్లామిక్ చట్టాలతో పాలింపబడాలని వుందా వారికి? తమ సాంప్రదాయ చట్టాల్ని వదులుకుంటారా? బైతుల్ మాల్‌కు జకాత్ చెల్లింపుకు అంగీక రిస్తారా? సింధీముస్లింలు, ఖోజాలు, కచ్ మీనన్లు హిందూచట్టాల్ని వదులు కుంటారా? తరనాటి కాఫిర్ పద్ధతిని వదులుకుని షరియత్ చట్టాల ప్రకారం పంజాబీముస్లిం రైతులు తమ ఆస్తుల్ని అప్పచెల్లెళ్లతో సమానంగా పంచు కుంటారా?"

'పాకిస్తాన్-భారతదేశ సమస్య' అనే తన పుస్తకంలో డా॥ అన్సారీ వేసిన ప్రశ్నలివి.

ఆయన ఇంకా ఇలా వ్రాశాడు:

"జాతి విభేదాలగురించి ఆలోచించేట్లయితే ఒకే ప్రాంతంలోవుండే ముస్లింలకు హిందువులకు మధ్య రెండు ప్రాంతాల్లోని ముస్లింల మధ్యవుండే దానికన్నా ఎక్కువ ప్రేమాభిమానాలువున్నాయి. పంజాబులోని అవాన్లు ముస్లింలైనా హిందూ పేర్లనే వుంచుకుంటారు. పైగా బ్రాహ్మణుల్లోలాగా వంశ చరిత్రను పారంపర్యాన్ని వుంచుకుంటారు. పెళ్ళిళ్ళ విషయం తీసుకుంటే కొందరు ముస్లింలు హిందూ ఆచార వ్యవహారాల్ని పాటిస్తారు. మరి కొందరు ముస్లింలైతే హిందూ వైవాహిక చట్టాన్ని, వారసత్వపు చట్టాన్ని అనుసరిస్తూ వున్నారు. హిందువులు తమ దేవతావిగ్రహాల ముందు వంగి దణ్ణాలు పెడితే ముస్లింలు (సంతుల) ఫకీర్ల సమాధులముందు, పీర్లముందు వంగి దణ్ణాలు పెడతారు. ఇస్లాంలో సంగీతం నాట్యం నిషిద్ధం. కాని కొన్ని ఖాన్‌ఖాహ్‌లలో చక్కటి సంగీతాన్ని, ఇంపైన నాట్యాన్ని చూస్తాం. భారత్‌లో ఇస్లాం సనాతన ధర్మం యొక్క అరబ్బీ రూపం."

చెప్పేది చేసేది వేరైనా ముస్లిం మేధావులు, జాతీయవాదులు, మత తత్వ వాదులు కూడా ఈ నాగరికత, సంస్కృతి ప్రభావాన్ని పూర్తిగా గమనించారు. ముస్లిం మత తత్వవాదులైతే ఈ విషయాలపట్ల చాలా అసహనంగానే వున్నారు. దేశ విభజనముందు వాళ్ళు చేసిన ప్రకటనలవల్ల ఈ విషయం స్పష్టమవుతుంది. జవాబ్-ఇ-షిక్వాలో తన మనస్సును ఇలా ప్రకటించాడు.

జాతికి నమ్మకం ప్రాణం అది పోయింది నీవు దిగజారావు
ఆకర్షణ శక్తిపోతే ఆకాశంలో గ్రహాలేమౌతాయి? (IX-2)
క్రైస్తవులనుంచి షోకులు నేర్చావు
నీ నాగరికత నేర్చావు హిందువులనుంచి

ముస్లిం జాతి అని ఎలా చెప్తావు?
సిగ్గుముఖం దాచాలి యూదుల నుంచి. (XVII-2)

నీ దేశ గగనంలో వెలుగొందావు
తళతళమెరిసే నక్షత్రంలా
భారతీయ విగ్రహాలను భూచావు
నీలో పుట్టిందొకవి బ్రహ్మంలా (XXIII-1)

ఇది అమాయక, దేశభక్తి ముస్లింలను రెచ్చగొట్టి, మూక ఉద్రేకాన్ని, విజాతీయతను సాధించటానికి కావాలని అతిగా చేసి వ్రాసిన కావ్యం. దేశీయ భావాల్ని నాశనం చెయ్యటానికి మతం పేరుమీద మేధ చేసిన ప్రయత్నం ఇది.

కవివిసరిచిం దోపీర ఒంటెలబిడారు
కొండలేదు గుట్టలేదు అడ్డూ ఆపూలేదు
దాటించి సప్తసంద్రాలూ వీరకటారు
కానీ మునిగింది గంగలో రూపూ ఐపూ లేదు!

హాలి వ్రాసిన ఈ కవిత మరీ రెచ్చగొట్టేదిగా వుంది!

సితాల ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే ముస్లింలను ఎలాగైనా రెచ్చగొట్టి జాతీయతా భావాలను రూపుమాపటానికి చేసిన ప్రయత్నాలివి.

పాకిస్తాన్‌కోసం ఇన్ని ప్రయత్నాల అవసరాన్ని, ముస్లింలను పూర్తిగా జాతీయతా మార్గంనుండి తప్పించాలని పడ్డ ఆరాటాన్ని గమనిస్తే విసంస్కృతీపరణ విష్యము ఆనాటికే తీవ్ర ధోరణిలో వుందని గ్రహించవచ్చు. ఆటుతర్వాత అది పతాకస్థాయిని చేరుకుంది.

ఈ విజాతీయ భావాల్ని పెంచి పోషించినదానికి మనం ముస్లింలను గాని, ఇస్లాంనుగాని తప్పుపట్టక్కర్లేదు. తక్షణ ఫలితాలకు ఆశపడి దేశ శ్రేయస్సును, సత్యమార్గాన్ని త్యాగంచేసిన మన నాయకుల హ్రస్వదృష్టి వల్ల, వాళ్ళకు చక్కటి ఆలోచనలు లేకపోవటంవల్ల మతతత్వ రథం కదిలింది. సాగిపోతోంది. వర్గతత్వ, మతతత్వ ముస్లింలు ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని మరెంత చురుగ్గా ముందుకు సాగిపోయారు.

# 22. స్వదేశీ క్రైస్తవులకోమాట

"రక్షకుడు దేవదూత. ఓ చక్రవర్తి ప్రతినిధి లాంటి వాడు. సుదూర ప్రాంతంలో అలజడి చెలరేగితే దాన్ని అణచటానికి చక్రవర్తి తన ప్రతినిధిని పంపుతాడు. అలానే ప్రపంచంలో ఎక్కడ ధర్మచ్యుతి ప్రబలుతుందో భగవంతుడు అక్కడికో రక్షకుణ్ని పంపుతాడు. అలాంటి రక్షకుడే ఒకచోట ఈ జీవితసాగరంలో మునిగి కృష్ణుడిగా ఒక చోట క్రీస్తుగా ఒకచోట ప్రఖ్యాతిగాంచుతాడు"

—భగవాన్ శ్రీరామకృష్ణ.

భారతదేశంలో క్రీస్తుకు ఆయన అనుయాయులు యోజనా బద్ధంగా తప్పుడు వ్యాఖ్యానాలను ప్రచారం చేశారు. క్రీస్తు ఓ వర్గనాయకుడనీ, ఆయన దృక్పథం ప్రత్యేకమైందనీ, ప్రకృతి సహజంగా మానవ మనస్సు విభిన్న ధ్యేయాలు కలిగివుండటాన్ని, ఇష్టా యిష్టాలు కలిగివుండటాన్ని క్రీస్తు సహించేవాడు కాడనీ ఓ ప్రచారం,

"సీజర్ కివ్వాల్సినవి సీజర్‌కు, దేవుడికివ్వాల్సినవి దేవుడికి ఇవ్వండి" అన్న క్రీస్తు సలహాను కావాలనే మార్చిపోయారు. కొందరు శిష్యులు అతన్ని అన్ని సాంఘిక వ్యవస్థలకు, ఆధ్యాత్మిక చింతనలకూ శత్రువుగా చిత్రించారు. ఈ విశ్వబోధకుడిని అతని శిష్యులమని చెప్పుకుని తిరిగే వాళ్ళ తప్పుడు ప్రచారాలనుంచి రక్షించి అతని పేరును కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుంది. క్రీస్తుకు న్యాయం చేకూర్చాలి!

## భౌతికవాదులు నిజమైన క్రైస్తవులు కాదు

క్రీస్తు సందేశాన్ని భౌతికానందానికి ప్రాధాన్యతనిచ్చే పెట్టుబడిదారీ పాశ్చాత్య దేశాలు అర్థం చేసుకోలేవు. స్వామి వివేకానంద చెప్పినట్లు "ఆసియావాక్కు ధార్మికం; ఐరోపావాక్కు రాజకీయం!" నాజరత్ ప్రవక్త తూర్పు దేశవాసుల పంథాలో అగ్రగణ్యుడు. పాశ్చాత్యుల్లో భౌతికవాదులు కానివారు అరుదు. ఈ మానవతా బోధకుడు చెప్పిన వాటిని ఎందరు అర్థం చేసుకోగలరు? "మీలో ఎవరైనా సరే సర్వస్వాన్ని సమర్పించనివాడు నా శిష్యుడు కాలేడు." "మనిషి కేవలం రొట్టె ముక్కలతో బ్రతకలేడు. దైవ వాక్కులతోటేనని వ్రాసివుంది" "నక్కలకు బొక్కలున్నాయి. పక్షులకు గూళ్ళున్నాయి. మానవ సంతానానికే తలదాచుకోను చోటులేదు." అన్న అమృత వాక్కులు భౌతికవాదుల గుండెల్లో ఇంకా వున్నాయా? ఒకవేళ క్రీస్తు మళ్ళీ దిగివచ్చి "మీకున్నదంతా అమ్మి బీదలకు పంచండి. స్వర్గంలో మీకు నిధి దొరుకుతుంది. రండి మీ క్రాస్‌లు ఎత్తుకుని నన్ను అనుసరించండి!" అన్నాడనుకోండి. ఎందరాపని చేస్తారు?

## నాజరత్‌కు మార్గం

భారతీయ క్రైస్తవులు ఈ ధర్మభూమిలోని సాధుసంతుల జీవితాల ద్వారానే క్రీస్తును తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. అప్పుడే ఆయన

సరిగ్గా, సంపూర్ణంగా అర్థమవుతాడు. నాజరత్ మార్గం ఆధ్యాత్మిక తూర్పు నుంచేగాని భౌతిక విలాస పశ్చిమాన్నుంచి లేదు. ఈ సందర్భంలో ధార్మిక క్రైస్తవులు గుర్తుంచుకోవల్సిన సత్యం ఒకటుంది.

క్రీస్తుయొక్క సరియైన వర్ణన కొత్త నిబంధనలోకూడా దొరకదు. జీసస్ భౌతిక వర్ణనగురించి 'కార్లైలే' తను విన్నదాన్లో మూడోవంతు స్వీకరించి సమకూర్చాడు. ఈ కాలంలో కాలాన్ని జయించిన యోగి రామకృష్ణ పరమహంస. ఏ కాలానికి చెందిన ఏ వ్యక్తితోనైనా యోగసమాధి సాధనతో ఎదురెదురుగా నిలబడి మాట్లాడేశక్తివున్న వాడీ పరమహంస. ఆయన క్రీస్తును దివ్యదృష్టితో దర్శించగలిగాడు.

## క్రైస్తవ ఇతిహాసాలు

ఇతిహాసాలనేవి మతంలో భాగాలు. క్రైస్తవ ఇతిహాసాలు కూడా హిందూ ఋషుల కథల్లాటివే. హిందూ శ్రుతుల్లో, ధర్మగ్రంథాల్లో లేనిది క్రీస్తు చెప్పలేదు. ఆ దేవుడి కుమారుడి పేరు వినకుండా, ఎప్పుడూ బాప్టైజ్ (Baptise) చెయ్యబడకుండా కూడా క్రైస్తవ జీవితాన్ని ఎవరైనా గడపవచ్చు. ఇతిహాసాలు ఎవరివి వారికుండవచ్చు.

"మా పవిత్ర మతాన్ని గురించి తెలియక పోయినా, ప్రతివారి హృదయంలో దేవుడి ప్రభావం వల్ల కలిగే సహజ స్పందనవల్ల ఆయన్ని అంగీకరిస్తూ సత్ప్రవర్తితులై ఆ దివ్య తేజోమయ దీపకాంతిలో న్యాయ మార్గాన్ని అనుసరించే వారికంతా మోక్షప్రాప్తి కలుగుతుంది. తనుగా తెలిసి ఏ తప్పులూ చెయ్యనివారిని దయామయుడైన ఆ పరమాత్ముడు, అందరి హృదయాల్లో, మనస్సుల్లో, ఆలోచనల్లో నెలవుండే ఆ దయామయుడు తప్పక ఉద్ధరిస్తాడు. ఎటువంటి పరిస్థితుల్లోనూ శిక్షించడు" అన్నాడు పోప్ పయస్ ix.

ఈ "ప్రకృతి సహజ చట్టం. సహజ స్పందన, అందరి హృదయాల్లో కలిగే దేవుడి ప్రభావం" అనేది హిందూధర్మ సిద్ధాంతాల భావ ప్రకటనలే అని అందరు మతస్థులకూ తెలుసు. బాప్టిజం అనివార్యంకాదు. అంత ముఖ్యమూ కాదు. కావలసింది జీవించే తీరు. కేవలం సువాక్యాల్ని వల్లించటంకాదు.

"నిరంతరం కేవలం 'దేవా! దేవా!' అని నన్ను స్మరిస్తున్నంత మాత్రాన స్వర్గసామ్రాజ్యాన్ని చేరరు. నా తండ్రి ఇచ్ఛప్రకారం ప్రవర్తించేవాడే స్వర్గంలో వుంటాడు."

క్రైస్తవ మతాన్ని ప్రబోధించే భౌతికవాదులందరికన్నా మహాత్మాగాంధీ మంచి క్రైస్తవుడు. దానికి కారణం ఆయన వైష్ణవ జనుడు కాబట్టి. నిజమైన హిందువు సహజంగానే క్రైస్తవుడు. అలానే నిజమైన క్రైస్తవుడు హిందువే!

## క్రైస్తవ వేదాంతం

"వేదాంతం గురించి బైబిల్ అంతగా ఆలోచించని విషయం మనం గమనించవచ్చు. బైబిల్ బోధలను పొందినవారు ప్రాథమిక ఇతిహాస జ్ఞానం కలవాళ్ళే గాని వేదాంత జ్ఞానం కలవాళ్లుకాదు కాబట్టి వాళ్ళకు అంతమాత్రమే బోధించటం జరిగిందని మనం నిర్ధారించుకోవాలి. కాని ఆ సాధారణ బోధల్లోనే నిజానికి అద్వైతాన్ని బోధించటం మనం గమనించవచ్చు.

'ఆ దైవసామ్రాజ్యం నీలోనే వుంది!'

'మీరే దేవుళ్లు!' ఇలాంటివే.

"ఇంకా సెయింట్ జాన్ యొక్క 'గాస్పెల్', 'ఎపిజిల్స్', 'రెవిలేషన్'లలో; గ్రీకు, రోమ చారిత్రక గ్రంథాల్లోనూ మనకు కనిపించేవి, అందులోని కొన్ని వాక్యాలు మనకు స్పష్టంగా నిరూపించేది ఒకే విషయం. క్రీస్తు భారత్ నుంచి అద్వైత వేదాంతాన్ని గ్రహించి పాలస్తీనాలో బోధించాడన్న సత్యం. ఆయన ప్రియశిష్యుడు సెయింట్ జాన్ ఒక్కడే ఆయన వేదాంత బోధల్ని గ్రహించాడన్న విషయం సుస్పష్టం" అన్నారు స్వర్గీయ శ్రీ జగద్గురు శంకరాచార్య, శ్రీ భారతీకృష్ణతీర్థస్వామి.

## సృష్టి రహస్యం

సృష్టిరహస్యం గురించి శ్రీ జగద్గురు శంకరాచార్య ఇలా అంటారు:

"ఈ విషయంలో ఉపనిషత్తులకు, బైబిల్‌కు కొద్ది తేడావుందేగాని వైవిధ్యం లేదు. బైబిలు మొదటి పుస్తకం, మొదటి అధ్యాయంలోని మొదటి పద్యంలో 'తొట్టతొలుత భగవంతుడు స్వర్గాన్ని, భూమిని సృజించెను' అని వుంది. ఉపనిషత్తుల్లో మనకిపరకే వున్న వివరాలతో ఈ అధ్యాయం సరిపోల్చవచ్చు. దేవుడు మొట్టమొదట స్వర్గాన్ని, భూమిని సృష్టించాడు అని ఒప్పుకుంటే అంతకుముందు ఆ దేవుడు తప్ప మరేదీ లేదని ఒప్పుకున్నట్లే గదా! మరి ఆయన వాటిని సృష్టించాడు అంటే ఏ సామగ్రితో సృష్టించాడు? ఈ విశ్వాన్ని సృష్టించేముందు ఒక్క దేవుడేగాక సృష్టికి కావలసిన వాస్తుసముదాయం కూడా వున్నట్లేగా! కాని ఉపనిషత్తులు, బైబిల్ ప్రకారం 'ఆయన తప్ప మరేదీ లేదు' అన్నట్లయితే అప్పుడున్న ఆయన్నుంచే సృష్టి ఉద్భవించి వుండాలి."

## ఉపనిషత్ సంకల్పం

"దేవుడిలా అన్నాడు: 'వెలుతురు వుండనీ!' వెలుతురు వచ్చింది!" అన్నది బైబిల్ వాక్యం. ఈ సందర్భంలో జగద్గురు ఉపనిషత్ సంకల్పం

"ఏకోహంబహుశ్యాం!"ను వివరించారు. "నేను ఒక్కడినే. బహురూపు డను కావాలి" అన్న ఈ వాక్యం దేవుడికి, సృష్టికి, వెలుతురుకు, సృష్టి కర్తకు గల సంబంధాన్ని తెల్పుతుంది.

## క్రైస్తవం యొక్క ఆశయం

అన్ని మతాలూ చేరేది అద్వైతానికే. పర్వతాన్ని ఏవైపునుంచైనా ఎక్కవచ్చు. అగ్రానికి చేరేసరికల్లా అన్నిమార్గాలూ కలుస్తాయి. హిందూ దేశంలో మన ఋషులు ద్వైతాన్ని ప్రారంభించి, విశిష్టాద్వైత్వం ద్వారా పయనించి శిఖరాగ్రమైన అద్వైతాన్ని చేరుకున్నారు. జీసస్ ఆధ్యాత్మిక ప్రయాణమూ అలానే సాగింది.

మొదటి స్థాయి ద్వైతం ప్రార్థన ద్వారా తెలుస్తుంది. "స్వర్గంలో మన తండ్రి తన పేరుతో సర్వులను పావనం చేస్తున్నాడు."

రెండవ స్థాయి "నేను నా తండ్రిలో వున్నాను" అనటం. "నేను నీలో, నీవు నాలో" అనటం.

అటుతర్వాత అత్యుత్తమ జ్ఞానప్రాప్తి తర్వాత "నేను నా తండ్రీ ఒక్కటే. నేనే మార్గాన్ని, సత్యాన్ని, (జీవితాన్ని) జీవాన్ని" అన్నాడు జీసస్. ఇదే అద్వైతం!

ఈ విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోకపోతే జీసస్ చెప్పిం దాంట్లో వ్యతిరేకతలు, అసందర్భాలూ కనిపిస్తాయి.

## క్రైస్తవ చర్చి

చర్చిని జీసస్ స్థాపించలేదు. సెయింట్ పాల్ స్థాపించాడు. అతని ప్రాతలు చర్చి మొదటి ఆశయాల్ని ఉటంకిస్తాయి. జీసస్ మాటే క్షమ,

క్రీస్తు మిథ్యా శరీరంగా చర్చిని రక్షకుడు ఎప్పుడూ వర్ణించలేదు. ఆయన వర్ణనగా చెప్పివుండొచ్చు. "నేను ద్రాక్ష చెట్టును, మీరు కొమ్మలు." ఇది పోలికే! చర్చిని శరీరంతో పోల్చటం సెయింట్ పాల్ మేధాప్రజ్ఞే! అద్వైత పుత్రుడు మతాన్ని సంస్థాగతం చెయ్యాలని అనుకున్నట్లు ఎక్కడా నిదర్శనాలు కనిపించవు. ప్రతి మతస్తుడు సభ్యుడైన అదృశ్యోపాసనిక సహజ వ్యవస్థ ఆయనది.

## క్రైస్తవ వేదాంతం

క్రైస్తవ వేదాంతాన్ని క్రీస్తు చెప్పలేదు. కాని, హిందువులకు సహజంగానే క్రైస్తవ వేదాంతంలోని మూడు మూల సూత్రాలు మానవ జన్మ; ప్రాయశ్చిత్తం-ఐక్యం, త్రిమూర్తిత్వాల గురించి మరో అభిప్రాయం లేదు. క్రైస్తవ వేదాంతులు ఈ మూటికి సరియైన వివరణను ఇవ్వలేక పోయినా, విఫలులైనా, హిందూత్వం మాత్రమే ఈ విషయంలో న్యాయం చేకూర్చగలదు. హిందూ నమ్మకమైన 'అవతారం' ద్వారా తప్ప జన్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేం. మానవుడికి భగవంతుడికి మధ్యవున్న అగాధాన్ని చక్కటి సమాధానాల ద్వారా, దినచర్య ద్వారా పూడ్చుకుని సాగేవారి అంతిమ అనుభవం అద్వైతం, అనే ఐక్యం. త్రిమూర్తిత్వ సిద్ధాంతం చర్చివారికే కొరుకుడపడని చింత. "సత్యమే. కాని మానవ మేధకు అందని లోతుల్లో వున్నది." విశిష్టాద్వైతాన్ని సరిగా అర్థంచేసుకో నంతకాలం ఈ త్రిగుణ భావం అర్థంకాదు. హిందూత్వం, క్రైస్తవ వేదాంత సూత్రాలను సరిగా అర్థం చేసుకోవటానికి దోహదం చేస్తుంది. కాని, ఏదిఏమైనా క్రైస్తవ వేదాంతం క్రీస్తుది కాదు, సెయింట్ పాల్ సృష్టి అన్న విషయం మాత్రం నిర్వివాద సత్యం.

అలానే పునరుజ్జీవనాన్ని కూడా జీసస్‌కు ముడిపెట్టరాదు. హిందువుల ఆలోచనలో పునర్దర్శనంలో వింత లేదనుకొండి!

## మేలిమి బంగారం, చెత్తాచెదారం

వేదాంత పరిధిలో అడుగుమెట్టులో వున్నవాళ్ళకు పనికివచ్చినా ఏ మతం గురించి సరిగా అర్థం చేసుకోవాలన్నా మొక్కజొన్నలోంచి చెత్తనుు, బంగారంనుంచి కల్తీలోహాలను (కల్మషాలను)తొలగించి చూడాలి. స్వామి వివేకానంద అన్నట్లు క్రీస్తు చెప్పిందీ చేసిందీ మనకు లభించేది నామమాత్రమే. అక్కడోముక్క ఇక్కడోముక్క ఆయనఅన్న ప్రతిమాట, చేసిన ప్రతి పని వ్రాసిపెట్టి వున్నట్లయితే ప్రపంచం నిండిపోయేదట.

"జీసస్ అన్నాడు అన్న ప్రతిమాటను క్రొత్త నిబంధనలోంచి తీసి చదివితే రెండుగంటలు చాలు" అన్నాడు హూస్టన్ స్మిత్. జీసస్ బోధల్లో హిందూ వ్యతిరేకమైంది ఏదీలేదు.

"దైవజ్ఞానం స్థానిక ఆచారాలను, నాగరికతలను బట్టి, వివిధ వ్యక్తుల స్వభావాన్నిబట్టి రూపాంతరం చెందుతూంటుంది." ఇది సహజమే! వివిధ కాలాల్లో, వ్యక్తుల స్థాయినిబట్టి ఒకే ఆధ్యాత్మిక చింతనను భిన్న పరిభాషల్లో చెప్పాల్సివుంది. శ్రీ శంకరాచార్య ఆరవ శతాబ్దపు అరబ్బులకు జ్ఞాన బోధ చెయ్యాల్సివస్తే శంకర భాష్యాన్ని చెప్పలేడుగదా!

వైరాగ్యానికి దృష్టాంతం మామూలుగా మనంచెప్పే 'పద్మపత్రమివాంభసి'. కాని తామరను, సరస్సును చూడని వాళ్ళకు ఈ ఉపమానం ఏం అర్థమౌతుంది! ఓ సాధారణ యూరోపియన్‌కు శక్తి సూచకం హెర్క్యులెస్, హనుమాన్‌కాదు. అదే హిందువును అఖిల్లిస్‌ను ధైర్యానికి, యులిసిస్‌ను జ్ఞానానికి ఆరాధించమంటే గ్రీకు, రోమన్ భాషల్లో మాట్లాడినట్లే. ప్రతి బోధకుడూ తన శిష్యుడి స్థాయిలో భాషను ఎన్నుకోవాలి. మహారాష్ట్రలో తొలి క్రైస్తవ మిషనరీలు రామాయణం శైలిలో క్రీస్తాయ

జాన్ని రూపొందించారు. ఏ ప్రవక్తకైనా తన తోటి వారికి బోధించేప్పుడు పరిసరాలను, స్థానిక ఆచారాలను, అక్కడ వాడుకలో వున్న పోలికలను, సామెతలను, ఉదాహరణలను, పూర్వచారిత్రక విశేషాలను విస్మరిస్తే ఎలా ప్రభావాన్ని చూపగలడు, బుద్ధుడు ఇరవై శతాబ్దాలకుముందు పాలస్తీనాలో అవతరించివుంటే ఆయన బోధలు మరో రూపంలో వుండేవి, ఆయన మరోరకం ఉపమానాలను చెప్పివుండేవాడు. అక్కడి దృశ్యాలు, స్థావరాలు, వర్గాలు, ధోరణులు, కవితలు, పాలస్తీనా పోకడలు ఆయన బోధల్లో 'ధమ్మం'లో ప్రస్ఫుటంగా కనిపించేవి. ఇవన్నీ బాహిర భేదాలు. కాని మౌలికబోధల్లో మాత్రం మార్పుండేదికాదు. నిజమైన ఆపేక్షకుడు స్వచ్ఛ స్వర్ణంకోసమే తపిస్తాడు. కల్మషంలోని భిన్నత్వం గురించి వాదులాడుతూ కూర్చోడు.

అదృష్టవశాత్తు ఈనాటి మన కాలపు క్రైస్తవులు చాలామంది క్రైస్తవానికి, పాల్ చూపించినదానికి గల భేదాన్ని గుర్తిస్తున్నారు. వీళ్ళు అసలైన క్రైస్తవాన్ని మిగతా క్రైస్తవులకు అందిస్తారని ఆశిద్దాం. క్రైస్తవుల్లో అప్పుడు రాగల మానసిక మార్పుతో స్వామి వివేకానందుడి మాటల్ని ప్రతి భారతీయుడు స్వచ్ఛందంగానే స్మరించగలడు.

"నేను తూర్పు దేశాలవాడినై నాజరెత్‌కు చెందిన జీసస్‌ను ఆరాధించవలసి వస్తే నాకున్నది ఒకే మార్గం. ఆయన్ను దైవస్వరూపంగానే తప్ప మరోలా ఆరాధించను."